www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 02 సెప్టెంబర్ 2025 | 5 | ఏలూరు

14 మందికి కృత్రిమ కాళ్లు

ఆగిరిపల్లి : చుండూరి కోటయ్య-రామశేషమ్మ ఛారిటబుల్ ట్రస్టు ఆర్థిక సహకారంతో మండల పరిధిలోని తోటపల్లి హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో ఆంధ్రా, ఒడిశా రాష్ట్రానికి చెందిన 14 మందికి 15 కృత్రిమ కాళ్లను అందించినట్లు హీల్ సిఇఒ కూరపాటి అజయ్‌కుమార్ తెలిపారు. హీల్ కృత్రిమ అవయవ కేంద్రం ద్వారా అందిస్తున్న హైటెక్ కృత్రిమ కాళ్లు తక్కువ బరువు కలిగి ఉండి ఎక్కువ కాలం మన్నుతాయన్నారు. చుండూరి కోటయ్య-రామశేషమ్మ ఛారిటబుల్ ట్రస్టు ఇప్పటి వరకు హీల్ కృత్రిమ అవయవకేంద్రం ద్వారా 40 మంది వికలాంగులకు కృత్రిమ కాళ్లను అందించినట్లు చెప్పారు. హీల్ సంస్థ తరపున ఇప్పటివరకు 767 మంది వికలాంగులకు కృత్రిమ కాళ్లను అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు మండవ వెంకటేశ్వరరావు, త్రిపురనేని శ్రీనివాస్, హీల్ ప్రిన్సిపల్ వై.లతాచౌదరి, సీనియర్ టెక్నీషియన్ కె.చిన్నా, కృత్రిమ అవయవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగులపై.. పింఛన్ల కోత కత్తి..!

వచ్చే నెల పింఛన్‌పై మళ్లీ గుబులు
ఏలూరు జిల్లాలో 4,300, పశ్చిమలో 1,817 మందికి నోటీసులు
తీవ్రమైన ప్రతిఘటనతో ఈ నెల పింఛన్ సొమ్ము అందజేత
అప్పీల్ చేసుకున్న పింఛన్‌దార్లకు మళ్లీ వైద్య పరీక్షలు
ఇదేం దారుణమంటున్న వికలాంగులు

ఏలూరు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న వికలాంగులు (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వికలాంగుల మెడపై పింఛన్ల కోత కత్తి వేలాడుతూనే ఉంది. వచ్చే నెల పింఛన్ అందుతుందో, లేదో తెలియని పరిస్థితి నెలకొంది. అంగవైకల్యం శాతం సరిగా లేదంటూ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వేలాది మంది వికలాంగుల పింఛన్లను నిలిపివేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. దీంతో వికలాంగులు, ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురుకావడంతో వెనక్కి తగ్గిన ప్రభుత్వం ఈ నెల పింఛన్ సొమ్ము అందరికీ అందించింది. వచ్చే నెల పింఛన్ సమయానికి ఏరివేత పూర్తవుతుందని చెబుతోంది. దీంతో నోటీసులు అందుకున్న వికలాంగుల్లో మళ్లీ తీవ్ర ఆందోళన నెలకొంది. ఏలూరు జిల్లాలో మొత్తం 2,61,221 పింఛన్లను ప్రతినెలా పంపిణీ చేస్తున్నారు. ఇందులో 30 వేల వరకూ వికలాంగుల పింఛన్లు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వికలాంగుల పింఛన్లకు సంబంధించి వెరిఫికేషన్ నిర్వహించింది. ఇప్పటి వరకూ జరిగిన వెరిఫికేషన్‌లో 4,300 మందికి అంగ వైకల్యం 40 శాతంలోపే ఉందని, వీరికి పింఛన్ నిలుపుదల చేస్తామని నోటీసులు జారీ చేసింది. అదేవిధంగా పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 2,26,513 మంది పింఛన్‌దారులు ఉండగా ఇందులో 27,591 మంది వికలాంగులు ఉన్నారు. వైద్య పరీక్షల అనంతరం 1,817 మందిని అనర్హులుగా తేల్చి నోటీసులు జారీ చేశారు. అధికారులు అనర్హులుగా ప్రకటించిన జాబితాలో 90 శాతం వైకల్యం ఉన్న వారు సైతం ఉండటం గమనార్హం. తీవ్రమైన వైకల్యం ఉన్నవారిని సైతం 40 శాతంలోపు వైకల్యం ఉందంటూ అనర్హులుగా తేల్చడం ఏమిటో ఎవ్వరికీ అర్థంకాని పరిస్థితి. వికలాంగుల పింఛన్లను నిలిపివేసే ప్రక్రియలో భాగంగా జారీ చేసిన నోటీసులపై వికలాంగులంతా భగ్గుమన్నారు. వీరికి ప్రజలు సైతం మద్దతు పలకడంతో తీవ్ర ఆందోళనలు సాగాయి. జిల్లా కలెక్టరేట్ల వద్ద జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న పింఛన్‌దారులను చూసి అంతా తీవ్ర ఆవేదనకు గురైన పరిస్థితి. తీవ్ర వైకల్యం ఉన్నవారికి వైకల్యం తగ్గిందని ఏవిధంగా నిర్ధారించారో ఎవ్వరికీ అర్థం కాలేదు. ప్రభుత్వం పింఛన్లను తగ్గించుకోవడానికి ఉద్దేశపూర్వకంగానే అనర్హులుగా ప్రకటించిందనే విమర్శలు వెల్లువెత్తాయి. వికలాంగులకు ప్రజల, రాజకీయ పార్టీల మద్దతు లభించడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది.

మళ్లీ వైద్య పరీక్షలంట..!

అనర్హులుగా పేర్కొంటూ నోటీసులు జారీ చేసిన వికలాంగులకు సెప్టెంబర్ ఒకటో తేదీన ఇచ్చే పింఛన్ సొమ్ము నిలుపుదల చేయాలని ప్రభుత్వం తొలుత భావించింది. ఊహించని విధంగా తిరుగుబాటు రావడంతో తాత్కాలికంగా వెనక్కి తగ్గి ఈ నెల పింఛన్ సొమ్ము అందిస్తున్నట్లు తెలిపింది. నోటీసులు అందుకున్న వికలాంగులంతా అప్పీల్ చేసుకోవాలని సూచించింది. నోటీసులు అందుకున్న వారంతా దాదాపుగా అప్పీలు చేసుకున్నారు. దీంతో ప్రభుత్వం మరోసారి వీరందరినీ వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెబుతోంది. రీవెరిఫికేషన్ పేరుతో ఇప్పటికే వికలాంగులను ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. వెరిఫికేషన్ కోసం వస్తున్న వికలాంగులు ఆసుపత్రుల వద్ద నానాఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు మరోసారి వైద్యపరీక్షల వెరిఫికేషన్‌కు హాజరు కావాలని ప్రభుత్వం చెప్పడంపై వికలాంగులు మండిపడుతున్నారు. వికలాంగులు వెరిఫికేషన్‌కు రావాలంటే వారికి తోడు మరొకరు ఉండాలి. ఒకరోజు వస్తే ఎప్పటికి అవుతుందో తెలియని పరిస్థితి. వైద్య పరీక్షల ఆధారంగా కాకుండా వారికి నచ్చినట్లుగా వైకల్యం శాతం వేసి నోటీసులు ఇచ్చారనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టరేట్ వద్ద ఆందోళనల్లో పాల్గొన్న వికలాంగులను చూస్తే అదే నిజమని అందరికీ తెలుస్తోంది. 90 శాతం వైకల్యం ఉన్నవారికి కూడా 40 శాతంలోపు ఉందని ప్రభుత్వ ఉద్యోగులు అవకాశాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. వికలాంగుల మెడపై పింఛన్ల కోత కత్తి పెట్టి ప్రభుత్వం వికట్టహాసం చేస్తుందనే చర్చ సాగుతోంది.

నిలకడగా గోదావరి వరద

రహదారులను వీడని ముంపు
భద్రాచలంలో తగ్గుముఖం

వేలేరుపాడు : పడవపై ప్రయాణిస్తున్న రుద్రంకోట వాసులు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

ఆరు రోజులుగా కొనసాగుతున్న గోదావరి వరద ఉధృతి సోమవారం నిలకడగా ఉంది. భద్రాచలంలో వరద తగ్గుముఖం పట్టడంతో మంగళవారం ఇక్కడ కూడా ఎంతోకొంత వరద తగ్గే అవకాశం ఉందని అధికారుల అంచనా. అయితే శబరి నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మండలంలో గోదావరి ఏమాత్రం తగ్గుముఖం పట్టేది కనిపించడం లేదు. ఇప్పటికే రెండు వారాలుగా కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు కాజ్‌వే ముంపులోనే ఉండటంతో వాగు 12 గ్రామాలకు రాకపోకలు నిలిచే ఉన్నాయి. మండలంలోని ముత్యాలంపాడు-విజరం మధ్య పాలవాగు కాజ్‌వే ముంపులోనే ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులు, వ్యాపారులు మండల కేంద్రానికి రావాలంటే చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది.

వేలేరుపాడు రూరల్: మండలంలోని రుద్రంకోట, రేపాకగొమ్ము, తాట్కూరుగొమ్ము, కోయిదా, కట్కూరు తదితర లోతట్టు గ్రామాల ప్రజలను వరద భయం వెంటాడుతూనే ఉంది. వేలేరుపాడు నుంచి కోయిదా వెళ్లే మార్గంలో మేళ్ల వాగు వద్ద రహదారిపై వరద ముంచెత్తడంతో కన్నాయిగుట్ట, కొత్తూరు, ఎడవల్లి, చిగురు మామిడి, తూర్పు మెట్ట, నాల్లవరం, కోయిదా తదితర 25 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద ఎప్పుడు తగ్గుతుందోనని జనం ఎదురుచూస్తున్నారు.

అర్జీల పరిష్కారం పారదర్శకంగా ఉండాలి

ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలి
జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి
పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలు 253


ఫిర్యాదులు స్వీకరిస్తున్న జెసి ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను నాణ్యంగా, పారదర్శకంగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్‌తోపాటు డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్, ఎస్‌డిసి కె.భాస్కర్, జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి, డిఆర్‌డిఎ పిడి ఆర్.విజయరాజు, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.ముక్కంటి, సర్వే సహాయ సంచాలకులు అన్సారీ, నగరపాలక కార్పొరేషన్ కమిషనర్ ఎ.భానుప్రతాప్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. తమ శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి సిబ్బందితో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. కొన్ని సందర్భాల్లో ఫిర్యాదుల పరిష్కారానికి కొంత సమయం అవసరం ఉన్నప్పుడు సంబంధిత విషయాన్ని ఫిర్యాదుదారులతో అధికారులు మాట్లాడితే వారికి కొంత ఊరట కలుగుతుందన్నారు. ఫిర్యాదులు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖకు ఎండార్స్ చేసి పంపాలని, కాలయాపన చేస్తే ఫిర్యాదుదారులు అసంతృప్తి చెందుతారని అన్నారు. అర్జీలు రీఓపెన్ కాకుండా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పిజిఆర్ఎస్‌లో వచ్చిన 253 అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, జిల్లా కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

సోషలిజమే సమాజాభివృద్ధికి దిక్సూచి

ఆర్థిక, కుల అంతరాలతో సమస్యలెన్నో
శ్రమను గౌరవిస్తేనే దేశం అభివృద్ధి
ఆర్ఎస్ఎస్, బిజెపి చెప్పేదొకటి.. చేసేదొకటి
సమాజంలో సోషలిజంపై పెరుగుతున్న అభిమానం
సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

మాట్లాడుతున్న బివి.రాఘవులు

ప్రజాశక్తి - భీమవరం

సోషలిజమే సమాజ అభివృద్ధికి దిక్సూచి అని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. శ్రమను గౌరవిస్తేనే దేశం అభివృద్ధి వైపు వెళ్తుందని, దీనిని గమనించకపోతే మరికొన్నేళ్లు ఇలాగే ఉంటామని తెలిపారు. ప్రతి కుటుంబానికీ, ప్రతి మనిషికీ తిండి, ఇల్లు, విద్య, ఆరోగ్యం, నీరు హక్కుగా కల్పించేందుకు రాజ్యాంగంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. స్థానిక త్యాగరాజ భవనంలో సోషలిజం-విశిష్టత అనే అంశంపై సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సెమినార్‌కు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షత వహించారు. ముఖ్యవక్త బివి.రాఘవులు మాట్లాడుతూ కులం, ఆర్థిక అంతరాలతో ఎన్నో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ఇవి లేకపోతే సగం సమస్యలే ఉండవని అన్నారు. సోషలిజంపై ఆదరణ, అభిమానం పెరుగుతుంటే అమెరికా అధ్యక్షుడు ట్రంప్, బిజెపి, ఆర్ఎస్ఎస్ నేతలకు భయం పుట్టుకొస్తుందన్నారు. సోషలిజం రావాలని ఎంతోమంది ఆశాభావం వ్యక్తం చేస్తుంటే, రాకూడదని అదేస్థాయిలో కోరుకుంటున్నారని అన్నారు. రాజ్యాంగంలో ఉన్న లౌకిక రాజ్యం-సోషలిస్టు రాజ్యం అనే రెండు పదాలు ఉండకూడదని ఆర్ఎస్ఎస్ చీఫ్ ప్రకటించడం, కేంద్రంలోని బిజెపి మంత్రులు కూడా ఈ పదాలను తొలగించాలని చెప్పడమే ఈ భయానికి నిదర్శనమన్నారు. విశ్వవిద్యాలయాల్లో అభ్యుదయవాదులు సోషలిజంపై ఆలోచన చేయడం అభినందనీయమని, ఈ తరం కాకపోయినా తర్వాత తరమైనా సోషలిజాన్ని చూస్తారని అన్నారు. కరోనా సమయంలో ప్రజలను కాపాడుకుని మరికొన్ని దేశాలకు వైద్య సహకారం చేసిన దేశాలు సోషలిస్టు దేశాలేనని గుర్తు చేశారు. కులవ్యవస్థ చాలా అమానుషమైనదని, శ్రమ దోపిడీకి మరింత దోహదం చేస్తుందని, శ్రామికుల విభజనకు దారితీస్తుందని అన్నారు. కుల వ్యవస్థను నిర్మూలిస్తేనే సమాజం నిజమైన అభివృద్ధి దిశలో ఉంటుందన్నారు. ఏ దేశంలో అయితే స్త్రీ, పురుష సమానత్వం ఉంటుందో అక్కడ ఉత్పత్తితోపాటు అభివృద్ధి కూడా పెరుగుతుందన్నారు. ప్రస్తుత దేశ జనాభాలో ఒక శాతంగా ఉన్న కుటుంబాల వద్ద 60 శాతం సంపద ఉందని, 99 శాతం మంది ప్రజల వద్ద 40 శాతంలోపే సంపద ఉందని అన్నారు. ప్రపంచ దేశాల్లో యుద్ధాలను ఉపయోగించుకుని ఈ మూడేళ్ల కాలంలో అంబానీకి 16 బిలియన్ల ఆస్తి పెరిగిందన్నారు. పేద, ధనికుల మధ్య వ్యత్యాసం మనదేశంలోనే ఎక్కువగా ఉందన్నారు. బీహార్‌లో లక్షలాది మంది ప్రజల ఓట్లను తొలగించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటం తర్వాత ఏ ప్రభుత్వమూ విద్యుత్ ఛార్జీలు పెంచలేదన్నారు. అయితే నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను ఇబ్బందులు పెడుతున్నాయన్నారు. ప్రపంచ దేశాల యుద్ధాలను తానే ఆపానని, అందుకు నోబెల్ బహుమతి ఇవ్వాలని ట్రంప్ కోరుతున్నాడని అన్నారు. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ దేశాలన్నీ ఏకతాటిపైకి వచ్చి పోరాడుతున్నాయని, అందుకు చైనాలో జరిగిన సమ్మిట్ నిదర్శనమని తెలిపారు. పెట్టుబడిదారీ విధానంలో అన్ని వ్యవస్థలూ నిర్వీర్యమవుతాయన్నారు. విద్యారంగంలో అశాస్త్రీయతను పెంచేలా బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. సైన్స్‌ను మతంతో, మూఢనమ్మకాలతో కలపడం చేస్తున్నారన్నారు. మతం, మత విశ్వాసం వేరని, మతం పేరుతో రాజకీయాలు వేరని అన్నారు. చైనాలో సైన్స్‌తో అద్భుతాలు చేస్తున్నారని, మన దేశంలో ప్రజాప్రతినిధులే మూఢనమ్మకాలను పెంచి పోషిస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలపై ఉద్యమ, పోరాటాలు మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సాంస్కృతికంగా మంచి సమాజాన్ని నిర్మించేలా సిపిఎం కృషి చేస్తుందన్నారు. దీనిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఉచితంగా హక్కుగా ఇవ్వాల్సిన కనీస సౌకర్యాలన్నింటినీ పెట్టుబడిదారులకు ఇచ్చి వాటిని సరుకుగా మార్చి ఖరీదు కడుతున్నారని, అలాంటప్పుడు పేదరికమే పెరుగుతుందని అన్నారు. భవిష్యత్తులో కచ్చితంగా సోషలిజమే ప్రత్యామ్నాయంగా ముందుకొస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ట్రంప్ సుంకాలు పశ్చిమపై పెను ప్రభావం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాల వల్ల పశ్చిమగోదావరి జిల్లాలో ఆక్వా సాగుపై తీవ్ర ప్రభావం పడిందని రాఘవులు అన్నారు. రొయ్యల ఎగుమతులకు ఆటంకాలు ఏర్పడ్డాయన్నారు. 25 శాతం సుంకాలతో ధర తీవ్రంగా పతనం కావడంతో ఆక్వా రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. కేంద్రం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. బియ్యం, పాలు, గోధుమలు, స్టీల్, అల్యూమినియం, కార్లు వంటివి అమెరికా నుంచి పన్ను లేకుండా దిగుమతి చేసుకోవాలని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం ఆక్వా రంగాన్ని పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. బెంగాల్ నుంచి వచ్చిన వ్యవసాయ కూలీలు పశ్చిమగోదావరి జిల్లాలో నాట్లు వేయిస్తున్నారని, దానికి కారణం మీకు తెలుసా అని ప్రశ్నించారు. బెంగాల్‌లో ప్రతి కుటుంబానికీ కులమతాలకు అతీతంగా వ్యవసాయ భూమి పంచిన ఘనత కమ్యూనిస్టులదేనని గుర్తు చేశారు. అక్కడ బాగా వ్యవసాయం చేసిన వారంతా ఇక్కడకు వచ్చి నాట్లు వేస్తున్నారని, ఇది పశ్చిమగోదావరి జిల్లాకు పశ్చిమబెంగాల్ ఇచ్చిన గొప్ప వరమని తెలిపారు. జిల్లాలో కేన్సర్, కిడ్నీ వ్యాధులు విపరీతంగా పెరుగుతున్నాయని, ఆరోగ్యాన్ని కూడా సరుకుగా మారుస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నేత మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, బి.వాసుదేవరావు, కర్రి నాగేశ్వరరావు, పివి.ప్రతాప్, జిల్లా కమిటీ సభ్యులు డి.కళ్యాణి, రిటైర్డ్ ఉద్యోగులు, విద్యావేత్తలు, విద్యార్థులు, మేధావులు, సిపిఎం నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

సోషలిస్ట్ దేశాలు ఆదర్శనీయం..
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం

20 ఏళ్ల క్రితం జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్త బోళ్ల బులిరామయ్య చైనా వెళ్లారని, చైనా అంత అభివృద్ధి మన దేశం ఎప్పుడు సాధిస్తుందోనని అన్నారని బలరాం గుర్తు చేశారు. ఆయనకు కమ్యూనిజంపై ప్రేమ లేదని, సోషలిజంపై ఇష్టం కూడా లేదని, ఆయన ఒక పెట్టుబడీదారుడని అన్నారు. ఎంతోమంది భూస్వాములు, పారిశ్రామికవేత్తలు, జర్నలిస్టులు కూడా చైనా, వియత్నాం వంటి దేశాల్లో పర్యటించి అనేక విషయాలు పరిశీలించారన్నారు. అక్కడ వ్యవసాయం అభివృద్ధి రైతులు సంతృప్తిగా ఉన్నారని చెప్పారన్నారు. పరిశ్రమల అభివృద్ధి, శ్రమకు గుర్తింపు, శ్రామికులకు అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నారన్నారు. ముఖ్యంగా విద్యార్థులు మానసికోల్లాసంతో విద్యను అభ్యసిస్తున్నారని, మన దేశంలోలా విద్యార్థులు ఒత్తిడితో బలవన్మరణాలకు పాల్పడట్లేదని అన్నారు. సమాన హక్కు, గౌరవం, భద్రతతో మహిళలు జీవిస్తున్నారని తెలిపారు. పరిశుభ్రత, పర్యావరణం కూడా ఎంతో బాగుంటుందన్నారు. ముఖ్యంగా ఎటువంటి అంతరాలూ లేవన్నారు. సోషలిస్టు దేశాలు ఎంతో ఆదర్శనీయమని ఎంతోమంది మెచ్చుకున్నారన్నారు.

ప్రభుత్వం, ప్రజల మధ్య వారధి ప్రజాశక్తి

వార్షికోత్సవ సంచిక ఆవిష్కరణలో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు


ప్రజాశక్తి ప్రత్యేక అనుబంధాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ప్రభుత్వం, ప్రజల మధ్య వారధిలా పని చేయడంలో ప్రజాశక్తి దినపత్రిక ఎప్పుడు ముందుంటుందని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. ప్రజాశక్తి దినపత్రిక 45వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధాన్ని సోమవారం బర్రింకలపాడులోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ప్రజాశక్తి పాత్రికేయులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బాలరాజు మాట్లాడుతూ వార్షికోత్సవ అనుబంధం ఆకర్షణీయంగా ఉందని ప్రశంసించారు. నియోజకవర్గంలో ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే కచ్చితంగా పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. దీంతోపాటు ప్రభుత్వ పథకాలపైనా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మీడియాపై ఉందన్నారు. ఏజెన్సీ ప్రాంత ప్రజల సమస్యలను వెలికితీయడంలో ప్రజాశక్తి కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు టి.రవిచందర్, ప్రజాశక్తి ఎడివిటి డివిజన్ ఇన్‌ఛార్జి జి.మాణిక్యాలరావు, పాత్రికేయులు జి.నాగరాజు, జి.మధుబాబు, శివ, రవి, పి.అర్జునరావు, విశ్వనాథ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శివనాగరాజు మృతి తీరని లోటు

సంస్మరణ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

సిపిఎం మంచి క్రమశిక్షణ, అంకితభావం ఉన్న కామ్రేడ్‌ను కోల్పోవడం బాధాకరమని, పూర్తి కాలం కార్యకర్త కాకపోయినా పార్టీ ఇచ్చిన ప్రతి పిలుపులో చురుకుగా పాల్గొనే వ్యక్తి చాకిరి శివనాగరాజు అని, ఆయన మరణం పార్టీకి, కుటుంబానికి తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. సిపిఎం ఆగిరిపల్లి మండల కార్యదర్శి చాకిరి శివనాగరజు కొన్ని రోజుల క్రితం అనారోగ్య సమస్యలతో మరణించారు. ఆయన సంస్మరణ సభ మండల పరిధిలోని గొల్లగూడెం సుందరయ్య నగర్‌లోని ఆయన స్వగృహం వద్ద సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎ.రవి మాట్లాడుతూ మండలంలో జరిగిన అనేక పోరాటాల్లో క్రియాశీలక పాత్ర పోషించారని, కుటుంబ, ఆరోగ్య ఇబ్బందులు ఉన్నప్పటికీ వాటిని లెక్కచేయకుండా పార్టీ ఇచ్చిన ప్రతి పిలుపులో చురుకుగా పాల్గొనేవారన్నారు. నాగరాజు మరణం దిగ్భ్రాంతికరమన్నారు. ముందుగా శివనాగరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎం.నరేష్ అధ్యక్షత వహించగా, గ్రామ సర్పంచి లింగవరపు రమేష్, ఎంపిటిసి సభ్యులు గుర్రం శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కాజ రాంబాబు, పాతూరి రవి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు, నాయకులు సత్తు కోటేశ్వరరావు, హనుమాన్లు, జహీంగీర్ భాషా, చంటి, పాపారావు, గోపాలరావు, రవీంద్ర, రవి, పూర్ణ, రామకృష్ణ, శామ్యూల్, జక్రయ్య పాల్గొన్నారు.

మిడ్డేమీల్ కార్మికులకు జీతాలు పెంచాలి

గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలి
మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి

మాట్లాడుతున్న మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నేతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మధ్యాహ్న భోజనం కార్మికులకు జీతాలు పెంచాలని, గ్యాస్ సరఫరా చేయాలని, యూనిఫామ్ ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా ఆరో మహాసభ జంగారెడ్డిగూడెంలోని యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకానికి నిధులు తగ్గిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం సైతం ఈ పథకాన్ని ప్రయివేట్ వ్యక్తులకు ఇవ్వడం కోసం ప్రయత్నాలు చేయడం దురదృష్టకరమన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల కష్టాన్ని గుర్తించి కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వాలని, కార్మికులపై భారం పడకుండా గ్యాస్‌ను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రెండు దశాబ్దాలకు పైగా పనిచేస్తున్న మధ్యాహ్న కార్మికులకు కేవలం నెలకు రూ.మూడు వేలు ఇచ్చి వారి శ్రమనే ప్రభుత్వాలు దోచుకోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు పసల సూర్యారావు, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు లక్ష్మి, సిహెచ్.విజయకాంత, నరసమ్మ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. తొలుత మహాసభకు ప్రారంభ సూచికంగా సిఐటియు జెండాను ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు సంతాపం తెలిపారు.

ఏలూరుకు వరద ముప్పు!

ప్రజాశక్తి - ఏలూరు

చింతలపూడి సమీపంలోని నాగిరెడ్డిగూడెం రిజర్వాయర్ నుంచి తమ్మిలేరుకు వరద నీరు విడుదల చేస్తుండటంతో ఏలూరు నగరానికి వరద ముంపు పొంచి ఉంది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. నాగిరెడ్డిగూడెం రిజర్వాయర్‌కు పెద్దఎత్తున వరద నీరు చేరుతుండటంతో సోమవారం సాయంత్రం నుంచి ఐదు వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో తమ్మిలేరుకు వరద తాకిడి పెరిగింది. దీంతో శనివారపుపేట కాజ్‌వే నీట మునిగే అవకాశం ఉందని, అటువైపు రాకపోకలు సాగించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏలూరు అర్బన్ తహశీల్దార్ కోరారు. అలాగే సాయి నగర్, తంగెళ్లమూడిలోని అన్న క్యాంటీన్ సెంటర్, కొమడవోలు ఇందిరమ్మ కాలనీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే తంగెళ్లమూడి అన్నక్యాంటీన్ సెంటర్‌లోని 17 కుటుంబాలను పునరావాస కేంద్రానికి తరలిస్తామని తెలిపారు.

టాటా మ్యాజిక్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వాహనాలతో ప్రదర్శన, కలెక్టరేట్ వద్ద ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న టాటా మ్యాజిక్ కార్మికులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

టాటా మ్యాజిక్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏలూరు టాటా మ్యాజిక్ డ్రైవర్, ఓనర్స్ ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు పాత బస్టాండ్ వద్ద నుంచి మ్యాజిక్ వాహనాలతో ప్రదర్శనగా బయలుదేరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వల్ల టాటా మ్యాజిక్ సర్వీస్ ఆదాయం తీవ్రంగా దెబ్బతిందని, కుటుంబ పోషణ మరింత భారంగా మారిందని తెలిపారు. ఉచిత బస్సు సౌకర్యాన్ని స్వాగతిస్తున్నామని, ఆ సౌకర్యం అన్ని బస్సుల్లో మహిళలకు ఉచితంగా కల్పించాలని కూడా డిమాండ్ చేశారు. కాని టాటా మ్యాజిక్ కార్మిక సమస్యలకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని, ఇప్పటికీ కూటమి ప్రభుత్వం ఆటో మోటార్ రంగంపై పెనాల్టీ పేరుతో జిఒ 21 తీసుకొచ్చి ఆటో రంగంపై పెను భారాలు వేస్తుందని, ఈ జిఒ వల్ల రూ.200 నుంచి రూ.20 వేల వరకు భారీ జరిమానాలు వేస్తున్నారని, ఇది ఎంత మాత్రం సరి కాదని విమర్శించారు. ఆటో, టాటా మ్యాజిక్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆ బోర్డు ద్వారా నెలకు రూ.మూడు వేలు పెన్షన్ వచ్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ఐఎఫ్‌టియు ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, ఎన్.దుర్గారావు, బి.వెంకటేష్, బీమా భద్రరావు, పి.వెంకటరమణ, పి.గోపాల్ తదితరులు నాయకత్వం వహించారు.

ఎట్టకేలకు వంతెనకు తాత్కాలిక మరమ్మతులు

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంపై గ్రామస్తుల ఆందోళన

వారం రోజుల్లో పనులు పూర్తి చేస్తామన్న అధికారులు

నారాయణపురం వంతెనపై తాత్కాలిక మరమ్మతు పనులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఏలూరు ప్రధాన కాలువ నారాయణపురం వద్ద శిథిలావస్థకు చేరిన ఆర్అండ్‌బి వంతెన స్లాబ్ తొలగింపు పనులు సోమవారం చేపట్టారు. జూన్ 15వ తేదీన ఈ వంతెన స్లాబ్‌కు ఒకపక్క పాక్షికంగా రంధ్రం పడింది. అప్పటి నుంచి దీనిపై భారీ వాహనాల రాకపోకలను అధికారులు ఆపేశారు. కొత్త వంతెన నిర్మాణానికి నిధుల కొరతగా ఉంది. దీంతో తాత్కాలిక మరమ్మతులు చేసేందుకు ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు ఆదేశాలతో అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. వంతెన స్లాబ్ పూర్తిగా తొలగించాక సాంకేతిక బృందం పరిశీలించాక ఐరన్ గెడ్డర్లపై కొత్తగా సిమెంట్ కాంక్రీట్ స్లాబ్ వేసి తేలికపాటి వాహనాల రాకపోకలు సాగించే లక్ష్యంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఆరు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేస్తామని ఆర్అండ్‌బి డిఇ చెప్పారు. అయితే వంతెన దాటి పెళ్లి ఎందుకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయకుండా వంతెనను మూసేయడం పట్ల గ్రామస్తులు, విద్యార్థులు, వ్యాపారులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అయితే కొత్త బ్రిడ్జి ఇప్పట్లో సాధ్యం కాదని, తాత్కాలిక మరమ్మతులు చేసేందుకు గ్రామస్తులు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రా సరిహద్దు వరకు ఉచిత బస్సు ప్రయాణం

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి మీదుగా అశ్వారావుపేట వెళ్లే బస్సులకు ఆంధ్రా సరిహద్దు వరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిందని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. తెలంగాణ వైపు వెళ్లే బస్సులకు ఉచిత బస్సు ప్రయాణం వర్తించడం లేదని కొందరు తన దృష్టికి తీసుకొచ్చిన నేపథ్యంలో జిల్లా సమీక్ష మండలి సమావేశంలో ఈ విషయం ప్రస్తావించి రవాణా శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి ఆంధ్ర సరిహద్దు వరకు ఉచిత ప్రయాణ టికెట్ వర్తింపజేసేలా కృషి చేసినట్లు తెలిపారు. సత్తుపల్లి వెళ్లే బస్సులకు కూడా త్వరలో ఈ వెసులుబాటు కల్పిస్తామని ఆర్‌టిసి అధికారులు తెలిపారు.

15న చలో విజయవాడ

ప్రజాశక్తి - నిడమర్రు

సంక్షేమ పథకాల అమలు కోసం నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఈ నెల 15వ తేదీన విజయవాడలో రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపట్టినట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు, కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని భువనపల్లి, చానమిల్లి, అడవికొలను గ్రామాల్లో వారు సోమవారం పర్యటించారు. పెదనిండ్రకొలనులో భవన నిర్మాణ కార్మికులు పల్లగాని పెద్దిరాజు అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో రమణారావు మాట్లాడారు. అధికారంలోకొచ్చిన వంద రోజుల్లో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ఎన్నికల సమయంలో పవన్ కళ్యాణ్, లోకేష్ హామీ ఇచ్చారన్నారు. 15 నెలలు కావస్తున్నా నేటి వరకూ సంక్షేమ బోర్డు పునరుద్ధరణ ప్రసక్తే లేదన్నారు. ఈ నెల 15వ తేదీన విజయవాడలో లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడిలో భవన నిర్మాణ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సోడాబత్తుల వాసు, కేశన జగదీష్, పసుపులేటి శ్రీను, అద్దంకి మార్త రాజు, బుంగమూతి జగదీష్, టెంకల శ్రీనివాస్, దోసనపూడి పాండు, గోక సూరిబాబు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సెప్టెంబర్ 15న విజయవాడలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని భవన నిర్మాణ మండలాధ్యక్షులు సిహెచ్.కొండలరావు తెలిపారు. మండలంలోని లక్ష్మీపురం, ములగలంపల్లి, కామయ్యపాలెం యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో ఉన్న పథకాలను అమలు చేయాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడ లోని కమిషనర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు మండలం నుంచి భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.రమణ, కె.కుటుంబరావు, మస్తాన్, రాంబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్, కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) చింతలపూడి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డ్‌లో ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సమితి కార్యదర్శి చేపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని పెండింగ్‌లో ఉన్న 42 వేల క్లెయిమ్లను పరిష్కరించాలని, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తుర్లపాటి బాబు, చింతలపూడి భవన నిర్మాణ కార్మికులు జూపూడి వసంత, కొలుకు పాము శ్రీను, చంద్రు కృష్ణ, బజార్ కృష్ణ, వెంకటరమణ, మాదాసు రాజారావు, కొమ్మన గోపీ, తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి పిహెచ్‌సి వైద్యాధికారిగా పవన్‌కుమార్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



జీలుగుమిల్లి పిహెచ్‌సి వైద్యాధికారి-2గా పి.పవన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన వైద్య వృత్తిలో పీజీ చేసి ఇటీవల జరిగిన వైద్యుల కౌన్సెలింగ్‌లో జీలుగుమిల్లి పిహెచ్‌సికి వచ్చినట్లు తెలిపారు. ఇంతకుముందు ఇక్కడ పని చేసిన వైద్యాధికారిణి గాయత్రి సత్యసాయి జిల్లాకు బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో నియమించారన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది అభినందనలు తెలిపారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తానని తెలిపారు.

డ్రెయినేజీ పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి - ముసునూరు

వర్షాకాలంలో గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పొక్లెయిన్ ద్వారా డ్రెయినేజీ పూడిక తీత పనులు చేపడుతున్నట్లు ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ, టిడిపి గ్రామ అధ్యక్షులు మందలపు ధర్మరాజు తెలిపారు. మండలంలోని గుడిపాడు బిసి కాలనీలో జరుగుతున్న డ్రెయినేజీ పూడిక తీత పనులను వారు సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు, సహకార సంఘం అధ్యక్షులు కొల్లి కృష్ణయ్య, సీనియర్ నాయకులు కొల్లి గంగారామ్, మసిముక్కు సుబ్బారావు, నీటి సంఘం అధ్యక్షులు, వార్డు మెంబర్లు, బూత్ ఇన్‌ఛార్జులు ఉన్నారు.

ఉషోదయ హైస్కూల్ ఆధ్వర్యాన అన్నదానం

ప్రజాశక్తి - ఉంగుటూరు

వినాయక చవితి సందర్భంగా నారాయణపురం ఉషోదయ హై స్కూల్‌లో విద్యార్థులు ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని ఐదో రోజు ఘనంగా ఊరేగించారు. పాఠశాల విద్యార్థుల్లో భక్తి భావం పెంపొందించేందుకు పాఠశాల యాజమాన్యం ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలో గణపతిని విద్యార్థులు గ్రామంలో ఊరేగించి నిమజ్జనం చేశారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. పాఠశాల వ్యవస్థాపకులు గుణ్ణం బుల్లబ్బాయి, సెక్రటరీ, కరస్పాండెంట్ గుణ్ణం నరేన్ చౌదరి, గుణ్ణం గీతావాణి, గుణ్ణం సుధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఊరేగింపు అనంతరం విద్యార్థులందరికీ అన్న సమారాధన నిర్వహించారు.

'కార్యకర్తలకు అండగా వైసిపి'

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

కార్యకర్తల కుటుంబాలకు వైసిపి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నూజివీడు మాజీ ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండల పరిధిలోని అడవినెక్కలంలో ఇటీవల మరణించిన యలమర్తి మేరిమ్మ చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పల్లగాని నరసింహారావు, పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, జెడ్‌పిటిసి సభ్యులు పిన్నిబోయిన వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్ఐసి 69వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రపంచవ్యాప్తంగా బీమా రంగంలో ఎల్ఐసి అగ్రగామిగా నిలిచినట్లు నూజివీడు పట్టణంలోని జీవిత బీమా సంస్థ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ సుధాకర్ అన్నారు. ఎల్ఐసి 69వ ఆవిర్భావ వార్షికోత్సవ సభను సోమవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి సిబ్బంది, ఏజెంట్ మిత్రులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ట్రాక్టర్ బోల్తా : డ్రైవర్ మృతి

ఉంగుటూరు :చేబ్రోలు - తల్లాపురం దారిలో సోమవారం ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందాడు. చేబ్రోలు పోలీసుస్టేషన్ సమీపం మలుపులో ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న పంట బోదెలో బోల్తా పడింది. డ్రైవర్ సింగులూరి రాంబాబు (59) నీటిలో కూరుకుపోయి మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గణపవరం మండలం బావాయిపాలేనికి చెందిన రాంబాబు ట్రాక్టర్‌పై భీమవరం నుంచి చేపల మేత వేసుకుని గుండుగొలను వెళ్లి దిగుమతి చేసి తిరిగి వెళుతుండగా ప్రమాదం జరిగింది. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

తమ్మిలేరుకు వరదనీరు

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని తమ్మిలేరు జలాశయానికి వరదనీరు చేరుతుందని ఇరిగేషన్ ఎఇ లాజర్‌బాబు తెలిపారు. తమ్మిలేరు జలాశయం ప్రస్తుత నీటిమట్టం 348.8 ఉండగా, ఇన్ ఫ్లో ఏడు వేల క్యూసెక్కులు ఉండగా ఐదు క్యూసెక్కులు నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. పెరిగే అవకాశం ఉందని, తమ్మిలేరు జలాశయం పరివాహక ప్రాంతాలు ధర్మాజీగూడెం, గొల్లపూడి, లోపుడి, బలివే, ఏలూరు జలాశయం చుట్టుపక్క ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక 27వ డివిజన్‌లో ఉన్న చొదిమెళ్ల గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి హాజరయ్యారు. ఈ సందర్భంగా ధాత్రిరెడ్డి మాట్లాడుతూ డిజిటల్ రేషన్ కార్డులను చొదిమెళ్ల గ్రామంలో అందించడం సంతోషంగా ఉందన్నారు. పౌర సరఫరా శాఖలో ఇంకా మెరుగైన సేవలు ఎలా ఇవ్వాలో ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. జిల్లాకు రూ.6.14 లక్షల కొత్త కార్డులు వచ్చాయన్నారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 30 ఏళ్ల పూర్తయిన రోజున రేషన్ కార్డులు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు.

దెందులూరు :స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ఇకపై ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత పారదర్శకం, పటిష్టం కానుందని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ చెప్పారు. దెందులూరు నియోజకవర్గ వ్యాప్తంగా 83,695 స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరు చేయగా సోమవారం వాటిని ఎంఎల్ఎ ప్రభాకర్ చేతుల మీదుగా అందించారు. దెందులూరు గ్రామంలో, పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామంలో రేషన్ కార్డులు లబ్ధిదారులకు అందించారు.

నిబంధనల మేరకే ఎరువులు విక్రయించాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున నూజివీడు మండల వ్యవసాయాధికారి పలగాని చెన్నారావు, నూజివీడు జి.విద్యాసాగర్ ఆధ్వర్యంలో మండలంలోని ఎరువులు, పురుగుమందుల డీలర్లకు మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎరువులను డీలర్లందరూ ఈ పాస్ మిషన్ ద్వారా బయోమెట్రిక్ విధానంలోనే ఎరువులు విక్రయించాలని తెలిపారు. డీలర్లందరూ అధికృత డిస్ట్రిబ్యూటర్ల ద్వారా మాత్రమే స్టాక్‌ను పొంది రైతులకు విక్రయించాలని తెలిపారు. ఎరువులు, పురుగు మందులు కొన్న ప్రతి రైతుకూ బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని మల్లుకుంట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్ పర్సన్ శీలం సాయి వినయ్ అన్నారు. మండలంలోని వీరభద్రవరం గ్రామంలో సిఎంగా చంద్రబాబు నాయుడు 30వ సంవత్సరంలోకి అడుగు పెట్టిన సందర్భంగా సోమవారం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నైనారపు జలపాలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి కృషి చేయాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

గిరిజనుల అభ్యున్నతికి ప్రతి ఉద్యోగి కర్మయోగిల పని చేయాలని కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ వ్యూహాత్మక సలహాదారుని మనిషారెడ్డి అన్నారు. భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సోమవారం, మంగళవారం నూజివీడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆది కర్మయోగి అభియాన్ మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మనిషా రెడ్డి మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల విజయాన్ని నిర్ధారించడానికి అట్టడుగు స్థాయి ఈ శిక్షణ ప్రాముఖ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆది కర్మయోగి నోడల్ ఆఫీసర్ జ్యోతి కుమార్, వినయ్ కుమార్, రామయ్య, రాజేశ్వరి, రాజ్ కుమార్, నూజివీడు ఎంపిపి ఆరేపల్లి శిరీష, ఎంపిడిఒ చిన్న రాఘవేంద్రనాథ్, తహశీల్దార్ బద్రు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ కృషి చేస్తుందని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ తెలిపారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రతి సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్, ఎఎస్‌పి సూర్యచంద్రరావు పాల్గొని ఫిర్యాదుదారుల వద్ద నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆయన ఫోన్‌లోనే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మొత్తం 45 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఫిర్యాదులను స్వీకరించామని తెలిపారు.

నిర్ణీత సమయంలో సమస్యలు పరిష్కారం

నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు అర్జీల ద్వారా అందించిన సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామని నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న తెలిపారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో సోమవారం మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సబ్ కలెక్టర్‌కు అందించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ వినూత్న మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోపు అన్ని సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

ఎన్ఆర్ఐలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభం

ఆగిరిపల్లి :మండల పరిధిలోని పోతవరప్పాడు ఎన్ఆర్ఐ కళాశాలలో సోమవారం అడ్వాన్స్‌డ్ విఎల్ఎస్ఐ డిజైన్, నెక్స్ట్ జనరేషన్ సెమీ కండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ కోసం ఎఐ ఆధారిత ఆటోమేషన్ ఆరు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రొగ్రాంను కళాశాల చైర్మన్ రావి వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రొగ్రాం అధ్యాపకుల నైపుణ్యాలను అభివృద్ధి చేసే దిశగా రూపొందించినట్లు చెప్పారు. ఆరు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల నుంచి ఫ్యాకల్టీలు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాగభాస్కర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ జి.సాంబశివరావు, డీన్ ఆర్ అండ్ డి డాక్టర్ కెవి.సాంబశివరావు, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ కె.రామాంజనేయులు, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఎన్‌వి.సురేంద్రబాబు, డాక్టర్ వి.శ్రీనివాసరావు, డాక్టర్ అర్పిత పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో తెగులు నివారణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

వరిపై సోకే తెగుళ్ల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని మండల వ్యవసాయ శాఖాధికారి బి.వేణుమాధవ్ అన్నారు. మండలంలోని పెదపాలపర్రు, కోడూరు గ్రామాల్లో సోమవారం వేణుమాధవ్ క్షేత్రస్థాయిలో జరిపిన పరిశీలనలో వరిపై ఎండాకు తెగులు సోకినట్లు గమనించినట్లు చెప్పారు. కొన్నిరోజులుగా మబ్బులు చేసి అడపాదడపా జల్లులు కురుస్తూ అదే సమయంలో ఎండలు నెలకొని ఉన్న వాతావరణ పరిస్థితులు దృష్ట్యా వరి పైరుకు ఎండాకు తెగులు ఆశించినదని, ఆకు అంచుల నుంచి పసుపు రంగు మచ్చలు, పైనుంచి కిందకు ఆకులు ఎండడం గమనించామన్నారు. జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఫణి కుమార్ పేర్కొన్న సూచనలను రైతాంగం పాటించాలని సూచించారు. ఎండాకు తెగులు నివారణకు నీటి యాజమాన్యం తప్పనిసరని, వీలైనన్నిసార్లు నీటిని తీసివేసి కొత్తనీరు పెట్టుకోవాలని చెప్పారు. నత్రజని ఎరువులను అధిక మోతాదులో వాడరాదని, ఎకరానికి 20 నుంచి 25 కిలోల పొటాష్ ఎరువును వేసుకోవాలని, పైపాటుగా కోసైడ్ (కాపర్ హైడ్రాక్సైడ్)అనే మందును లీటర్ నీటికి రెండు గ్రాములు దానితోపాటు ప్లాంటోమైసిన్ లీటర్ నీటికి ఒక గ్రాము చొప్పున కలిపి పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

మాట్లాడుతున్న ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ప్రజలకు నాణ్యమైన సేవలందించాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన అభివృద్ధి సంఘ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణ ఆరోగ్య కేంద్రానికి ఛైర్మన్‌గా సొంగా యేసుపాదంను నియమించారు. వైద్యాధికారి గీత మాట్లాడుతూ ఆసుపత్రికి భవనం నిర్మించాలని కోరారు. నగర పంచాయతీ కమిషనర్ స్పందిస్తూ నిధులు వచ్చాయని, త్వరలో నూతన భవనం నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కబ్జాకు గురైన ఇరిగేషన్ భూమి

పెదవేగి సొసైటీ ఛైర్మన్ తాత సత్యనారాయణ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రభుత్వానికి చెందిన పంట కాలువ భూమిని పినకడిమి గ్రామం సర్పంచి పలగాని శ్రీను 2022లో కబ్జా చేశారని దెందులూరు నియోజకవర్గ సమ న్వయ కమిటీ అధ్యక్షుడు, పెదవేగి సొసైటీ బ్యాంక్ ఛైర్మన్ తాత సత్యనారాయణ అన్నారు. ఏలూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో పినకడిమి గ్రామస్తులు సోమవారం పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తాత సత్యనారాయణ మాట్లాడుతూ ఆరు నెలల క్రితమే ఇరిగేషన్ భూమిని ఖాళీ చేయించాలని, అక్కడ పేదలకు పట్టాలు ఇవ్వ డానికి సిద్ధం చేస్తున్నామని తహశీల్దార్‌కు ఎంఎల్ఎ చింతమ నేని చెప్పారని తెలిపారు. రెండు రోజుల క్రితం ఎంఎల్ఎ పొలంలోకి వెళ్తుండగా ఇరిగేషన్ భూమిలో పలగాని శ్రీనివాసరావు స్ప్రే చేస్తూ కనిపించారని, గన్‌మెన్‌కి చెప్పి ఆ పొలాన్ని ఖాళీ చేయాలని చెప్పగా అతను బూతులు మాట్లాడుతూ ఎంఎల్ఎను తిట్టాడని, దీంతో గన్‌మెన్‌కు, శ్రీనివాసరా వుకు కొంత తోపులాట జరిగిందని, ఎంఎల్ఎ ఆయనపై చేయి చేసుకోలేదని చెప్పారు. ఇరిగేషన్ భూమిలో 155 సర్వే నెంబర్ దుగ్గిరాల కాలువ ప్రభుత్వ భూమి ఎకరం 94 సెంట్లు అని, ఆ భూమిని 2022లో అడం గల్‌లో ఉండగా పట్టా ఇచ్చినట్లు దొంగ పట్టాలి చూపిస్తున్నా డని అన్నారు. మొండూరు సొసైటీ ప్రెసిడెంట్ శివమణి, పినకడిమి సర్పంచి సత్యనారాయణ, మాజీ సర్పంచి గంగరాజు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రతినెలా ఒకటో తేదీ నాటికే సామాజిక పెన్షన్లు అందిస్తోన్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతోందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరు 33వ డివిజన్ చిట్టివలస పాకల ప్రాంతంలో సోమవారం సెప్టెంబర్ నెలకు సంబంధించిన ఎన్‌టిర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఎల్ఎ బడేటి చంటి, ఎపిఎస్ ఆర్‌టిసి విజయవాడ జోన్ - 2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు హాజరయ్యారు. తొలుత కీర్తిశేషులు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

దెందులూరు :మండలంలోని కొవ్వలి గ్రామంలో జరిగిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, అధికారులతో కలిసి దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ లబ్ధిదారులకు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పేదల అహర్నిశలు తపించే నాయకుడు సిఎం చంద్రబాబు అని అన్నారు. తొలిసారిగా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నేటికీ 30 ఏళ్ల పూర్తి చేసుకున్న చంద్రబాబు అనుభవం, అపార ప్రతిభ ఈ రాష్ట్ర దశ దిశను మార్చడంలో ఎంతో కీలకంగా మారిందన్నారు.

జీలుగుమిల్లి :సుపరిపాలనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. మండలంలోని బర్రింకలపాడులో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పలువురికి పింఛన్లను అందించారు. మండలవ్యాప్తంగా 4249 పెన్షన్లకు 3992 పింఛన్లను సచివాలయ సిబ్బందితో పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్ తెలిపారు.

ముసునూరు : మండల పరిధిలోని 16 గ్రామాల్లో పెన్షన్లు పంపిణీ చేశారు. టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు పాల్గొని మాట్లాడారు. టిడిపి గ్రామ అధ్యక్షులు మందలపు ధర్మరాజు ఆధ్వర్యంలో పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ, టిడిపి నాయకులు కొల్లి గంగారాం, మసిముక్కు సుబ్బారావు, సొసైటీ ఛైర్మన్ కొల్లి కృష్ణయ్య, గోపవరం సొసైటీ ఛైర్మన్ ఉప్పలపాటి గణేష్, నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి బాబి, సూరేపల్లి మల్లిబాబు, మేదరమెట్ల సురేంద్ర, గద్దల సుహాసిని మోహనరావు, సూర్యదేవర శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : పట్టణంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్లు తీసేస్తున్నారని వైసిపి చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మొద్దన్నారు. అర్హులందరికీ పెన్షన్ అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, సీనియర్ నాయకులు పరిమి సత్తిపండు, రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, పెనుమర్తి రామ్‌కుమార్ పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలో సచివాలయ సిబ్బందితో కలిసి టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ శ్యామ్ చంద్ర శేషు, జెడ్‌పిటిసి సభ్యులు పొల్నాటి బాబ్జి కూటమి నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి యడ్లపల్లి రాధిక, ఎంపిటిసి సభ్యులు తాతారావు, నేతలు పాల్గొన్నారు.

కిరాణా దుకాణం వద్ద పింఛనుదారులు

పింఛన్ల కోసం అవస్థలు

కలిదిండి : కలిదిండి పింఛనుదారులు పెన్షన్ల పలు అవస్థలకు గురయ్యారు. ఇంటింటికీ కాకుండా స్థానిక పోస్టాఫీసు సమీపంలో కిరాణా షాపు ఎదుట సచివాలయ ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేపట్టారు. గత నెల వరకు అంగన్వాడీ కార్యకర్తలు ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేశారు. వారికి అదనపు భారం కావడంతో సచివాలయ ఉద్యోగులకు ఆ బాధ్యతలు అప్పగించారు. ఎక్కడ ఇస్తారో తెలియక పింఛను దారులు ఒకింత ఆందోళనకు గుర య్యారు. కిరాణా షాపు ఎదుట పింఛన్ల ఇస్తున్నారనే సమాచారంతో వృద్ధులు, వికలాంగులు గుమికూడారు.

ప్రకటన

నా క్లయింటు ఏలూరు కాపురస్తులు గంధం జగన్‌మోహన్ గారి తండ్రి గారి తాలూకు గంధం నాగభూషణం గారికి చెందిన ఏలూరు నగరంలోని ప్లాటు నెం.64బి దాఖలా చ.గ.595 స్థలము తాలూకు క్రయ దస్తావేజు నెం.2252/1950, తేది.16.06.1950 ఏలూరు ఎస్.ఆర్.ఓ ద్వారా సంక్రమించినది. సదరు ఆర్.ఆర్.పేటలోని జిరాక్స్ తీసుకుని వెళ్తుండగా మార్గమధ్యలో పడిపోయినవి అని సదరు దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల ఈ పేపరు ప్రకటన ఇచ్చిన 7 రోజులలోగా ఈ దిగువ తెలిపిన అడ్రస్సుకు గానీ, నాకు గానీ నా క్లయింటుకు ఇవ్వగలరు.

కె.వి.పి.మాధవరావు
అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరు,
అడ్వకేట్ నోటరీ, ఏలూరు.
సెల్: 9440111033.

మహారాజశ్రీ అడిషినల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఏలూరు వారి కోర్టులో

I.A. No. 1031/2023 in O.S. No. 5/2022

Between:

1. మెతుకుమల్లి రామతులసీ ...పిటీషనర్

మరియు

2. సిరంగి దానయ్య అండ్ అదర్స్ ...రెస్పాండెంట్స్

పై నెంబరు దావాలో 5వ ప్రతివాదికి LRS అయిన

R6: సముద్రాల మహేశ్వరి,
W/o Late లీలా మహేశ్వరరావు,
R/o D/N. 8-31/17 R.R పేట,
ఏలూరు, ఏలూరు జిల్లా.

R7: సముద్రాల రాజేష్
S/o Late లీలా మహేశ్వరరావు
R/o D/N. 8-31/17 R.R పేట,
ఏలూరు, ఏలూరు జిల్లా.

ప్రతివాదులు అయిన మీకు నోటీసులు అమలు కొరకు పై కోర్టు వారి ఎదుట **ది. 17-09-2025 తేదిన ఉదయం 10:30 ని॥లకు** స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి మీ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేని యెడల పై నంబరు దావాలో మీ పరోక్షమున విచారించబడును.

(పై కోర్టు ఉత్తర్వుల ప్రకారం)

ఏలూరు
ది. 01-09-2025

N.Y.V. ప్రసాద్
N. రాముడు
అడ్వకేట్స్
ఏలూరు

మహారాజశ్రీ ఏలూరు 3వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No.397/2022

Between:

శ్రీ కొడాలి సత్యనారాయణ ...పిటీషనర్

And

నవుదూరి రాజ్యలక్ష్మి @ నవుదూరి రాజాం & ఇతరులు

...రెస్పాండెంట్స్/పతివాదులు

పై గ్రంథములో శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం 2వ రెస్పాండెంట్/డిఫెండెంట్ అయిన లేటు నవుదూరి నరసింహమూర్తి గారి కుమారుడు నవుదూరి వెంకటేశ్వరరావు @ నవుదూరు వెంకటేశ్వరరావు గారికి నోటీసు లు ఎన్నిసార్లు పంపిననూ అమలు కానందున పేపరు పబ్లికేషన్ అర్డరు చేసినారు. సదరు ప్రతివాది ది.**10-9-2025**వ తేదీన ఉదయం 10.30 ని॥లకు అడ్వకేట్ ద్వారా కాని, ప్రత్యక్షముగా గాని శ్రీకోర్టు వారి ముందు హాజరు అయ్యి పై గ్రంథములో అభ్యంతరములు ఉన్న ఎడల తెలియజేయవలెను. లేనియెడల ఎక్స్‌పార్టీ చేసి పరోక్షములో తీర్మానము చేయబడునని తెలియజేయుచున్నాము.

Ch.Rajendra Prasad
Eluru — Advocate, Eluru.
Dt.01-09-2025 — Cell: 9885421212

ప్రకటన

మహారాజశ్రీ IV అడిషినల్ డిస్ట్రిక్టు జడ్జి : తణుకు

O.S.No.12/2016

Between:

వాది : నల్లా పూజిత మరియు వగైరా

మరియు

ప్రతివాదులు : నల్లా సత్యనారాయణ మరియు వగైరాలు

4వ ప్రతివాది : నక్కా రసజ్ఞ,
D/o.వెంకటేశ్వరరావు, 31 సం॥లు,
డోరునెం.25-3-3, ఆలమూరు వారి వీధి, తణుకు.

పై నెంబరు గ్రంథములో శ్రీకోర్టు వారు పలుమార్లు సమన్లు యిచ్చినప్పటికి కోర్టు ఎదుట హాజరు కానందున ఈ ప్రకటన ద్వారా పై నెంబరు గ్రంథము తేది.**04-09-2025 ఉదయం 10.30 ని॥లకు** వాయిదా అయివున్నది. ఆరోజు మీరు స్వయంగా గాని, అడ్వకేటు ద్వారా గాని హాజరు కావలెను. లేనియెడల పరోక్షము గావింపబడుదురని ఈ ప్రకటన ద్వారా తెలియచేయడమైనది.

N.V.S.S.P.Ram Mohan,
N.V.S.Ramanujam
Advocates, Tanuku.

తణుకు — Cell: 9908822433
తేది.01-09-2025 — 9848369653

ప్రకటన

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE NARSAPUR

HMOP No.169/2024

Between:

Yatam Balaji ...Petitioner
S/o.Ramarao, Aged 45 Yrs, Hindu, Daily wage earner, R/o.D.No.4-57, ASR Colony, Kommuchikkala Village, Poduru Mandal, West Godavari District., A.P.

Vs

Yatam Prashanthi Kumari ...Respondent
W/o.Balaji, D/o.Thota Babu Rao, Aged 35 Yrs, House wife, R/o.Congress Sthambalu Veedi, Yenamadurru, Bhimavaram Mandal, West Godavari District, A.P., Ph.8500734511.

పైన నంబర్ దావా HMOP No.169/2024 లోని సమన్లు మీకు అమలు జరుపు నిమిత్తం ఎన్ని పరియాయములు కోర్టు ద్వారా పంపించినప్పటికీ, మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు దావాలోని సమన్లు మీకు ఈ పేపర్ ప్రకటన ద్వారా అమలు చేయటం అయినది. కాబట్టి మీరు ది.02-09-2025 సం॥రం తేదీన పైన తెలిపిన కోర్టులో ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని ప్లీడర్ గారి ద్వారా గాని హాజరు అయి మీ యొక్క వాదనను దాఖలు చేసుకొనవలెను. లేనియెడల మీకు వ్యతిరేకంగా తీర్మాణం జరుగును.

రాయవరపు వెంకట సూర్యనారాయణ
నర్సాపురం — వాది తరుపు అడ్వకేట్,
తేది: 01-09-2025 — పాలకొల్లు.

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
45వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధం
ఏలూరు జిల్లా
సెప్టెంబర్ 2025
16 పేజీలు
Advt.feature 5

నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యం

ఇప్పటివరకు ఎన్నో అభివృద్ధి, సేవా కార్యక్రమాలు చేశాం

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పోలవరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ తాను మాటల మనిషిని కాదని, చేతల మనిషినని చెప్పారు. రాజకీయాల్లో పదవులు శాశ్వతం కాదన్నారు. గెలిచిన నాటి నుంచి నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి ఎన్నో పథకాలు తెచ్చినట్లు తెలిపారు. ఏజెన్సీ మారుమూల గ్రామాలకు సైతం రహదారుల సమస్యలు లేకుండా పలు చోట్ల సీసీ రహదారుల నిర్మాణాలను చేపట్టినట్లు తెలిపారు. త్వరలో పలు గ్రామాలకు సంబంధించి రహదారి నిర్మాణాలను చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించానని చెప్పారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి త్వరలోనే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయనున్నట్లు చెప్పారు. 2024 జులై నెలలో వచ్చిన వర్షాల కారణంగా గుమ్మడవెల్లి ప్రాజెక్టుకు గండి పడి వేలేరుపాడు మండలంలోని పలు గ్రామాలు నీట మునగడంతో అక్కడికి చేరుకుని రక్షణా చర్యలు చేపట్టామని, అలాగే వరదల్లో చిక్కుకున్న కూలీలను కాపాడేందుకు ఎన్‌డిఆర్ఎఫ్ ద్వారా హెలికాప్టర్ ఏర్పాటు చేసి ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

'ఎన్నో అభివృద్ధి సేవా కార్యక్రమాలు చేశాం'

నియోజకవర్గంలో మొదటగా పోలవరం ముంపు మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు నిర్వాసితులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు గెలిచిన వెంటనే ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద సుమారు రూ.90 కోట్లు వారి ఖాతాలో జమ చేశామని తెలిపారు. మిగిలిన వారికి కూడా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ప్రతి గ్రామంలో సీసీ రోడ్డును ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు సుమారు రూ.50 కోట్ల నిధులు మంజూరు చేసి నూతన రోడ్లను నిర్మించామని తెలిపారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల పరిధిలో తారు రోడ్డు నిమిత్తం పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి నుంచి రూ.48 కోట్లు మంజూరు చేసి ఆ రోడ్డులో నూతన నిర్మాణాలు చేపట్టామని, ఏడు మండలాల పరిధిలో ప్రతి గ్రామంలో నీటి ఎద్దడి లేకుండా ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు అధికారంలోకొచ్చిన వెంటనే 48 ఒహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకుల నూతన నిర్మాణాలు చేపట్టామన్నారు. నియోజకవర్గంలో సిఎం సహాయ నిధి

..7లో

చైతన్య కిరణం.. ప్రజాశక్తి

◆ దినదినాభివృద్ధి.. కొత్త పుంతలు ◆ ప్రత్యామ్నాయ జర్నలిజానికి ప్రతీక
◆ జన బలమే.. తన బలంగా మున్ముందుకు..
◆ నేడు 45వ వార్షికోత్సవం

తెలుగు దినపత్రికల్లో 'ప్రజాశక్తి'ది విశిష్ట స్థానం. ఉమ్మడి ఆంధ్ర గడ్డపై ఈ పత్రిక.. ఓ చైతన్య కిరణం. 'ప్రతి అక్షరం - ప్రజల పక్షం'గా సాగుతూ ప్రత్యామ్నాయ ప్రజా జర్నలిజానికి అసలుసిసలైన ప్రతీకగా ఈ పత్రిక నిలిచింది. నిరంతర అక్షర తూటాలతో అవినీతి, అక్రమాలను 'ప్రజాశక్తి' చీల్చి చెండాడుతుంది. ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొడుతుంది. ధనస్వామ్యంపై ధ్వజమెత్తుతుంది. నిస్సహాయుల తరుపున నికరంగా నిలబడుతుంది. సమాజ మార్పునకు విశేష కృషి చేస్తుంది. అందుకే అది ప్రజల పత్రికగాను, కార్మిక, కష్టజీవుల పత్రికగాను గుర్తింపు పొందింది. ఈ పత్రికకు అడుగడుగునా జన సహాయం అందుతూనే ఉంది. ప్రజలే దీనికి అండాదండ. అన్ని రంగాలకు చెందిన వార్తలు ప్రచురిస్తూ ప్రజాశక్తి ప్రజల ఆదరణ పొందుతోంది. వార పత్రిక నుంచి దిన పత్రికగా, ఆ తరువాత టాబ్లాయిడ్, అనంతరం కలర్ పత్రికగా ఆవిర్భవించింది. ప్రత్యేక అంశాలతో ప్రజలను ఆకట్టుకుంటూ దినదినాభివృద్ధి చెందుతోంది. దీనిలో భాగంగానే పత్రిక అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు 45వ వార్షికోత్సవం నిర్వహించుకుంటోంది. ఈ నేపథ్యంలో 'ప్రజాశక్తి' ప్రస్థానాన్ని గుర్తు చేసుకుందాం.

విజయవాడలో ఆఫ్‌సెట్ యంత్రాన్ని ప్రారంభించిన అనంతరం సభలో మాట్లాడుతున్న బిటి.రణదివె, చిత్రంలో పుచ్చలపల్లి సుందరయ్య తదితరులు (ఫైల్ ఫొటో)

1980 సంవత్సరపు ఆఖరి రోజులు. అఖిలపక్ష రైతు ఉద్యమం రాష్ట్ర రాజకీయాలను ఉగ్రరూతలూపింది. మూడు నెలలపాటు రకరకాల పిలుపులతో రాష్ట్రం వేడెక్కింది. వారపత్రికగా నడుస్తున్న ప్రజాశక్తి ఉద్యమా వసరాలకు సరిపోవడం లేదనే ఆవేదన పెరుగుతోంది. మరో వైపున పత్రికల విస్తరణ ఊపందుకుంది. అలాంటి తరుణంలో సిపిఎం పశ్చిమ బెంగాల్ కమిటీ నుంచి అనుకోని ప్రతిపాదన వచ్చింది. అరవయ్యవ దశకంలో ఆంధ్రప్రదేశ్ కమిటీ తన దినపత్రిక అచ్చుయంత్రాన్ని బెంగాల్ కమిటీకి విక్రయించింది. దానిపైనే అప్పటి వరకూ బెంగాల్‌వారు గణశక్తిని

..2లో

చైతన్య కిరణం.. ప్రజాశక్తి

(మొదటి పేజీ నుంచి)

సాయంకాలపు పత్రికగా ప్రచురిస్తున్నారు. ఇప్పుడు తాము కొత్త మిషన్ కొంటున్నామని, పాత మిషన్ కావాలంటే అప్పటి ధరకే అందజేస్తామన్నది వారి ప్రతిపాదన. దీనిపై సీనియర్ నాయకులు వెనువెంటనే చర్చించి ఆమోదించారు. ప్రజాశక్తి వారపత్రికను దినపత్రికగా వెలువరించాలని నిర్ణయించారు. రాష్ట్ర కమిటీ ఆ మేరకు ప్రకటన చేసింది. ఆ ప్రకారం 1981 ఆగస్టులో వారపత్రిక ప్రచురణ ఆగింది. 'వారపత్రికగా సెలవు–దినపత్రికగామీ సేవకు సిద్ధం' అంటూ నాటి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి, ప్రజాశక్తి దినపత్రిక ప్రథమ సంపాదకులు మోటూరు హనుమంతరావు వీడ్కోలు సంపాదకీయం రాశారు. దినపత్రిక సన్నాహాలు మొదలయ్యాయి.

నిజానికి ప్రజాశక్తికి 80 ఏళ్ల పైచిలుకు చరిత్ర ఉంది. నలభయ్యవ దశకంలో అది ప్రజల పత్రికగా, శ్రమజీవుల వాణిగా పేరొందింది. భాషా సంస్కృతి తదితర అంశాల్లో కూడా ప్రజాప్రయోజనాలకు పట్టం కట్టింది. ఇది సహించలేని వాళ్లు 'పెద్ద బాలశిక్ష ఫెయిల్ – ప్రజాశక్తి పాస్' అంటూ అక్కసు వెలిబుచ్చేవారు. చదువురాని వాళ్లను కూడా చైతన్యపరిచేలా పదునైన భాషలో పత్రిక రావడమే వారి ఆగ్రహానికి కారణం. ప్రభుత్వ నిర్బంధానికి గురైన తర్వాత మళ్లీ సాధారణ పరిస్థితులు ఏర్పడి పత్రికను పునరుద్ధరించినా ఆ పేరుతోగాక విశాలాంధ్ర పేరుతో వచ్చింది. మళ్లీ రాజకీయావసరాలరీత్యా 1968 నుంచి దాదాపు పదమూడేళ్ల పాటు ప్రజాశక్తి వారపత్రికగా నడిచింది. వారపత్రిక తేవడానికి అవసరమైనంత మేరకు కంపోజింగ్, ప్రెస్ ఉన్నాయి. దినపత్రిక ప్రచురించడానికి చాలా సిబ్బంది కావాలి. యంత్రాంగమూ పెరగాలి. దీంతో మూడు నెలల ముందు సన్నాహాలు మొదలయ్యాయి. పుచ్చలపల్లి సుందరయ్య ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. మోటూరు హనుమంతరావు పత్రికా నిర్వహణ సంబంధమైన ఏర్పాట్లు చూశారు.

ప్రజాశక్తి దినపత్రికగా రాబోతుందన్న వార్త వామపక్ష ప్రగతిశీలవాదులకు ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. నాయకుల ద్వారా దాతలు సహాయ సహకారాలు అందజేశారు. పుచ్చలపల్లి సుందరయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఇఎంఎస్.నంబూద్రిపాద్ పత్రిక తొలి ప్రతిని ఆవిష్కరించారు. ఆ సందర్భంగానే సుందరయ్య.. కమ్యూనిస్టులు పత్రికను ఎంత విలువైనవిగా పరిగణిస్తారో వివరించారు. అప్పటివరకూ విశాలాంధ్ర మాత్రమే వామపక్ష దినపత్రికగా వెలువడుతుండేది. కమ్యూనిస్టు పత్రికలంటే అదే నమూనాలో ఊహించేవారు. సాధారణ వార్త ఎంత ముఖ్యమైనదైనా అంతకంటే పార్టీ సంబంధమైన వార్తకే ప్రథమ ప్రాధాన్యతనివ్వడం, ఉద్యమ సంబంధమైన నాయకుల ప్రకటనలు మొదటి పేజీలో ఇవ్వడం ఇందులో ప్రధానాంశం. అయితే ప్రజాశక్తిని కేవలం వ్యూస్ పేపరుగా కాక న్యూస్ పేపర్‌గా తీసుకురావాలని నాయకత్వం భావించింది. అంటే కేవలం పార్టీ సంబంధిత వార్తలు మాత్రమే కాకుండా అన్ని రకాలైనవి ఇవ్వాలని నిర్ణయమైంది. ఇదో కొత్త ఒరవడి. అయితే దాన్ని సంపూర్ణం గావించడానికి చాలా కాలం పట్టింది. ప్రజాశక్తి దినపత్రిక పున:ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే కారల్ మార్క్స్ జయంతి ఉత్సవాలు వచ్చాయి. ఆ పైన సిపిఎం జాతీయ మహాసభలు విజయవాడలో అపూర్వంగా జరిగాయి. ఇవన్నీ కూడా పాఠకులకు ఆసక్తికరమైన సందర్భాలు కావడంతో పత్రిక చురుగ్గా నడిచింది. ఆదివారం అనుబంధం విభిన్నంగా ఉందని అభినందనలు వచ్చాయి. పెద్ద యంత్రాంగం లేకున్నా ఉత్సాహవంతులైన యువ పాత్రికేయులే శ్రమపడి రాస్తుండేవారు.

కొత్త యంత్రం.. నూతన భవనం

అప్పటికే తెలుగు దినపత్రికల్లో కొత్త పోకడలు ఊపందుకున్నాయి. ఆంధ్రప్రభ స్థానంలో ఈనాడు అగ్రశ్రేణి దినపత్రికగా అవతరించింది. జర్నలిజంలో కొత్త ధోరణులు తీసుకొస్తున్నది. పార్టీ సంబంధమైన వార్తలను కూడా ప్రజాశక్తిని మరపించేలా ఇవ్వాలన్నది దాని వ్యూహం. ఆ విధంగా 1982లో మహాసభ సందర్భంగా నాయకుల ఇంటర్వ్యూలు వగైరాలు ఎంతో విస్తృతంగా ఇచ్చింది. వనరులు, నిపుణులు ఎక్కువ. ఇలాంటి తరుణంలో ప్రజాశక్తి పాఠకుల్లో కూడా మరింత కొత్తదనం కావాలనే ఆకాంక్ష పెరిగింది. ఈలోగా ఎన్‌టిఆర్ రంగప్రవేశం, విజయం ఇవన్నీ రాజకీయాలను, మీడియాను అమితంగా ప్రభావితం చేశాయి. ఈ నేపథ్యంలో బెంగాల్ నుంచి తెచ్చుకున్న పాతమిషన్‌పై పత్రికను ప్రచురించడం ఆచరణ సాధ్యం కాని విషయంగా మారింది. అందుకే ఆఫ్‌సెట్ యంత్రాన్ని తెప్పించాలని నిర్ణయమైంది. అప్పటివరకూ మార్క్సిస్టు కార్యాలయంలో ఒక భాగంగా తీసుకుని నడుస్తున్న ప్రజాశక్తికి నూతన భవనం కూడా అవసరమని భావించారు. అలాంటి సమయంలో ఉద్యమ శ్రేయోభిలాషి కాట్రగడ్డ శ్రీనివాసరావు.. నవరంగ్ టాకీస్ పక్కన ఉన్న విలువైన స్థలాన్ని ప్రజాశక్తికి ఇచ్చేందుకు ముందుకొచ్చారు. 1983 మే 1న, ఆ రోజు మేడే మాత్రమే కాక సుందరయ్య జన్మదినం కూడా. ఆయనకు మహాభిమాని, సన్నిహితుడు అయిన శ్రీనివాసరావు ఆ రోజునే భవనాన్ని అంకితం చేయాలని నిర్ణయించారు. సీనియర్ నాయకులైన బిటి.రణదివే వచ్చి భవన ప్రారంభోత్సవంతో పాటు ప్రధానోపన్యాసం చేశారు.

ఆఫ్‌సెట్‌లో అందంగా ముద్రించిన పత్రికను చూసి పాఠకులు ఎంతగానో మెచ్చుకున్నారు. అప్పటినుంచి సాంకేతికంగానూ పత్రికలో నూతన ప్రయోగాలు మొదలయ్యాయి. మిగిలిన వారికున్న హంగులు లేకున్నా పత్రికలోని యువ మిత్రులు ప్రయోగశీలతతో దాన్ని విభిన్నంగా తేవడానికి ఎప్పటికప్పుడు ప్రయత్నించారు. ఇతర ప్రముఖ పత్రికలవారు కూడా హర్షిస్తూ వచ్చారు. పార్టీ పత్రికే అయినా ప్రజాశక్తి భిన్నంగా ఉంటుందనే వాదన బలపడింది.

ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఊపిరి

ఇంతలో నాదెండ్ల భాస్కరరావు వెన్నుపోటుతో ఎన్‌టిఆర్ ప్రభుత్వం కూలి పోయింది. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఉద్యమం మొదలైంది. ప్రజాశక్తి ఆ ఘట్టంలో ఒక ముఖ్య భాగస్వామి అయింది. ప్రజాస్వామ్య ఉద్యమం విజయవాడ నుంచి ప్రారంభమైన రోజునే ప్రత్యేక సంచిక విడుదల చేయడంతో ప్రతివారి చేతిలోనూ అదే కనిపించింది. అప్పటి నుంచి నెలరోజుల పాటు మోటూరు హనుమంతరావు.. ప్రతిరోజూ ఇదే విషయమై సంపాదకీయాలు రాశారు. దానికితోడు కదం తొక్కించే శీర్షికలు, నాదెండ్ల మంత్రివర్గాన్ని విస్తరించినప్పుడు 'కీలుబొమ్మ మంత్రివర్గంలో తోలుబొమ్మలు" అని పెట్టిన హెడ్డింగ్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆ నెల రోజులూ ప్రజాశక్తి.. ప్రజాస్వామ్య ఉద్యమాభిమానుల ఆదరణకు పాత్రమైంది. ఎన్‌టిఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా ప్రతిష్టించిన తరుణంలో అన్నిటికన్నా ముందు ప్రజాశక్తి మార్కెట్లో విడుదలై సంచలనం సృష్టించింది. అలాగే ముఖ్యమైన పరీక్షా ఫలితాలు వంటివి కూడా పోటీ పడి విడుదల చేయడానికి కృషి జరగడంతో పత్రికను సీరియస్‌గా తీసుకోవడం పెరిగింది. వివిధ ప్రాంతాల్లో ఉత్సాహవంతులైన కార్యకర్తలు విలేకరులుగా వార్తలు పంపించడంతో కవరేజ్ కూడా మెరుగైంది. ఆ రోజులలో సత్తెనపల్లి సమీపంలోని కోళ్లూరు దగ్గర ఒక పెద్ద పడవ ప్రమాదం జరిగిన వార్తను ప్రజాశక్తి ఒక్కటే ఇవ్వడం పత్రికా రంగంలో సంచలనమైంది.

ప్రత్యేకతలూ ప్రతిబంధకాలు

1984లోనే తొలిసారిగా పరిశ్రమల సంచిక, స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక సంచికలు విడుదలయ్యాయి. ఇవన్నీ పత్రికస్థాయి పెరిగేందుకు దోహదపడ్డాయి. 1984లో ఇందిరాగాంధీ హత్య జరిగినప్పుడు ప్రజాశక్తి ప్రచురించిన పెద్ద ఫొటో హిందూ తర్వాత అత్యుత్తమంగా ఉన్నట్టు ప్రశంసించారు. ఇవన్నీ ఉన్నా న్యూస్‌ప్రింట్ వ్యయం, జీతభత్యాలు వగైరాలు (12వ పేజీ తరువాయి..) పెరగడంతో పత్రిక నిర్వహణ కష్టంగా మారింది. అడ్వర్‌టైజ్‌మెంట్లు చాలని స్థితి. ఆ దశలో యాజమాన్యం ఆరు పేజీల పత్రికను నాలుగు పేజీలకు తగ్గించాలని నిర్ణయించింది. ఇతర పత్రికల పోటీని తట్టుకోవడమే కష్టంగా ఉన్న తరుణంలో ఉన్న పేజీలను తగ్గించడం, పత్రికల్లో వచ్చే ప్రధాన విషయాలేవీ దెబ్బతినకుండా ఉండటం వంటి అంశాలపై ముందే తగు ప్రణాళిక తయారైంది. ఏమైనా ప్రజాశక్తి రాజకీయ నిబద్ధత, పాఠకాభిమానం దాన్ని నిలబెట్టాయి. పేజీల తగ్గింపు పత్రిక సర్క్యులేషన్‌ను తీవ్ర ప్రభావితం చేయకపోవడం ఆశ్చర్యకరమైన వాస్తవం.

ఒక ప్రధాన దినపత్రిక నాలుగు పేజీలతో వెలువడి నిలదొక్కుకున్న ఉదాహరణ ఆధునిక తెలుగు జర్నలిజంలో మరి కనిపించదు. అయితే అది కోరుకున్న పరిస్థితి ఏమీ కాదు. వీలు చిక్కగానే ప్రజాశక్తి తిరిగి ఆరు పేజీలకు పెరిగింది. ఈ కాలమంతటా సాంకేతికంగానూ, సిబ్బంది దృష్ట్యాను ప్రజాశక్తి హంగులు సమకూర్చుకుంటూనే వచ్చింది. ఉన్నంతలో అదనపు ఆకర్షణలు, శీర్షికలను జతచేసింది. అన్నిటికన్నా ముఖ్యంగా రాజకీయ నైశిత్యాన్ని నిలబెట్టడంలో విశేషకృషి చేసింది. రాష్ట్రంలోని రాజకీయ సీనియర్ నాయకుల్లో ఒకరుగా, కమ్యూనిస్టు వ్యాఖ్యాతలలో అగ్రగణ్యుడుగా పేరెన్నికగన్న మోటూరు హనుమంతరావు సంపాదకీయం దానికి పెద్ద పెట్టుబడి కాగా, ఉత్సాహం, అంకితభావం గల సంపాదకవర్గం, యాజమాన్యం, సిబ్బంది దాన్ని ముందుకు నడిపే సైన్యంగా పనిచేశారు. అప్పటికే రంగంలో ఉన్న పత్రికలతో ధీటుగా అది ముందుకు సాగింది. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా వామపక్ష లౌకిక శక్తుల ఐక్యతను పెంచడం దాని ప్రధాన నినాదమైంది. అప్పట్లో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీకి మద్దతునిస్తూనే విధానపరమైన అంశాల్లో నిక్కచ్చిగా విమర్శలు చేసేది.

1984 ఎన్నికల పోరాటంలో ప్రజాశక్తి ఇచ్చిన సమాచారం, ప్రత్యేక ఫీచరింగ్ నినాదాలు వంటివి అందరినీ ఆకర్షించాయి. 1985లో కారంచేడులో దళితులపై హత్యాకాండ జరిగింది. ఆ వార్తను ముందుగా ఇచ్చిన వాటిలో ప్రజాశక్తి ఒకటి. తర్వాత కూడా ఆ వివరాలను ప్రత్యేక ప్రాధాన్యతతో ఇస్తూ వచ్చింది. 1985 మే 25న సుందరయ్య కన్నుమూశారు. పత్రిక మొదటి పేజీలో ఆయన పెద్ద ఫొటోతో రాసిన లీడ్ పాఠకులను కదిలించింది. లౌకిక పార్టీల ఆధ్వర్యంలో సాగిన ఉద్యమాలకు ఎప్పుడూ ప్రజాశక్తి వాణిలా పనిచేస్తూ వచ్చింది. దానితో పాటు పలు శీర్షికల ద్వారా రాజకీయ, సైద్ధాంతిక చైతన్యం పంచిపెట్టింది.

1988 డిసెంబర్‌లో వంగవీటి మోహనరంగా హత్యానంతరం అల్లర్లు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. సంయమనంతో సమతుల్యతతో వ్యవహరించి వాస్తవాలను వెలికితీసి ప్రచురించింది. 1987 తర్వాత రాజీవ్‌గాంధీ బోఫోర్స్ కుంభకోణం దేశాన్ని కుదిపేసింది. ఆ సమాచారాన్ని తేవడంతో ప్రజాశక్తి ప్రముఖ పాత్ర వహించింది. హిందూ సహ సంపాదకునిగా ఉన్న ఎన్.రామ్ భోఫోర్సు కుంభకోణం తాలూకా కీలక పత్రాలను తమ పత్రికలో ప్రచురించడానికి అప్పటి సంపాదకులు అంగీకరించనందున ఇతర పత్రికల ద్వారా విడుదల చేశారు. తెలుగులో ఆయన ప్రజాశక్తిని ఎంచుకున్నారు. భోఫోర్స్ వార్తల ఫీచరింగ్‌తో వచ్చిన ప్రజాశక్తి సాయంత్రం మార్కెట్లో పెద్ద సంచలనమైంది. ఆ నేపథ్యంలో 1989లో కేంద్రంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం వచ్చింది. రాష్ట్రంలోని తెలుగుదేశం ఓడిపోయి, కాంగ్రెస్ అధికారం చేపట్టడంతో ప్రజాశక్తి రాజకీయ బాధ్యత పెరిగింది. రాజకీయాంశాలతో పాటు పత్రిక ఆదాయాన్ని పెంచే అడ్వర్‌టైజ్‌మెంట్లు, ఇతర యంత్రాంగాన్ని పెంచుకోవడంపై కేంద్రీకరణ పెరిగింది.

1990 ప్రజాశక్తికి మరోమలుపు. అందులో ఒకటి కంప్యూటర్ల ప్రవేశం. మరొకటి రంగురంగుల ప్రత్యేక సంచికల ప్రారంభం. అప్పటికే వివిధ దినపత్రికలు కంప్యూటర్లను ప్రవేశపెట్టాయి. కాస్త ఆలస్యమైనా సమగ్రంగా ప్రజాశక్తి కంప్యూటరీకరణను చేపట్టింది. ఉద్యమ శ్రేయోభిలాషి కొండయ్య అందుకు దోహదపడ్డారు. 1999 మే 19 నుంచి కంప్యూటర్ మీద తేవాలనుకున్నది.. సిబ్బంది ఉత్సాహం వల్ల మే 1 నుంచే తేగలిగారు. ఇతర పత్రికలు మ్యాటర్ వరకు కంప్యూటర్‌పై చేసి, లే అవుట్, పేస్టింగ్ చేసేవి. కానీ ప్రజాశక్తి ఒకేసారి పేజీనేషన్ చేయడం విశేషం. కంప్యూటర్ వ్యవస్థను లోతుగా అధ్యయనం చేసిన సిబ్బంది, బాధ్యులు అనేక నూతన ప్రక్రియలను అన్వేషించారు. ఆ విధంగా పత్రిక కొత్త ఆకర్షణ సంతరించుకోవడానికి దోహదపడ్డారు. 1990లో గోదావరి గైడ్ పేరిట పుష్కరాల ప్రత్యేక సంచిక వచ్చింది. ప్రజాశక్తి ప్రత్యేక సంచికలు ప్రతిష్టాత్మకంగా రావడానికి అది నాంది పలికింది.

1991లో దశమ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్.రామ్ ప్రజాశక్తి సాంకేతిక పద్ధతులను చూసి ఆనందాశ్చర్యాలు వెలిబుచ్చారు. చేతి కంపోజు నుంచి ఒకేసారి పేజినేషన్‌కు వెళ్లారంటే బూర్జువా దశను దాటి సోషలిస్టు దశలోకి ప్రవేశించారన్న మాట అని చమత్కరించారు. సుందరయ్య రాజకీయాలతో పాటు సాంకేతిక అభివృద్ధి గురించి తరచూ చర్చించేవారని, ప్రజాశక్తిని చూస్తుంటే ఆయన కలలు నిజమైనట్లు అనిపిస్తోందని రామ్ కరతాళధ్వనుల మధ్య అన్నారు. పదో వార్షికోత్సవానికి సోదర పత్రికల సంపాదకులందరూ హాజరై అభినందించారు. దశమ వార్షికోత్సవం వాస్తవానికి రాజకీయంగా, పత్రికాపరంగా కొత్త దశకు సూచన. తర్వాతకాలంలో పత్రిక అభివృద్ధి వేగం పుంజుకుంది. 1991లో సోవియట్ విచ్ఛిన్నం, 1992లో బాబ్రీ మసీదు విధ్వంసం వంటి సందర్భాల్లో ప్రజాశక్తి నిర్వహించిన పాత్ర దాన్ని ప్రగతిశీల లౌకిక శక్తులకు మరింత దగ్గర చేసింది.

మరిన్ని ఎడిషన్లు

1994లో హైదరాబాదు ఎడిషన్ ప్రారంభమైంది. ఆ ప్రతిపాదనకు మొదట చాలా మంది భయపడ్డారు. కానీ అధునాతన సాంకేతిక సదుపాయాలతో సులభంగానే ఎడిషన్ ప్రారంభమైంది. ఇది తెలుగులో వామపక్ష పత్రికల చరిత్రలో కొత్త అధ్యాయం. తర్వాత కాలంలో ప్రత్యేక సంచికలు మరింత

..4లో

సహకార సంఘం అభివృద్ధికి కృషి

మధ్యాహ్నపువారిగూడెం సొసైటీ ఛైర్మన్ అడపా నాగరాజు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మధ్యాహ్నపువారిగూడెం సహకార సంఘం అభివృద్ధికి పర్సన్‌లతో కలిసి తన వంతు కృషి చేస్తానని సొసైటీ ఛైర్మన్, జనసేన మండల కన్వీనర్ అడపా నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రతిరైతుకూ సేవలందించేందుకు నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. సంఘ సభ్యుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తానన్నారు. రైతుల సంక్షేమం కోసం సొసైటీ సహకారం అందిస్తుందన్నారు. రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులకు పండించిన ధాన్యం, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించే విధంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పంట రుణాలతో పాటు బంగారంపై తక్కువ వడ్డీకి అప్పులు కూడా ఇస్తున్నామని తెలిపారు. సొసైటీ ద్వారా దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు, రైతుల సౌకర్యార్థం గోదాము ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతు అడిగిన వెంటనే సకాలంలో పంట రుణాలు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. రానున్న రోజుల్లో సంఘ అభివృద్ధిలో భాగంగా నూతన వ్యాపారాలు చేపడతామన్నారు. రైతుల రుణాలు, చెల్లింపులు, రైతులకు అవసరమైన ఎరువులు వంటి విషయాలను సంఘ సిఇఒ భుజంగరావు, ఇతర సిబ్బంది, పాలకులతో కలిసి చర్చించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. రుణాల మంజూరు విషయంలో సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామన్నారు. సొసైటీ పరిధిలోని మధ్యాహ్నపువారిగూడెం, తిరుమలదేవిపేట, వెంకటాపురం, అబ్దుల్లాపురం, సాలిగూడెం తదితర గ్రామాల్లో ప్రజా అవసరాలకు అనుగుణంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సొసైటీ సేవలు రైతులు వినియోగించుకోవాలని సూచించారు. సొసైటీ ఛైర్మన్‌గా తనను నియమించి బాధ్యతలు అప్పగించిన కూటమి ప్రభుత్వానికి, పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజుకు, స్థానిక నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, ప్రధాని మోడీ సారథ్యంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ సక్సెస్ అయ్యాయన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం వారిలో ఆనందాన్ని నింపిందన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు ఎంపీ, ఎంఎల్‌ఎలతో పాటు స్థానిక నాయకుల సహకారంతో మండల ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా చూస్తామన్నారు. మండలంలో ఏడాది కూటమి పాలనలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల ఏర్పాటుతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తామని, మండలాఅభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

నాయకపోడు పేదలకు అటవీ భూములు పంచాలి

ఆదివాసీ నాయకపోడు కమిటీ జిల్లా అధ్యక్షులు నారం రాజా

ప్రజాశక్తి - టి.నరసాపురం

భూమిలేని నాయకపోడు పేదలకు ప్రభుత్వం అటవీ భూములు పంపిణీ చేయాలని ఆదివాసీ నాయకపోడు కమిటీ జిల్లా అధ్యక్షులు నారం రాజా కోరారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ నాయకపోడులు అన్ని సామాజిక తరగతుల్లో వెనుకబడి నవారిగా ఉన్నారన్నారు. భూమి, భుక్తి లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. అడవితల్లిని నమ్ముకుని బతుకుతున్నారని, అటువంటి పేదలను ప్రభుత్వం గుర్తించి అటవీ భూములను పంచాలని కోరారు. ఏలూరు జిల్లాలో నాయకపోడులు సుమారు 40 వేల మంది ఉన్నారన్నారు. తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాలు విడిపోయిన తర్వాత జిల్లాలో చింతలపూడి, టి.నరసాపురం మండలాలు నాన్ షెడ్యూల్డ్ ఏరియాలో ఉండడంతో నాయకపోడులకు ప్రభుత్వం అందిస్తున్న ఐటిడిఎ నిధులు, ఎస్‌టి రిజర్వేషన్ ఫలాలు అందడం లేదన్నారు. ప్రభుత్వాలు నాన్ ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న నాయకపోడుల గ్రామాలను ఏజెన్సీ ప్రాంతంలో కలపాలని, ఎస్‌టిలకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల సౌకర్యాలు నాయకపోడులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐటిడిఎ పరిధిలోని సబ్‌ప్లాన్ నిధులు నాయకపోడులకు అందించాలన్నారు. చదువుకున్న నాయకపోడు యువతకు ఐటిడిఎలో అవుట్‌సోర్సింగ్, పూర్తి ప్రాతిపదికన ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో ఐటిడిఎ ద్వారా ఎస్‌టిలకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని సౌకర్యాలు నాన్ షెడ్యూల్డ్ ఏరియాలో నాయకపోడులకు కూడా అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామానికి ఎస్‌టి నిధులు కేటాయించాలని, గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని, తాగునీరు, రోడ్లు డ్రెయినేజీ సౌకర్యాలు కల్పించాలని, ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. నాయకపోడుల హక్కుల సాధనకు ఆదివాసీ నాయకపోడు కమిటీ నిరంతరం పోరాడుతుందన్నారు. వర్గీకరణలో భాగంగా ప్రభుత్వాలు ఎస్‌టి వర్గీకరణ చేపడితే నాయకపోడులకు రిజర్వేషన్‌లో ప్రత్యేక స్థానం కల్పించాలన్నారు. నాయకపోడులకు విద్య, ఉపాధి అన్నిరంగాల్లో అవకాశాలు కల్పించాలని కోరారు.

అమెరికా అడ్డగోలు సుంకాలు.. ఆక్వా రైతు కుదేలు

ప్రభుత్వాలకు ఆదాయం యావ తప్ప రైతులకు, ఈ రంగానికి అవసరమైన ఆదుకునే చర్యలు లేవు. దేశంలో, రాష్ట్రంలో వినియోగాన్ని (దేశీయ వినియోగం కేవలం 10 శాతం మాత్రమే ఉంది) ప్రోత్సహించడం లేదు. చౌకైన, పౌష్టికాహారాన్ని ప్రజలకు అందించాలనే ఆలోచన, శ్రద్ధ లేదు. ప్రపంచంలో ఉత్పత్తి అయ్యే రొయ్యల్లో అమెరికా 31 శాతం, చైనా 20 శాతం, వియత్నాం 12 శాతం మొత్తం 63 శాతం దేశీయంగా వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ, రాష్ట్ర జిడిపిలో ముఖ్య భాగంగా ఉన్న (రాష్ట్ర జిడిపి 9 శాతం) ఆక్వా రంగం పట్ల శ్రద్ధ వహించాలి. నీలి విప్లవాన్ని ప్రోత్సహిస్తున్నామంటూ ఆ రంగానికి, రైతాంగానికి తగులుతున్న దెబ్బలను ప్రభుత్వాలు కాయడం లేదు. బాధాకరం అంటూ ప్రధాని, నష్టం జరుగుతుందంటూ ముఖ్యమంత్రి మాటలు తప్ప ఆదుకునేందుకు చర్యలు లేవు. ఉప ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నాయకుని నుండి కనీస స్పందనే లేదు.

ట్రంప్ నేతృత్వంలోని అమెరికన్ ప్రభుత్వం భారతదేశ విదేశీ ఎగుమతులపై ఆగస్టు 7 నుండి 25 శాతం, ఆగస్టు 25 నుండి మరో 25 శాతం పన్నులు విధించడం ఘోరమైన విషయం. పైకి 50 శాతంగా కనబడుతున్నా ఇది ఆచరణలో కౌంటర్ వెయిలింగ్ డ్యూటీ 5.76 శాతం, యాంటీ డంపింగ్ డ్యూటీ 3.96 శాతం కలిసి 59.72 శాతం కానుంది. భారత్ నుండి అమెరికాకు ప్రధానంగా రత్నాలు (రూ.లక్ష కోట్లు), విద్యుత్ పరికరాలు, మిషనరీ (రూ.80 వేల కోట్లు), వస్త్రాలు (రూ.90 వేల కోట్లు), రసాయనాలు (రూ.20 వేల కోట్లు), తోలు (రూ.10 వేల కోట్లు), రొయ్యలు (రూ.20 వేల కోట్లు) ఎగుమతి అవుతున్నాయి. అమెరికాకు వివిధ రకాల ఎగుమతులు (రూ.7,50,000 కోట్లకు పైగా విలువ చేసే) అవుతుండగా అమెరికా నుండి భారత్‌కు రూ.3,95,000 కోట్ల విలువ చేసే దిగుమతులు జరుగుతున్నాయి. అమెరికా-భారత్ మధ్య వాణిజ్యం విలువ రూ.11,50,000 కోట్ల వరకు ఉంది. దాంతో ఈ సుంకాల భారం మన దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపనుంది. భారత్ అత్యంత మిత్ర దేశంగా చెబుతున్న అమెరికా, ట్రంప్ మంచి మిత్రుడని చెబుతున్న మన ప్రధాని ఇరువురూ ఒకరినొకరు పొగడ్తలతో ముంచెత్తుకుంటూ, జబ్బలు చరుచుకుంటున్నారు. ఈ పన్నుల భారం రాష్ట్రంలోని ఆక్వా రంగంపై తీవ్ర ప్రభావం చూపనుంది. సముద్ర ఉత్పత్తిలోను, రైతులు పెంచే చెరువుల్లోను రొయ్యలు ముఖ్యమైన స్థానాన్ని ఆక్రమించాయి. భారత్ నుండి 67 దేశాలకు ప్రధానంగా అమెరికాకు రొయ్యలు ఎగుమతి అవుతున్నాయి. దేశ ఉత్పత్తిలో (9 లక్షల టన్నులు) 70 శాతం ఆంధ్రప్రదేశ్‌లోనే జరుగుతోంది. దేశ ఎగుమతుల్లో 60 శాతం ఆంధ్రా నుండే. ఇందులో 28 నుండి 30 శాతం అమెరికాకు వెళుతోంది. మన రాష్ట్రంలో జరుగుతున్న రూ.25,000 నుండి రూ.30,000 కోట్ల విలువైన రొయ్యల ఉత్పత్తిలో సింహ భాగం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుండే. ఉమ్మడి తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, శ్రీకాకుళం జిల్లాలతోపాటు ఇటీవల కాలంలో రాయలసీమ జిల్లాల్లో కూడా ఉత్పత్తి జరుగుతోంది. ఆంధ్రతోపాటు తమిళనాడు, ఒరిస్సా, కేరళ తదితర రాష్ట్రాల్లోనూ ఉత్పత్తి ఉంది. దేశంలో 10 లక్షలకు పైగా ఆక్వా (రొయ్య, చేప) రైతులు వుండగా రాష్ట్రంలో 2.50 లక్షల రొయ్యల రైతులుంటారని అంచనా. మొత్తం ఆక్వా రంగంపై 30-40 లక్షల మంది ప్రత్యక్ష (ప్రాసెసింగ్, ఐస్‌ప్లాంట్లు, రవాణా, హార్వెస్టింగ్) పరోక్ష ఉపాధి పొందుతున్నారని అంచనా. అయితే మన రాష్ట్రంలో జరిగే మొత్తం ఉత్పత్తిలో అమెరికాకు వెళ్ళేది 28-30 శాతం మాత్రమే.

ప్రభుత్వాల స్పందన నిరాశాజనకం..

అమెరికా పన్నుల నేపథ్యంలో దేశ ఆక్వా రంగానికి అందునా ఆంధ్రప్రదేశ్, గోదావరి జిల్లాలకు తీవ్ర నష్టం, కుదుపు ఉంటుంది. ఆక్వా రైతాంగం తీవ్ర ఆందోళన, ఆవేదన, ఆగ్రహంతో ఉన్నారు. అయితే మొత్తం ఉత్పత్తిలో 70 శాతం పైగా ఇతర దేశాలకు ఎగుమతి ఉంది. ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందాల్లో భాగస్వామిగా ఉన్న మన మీద ఏకపక్షంగా ఇంత శాతం పన్నులు చట్ట రీత్యా వేయరాదు. అతి పెద్ద దేశమైన చైనా మాదిరిగా ఎదిరించే శక్తి, పన్నులకు ప్రతిగా పన్నులు వేసే ధైర్యం మన ప్రభుత్వానికి లేదు. అమెరికాను ఎదిరించడంలో కనీసం సింగపూర్ లాంటి చిన్న దేశ ప్రధానికి వున్న పాటి తెగువ 52 అంగుళాల ఛాతీ అని గొప్పలు చెప్పుకుంటున్న మన ప్రధానికి లేకపోవడం అవమానకరమే. ఇలాంటి పరిస్థితుల్లో ఇతర దేశాలకు ఎగుమతులపై శ్రద్ధ, ప్రత్యామ్నాయ మార్గాలు వెదకాలి. వ్యవసాయ, ఆక్వా రంగ రైతాంగాన్ని ఆదుకునే ప్రయత్నాలు ముమ్మరం చేయాలి. అది కనిపించడం లేదు. సుంకాలు విధించడం విచారకరం. దురదృష్టకరం లాంటి మాటలతోనే కాలం వెళ్ళబుచ్చుతున్నారు.

పైగా అమెరికాకు ఎగుమతి అయ్యేది 20, 30 కౌంట్లే కాని ఎగుమతి కంపెనీలు ఇతర దేశాలకు ఎగుమతి చేసే అన్ని కౌంట్ల ధరలు తగ్గించి వేస్తున్నారు. సందట్లో సడేమియాలా ఎగుమతి కంపెనీలు అమెరికా పన్నుల సాకు చూపి మొత్తం ధర దిగ్గోసి కొంటున్నారు. ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నవాటికి, అమెరికా పన్నులకు సంబంధమే లేదు. అయినా కౌంటుకు రూ.40 నుండి రూ.50 తగ్గించి (పన్నులు అమలులోకి రాక ముందు నుండే) కొని రైతులను దోచుకుంటున్నారు. ఎగుమతి కంపెనీల ఇష్టారాజ్యంగా ఉంది. కష్టాలతో అనేక సమస్యలను ఎదుర్కొంటూ పండిస్తున్న రైతులకు బోడిగుండుపై తాటికాయ పడ్డ చందంగా తయారైంది.

సీడ్, ఫీడ్, కరెంటు రాయితీలు పట్టించుకోరే!

ఒకవైపున అత్యధికభాగం న్యాయమైన సీడ్ దొరకడం లేదు. ప్రభుత్వం సీడ్ బాధ్యత ఏమాత్రం తీసుకోవడం లేదు. ఉన్న ఒక్కగానొక్క ప్రభుత్వ సీడ్ హేచరీ (టాస్ పార్క్) మూతపడింది. లెక్కలేనన్ని ప్రయివేటు సీడ్ హేచరీలు పుట్టుకొచ్చాయి. ఫీడ్ ధర నియంత్రణ లేదు. పలు ఫీడ్ల నాణ్యతపై కూడా రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ముడి సరుకు సోయాబీన్ ధర పెంచి నప్పుడు కంపెనీలు ఫీడ్ ధర పెంచేస్తున్నాయి. తగ్గినప్పుడు మాత్రం తగ్గించడం లేదు (క్రూడ్ ఆయిల్-పెట్రోలు, డీజిల్ ధరల తంతు.).

ఇటీవల రైతులు గగ్గోలు పెట్టి తీవ్ర ఆందోళన చేయగా కంటి తుడుపుగా కేజీకి రూ.4 మాత్రం తగ్గించారు. కనీసం రూ.15-రూ.20 తగ్గించాలి. విద్యుత్ రాయితీ (యూనిట్‌కి రూ.1.50) చాలా ప్రాంతాల్లో, రైతులకు అందడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్లు అవసరమైనవి, కొత్తవి ఇవ్వడం లేదు. ఆక్వా ద్వారా కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్యాన్ని, రాష్ట్ర ప్రభుత్వం పన్నులు, మార్కెట్ సెస్‌ల రూపంలో రూ.వందల కోట్ల ఆదాయాన్ని పొందడం తప్ప రైతులను పట్టించుకున్నది, వారి గోడు విని సమస్యలు పరిష్కరించిందీ లేదు. ప్రభుత్వాలకు ఆదాయం యావ తప్ప రైతులకు, ఈ రంగానికి అవసరమైన ఆదుకునే చర్యలు లేవు. దేశంలో, రాష్ట్రంలో వినియోగాన్ని (దేశీయ వినియోగం కేవలం 10 శాతం మాత్రమే ఉంది) ప్రోత్సహించడం లేదు. చౌకైన, పౌష్టికాహారాన్ని ప్రజలకందించాలనే ఆలోచన, శ్రద్ధ లేదు. ప్రపంచంలో ఉత్పత్తి అయ్యే రొయ్యల్లో అమెరికా 31 శాతం, చైనా 20 శాతం, వియత్నాం 12 శాతం మొత్తం 63 శాతం దేశీయంగా వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ, రాష్ట్ర జిడిపిలో ముఖ్య భాగంగా ఉన్న (రాష్ట్ర జిడిపి 9 శాతం) ఆక్వా రంగం పట్ల శ్రద్ధ వహించాలి. నీలి విప్లవాన్ని ప్రోత్సహిస్తున్నామంటూ ఆ రంగానికి, రైతాంగానికి తగులుతున్న దెబ్బలను ప్రభుత్వాలు కాయడం లేదు. బాధాకరం అంటూ ప్రధాని, నష్టం జరుగుతుందంటూ ముఖ్యమంత్రి మాటలు తప్ప ఆదుకునేందుకు చర్యలు లేవు. ఉప ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నాయకుని నుండి కనీస స్పందనే లేదు.

తక్షణం తీసుకోవాల్సిన చర్యలు..

- ❖ కేంద్ర ప్రభుత్వం ఎంపెడా కౌంటర్ గ్యారెంటీ ఇచ్చి మొత్తం ఆక్వా ఉత్పత్తులను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తానని భరోసా ఇవ్వాలి. కేంద్రం, ప్రధాని అమెరికాతో చర్చలు జరపాలి. ప్రత్యామ్నాయ మార్గాలను చేపట్టాలి. తక్కువ సుంకాలున్న అవసరమైన దేశాలకు ఎగుమతులు ప్రోత్సహించాలి.
- ❖ కేంద్ర ప్రభుత్వం అమెరికా ఆంక్షలు తిప్పికొట్టాలి.
- ❖ అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.
- ❖ ఆక్వా రంగాన్ని వ్యవసాయంగా గుర్తించాలి. రైతులు, రైతు సంఘాల ప్రతినిధులతో సమస్యలపై చర్చించాలి.
- ❖ రాష్ట్ర ప్రభుత్వం కూడా గతంలోవలె కౌంటుల వారీగా ధరలు నిర్ణయించి ఎక్స్‌పోర్టర్లు, ట్రేడర్లతో అమలు చేయించాలి. తగిన యంత్రాంగం ఏర్పాటు చేయాలి. మార్కెట్ జోక్యం ..12లో



చైతన్య కిరణం.. ప్రజాశక్తి

(2వ పేజీ నుంచి)

ఎక్కువగా వచ్చాయి. పత్రిక ఎనిమిది పేజీలైంది. శీర్షికలు పెరిగాయి. కంప్యూటర్ కేంద్రాలు పెరిగాయి. 1997లో విశాఖపట్నంలో మూడో ఎడిషన్ మొదలైంది. 1999లో పత్రిక కేంద్ర కార్యాలయం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు మారింది.

కొత్త పుంతలు

2000లో నాటి చంద్రబాబు ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంతో ప్రపంచీకరణ వ్యతిరేక పోరాటాలతో ప్రజాశక్తి పూర్తిగా మమేకమైంది. పత్రికలో శీర్షికలు పెరుగుదలే కాక మరింత జనరంజకంగా మారాయి. యంత్రాంగం విస్తరించింది. చిరకాలంగా ఉన్న లోగో సహా అనేక మార్పులు జరిగాయి. 2001లో 20వ వార్షికోత్సవంలో తిరుపతి ఎడిషన్ మొదలైంది. ఇక ఆ తర్వాత చకచకా ఎడిషన్లు పెరిగాయి. ఖమ్మం, కర్నూలు, రాజమండ్రి, కరీంనగర్, ఒంగోలు, రాష్ట్ర విభజన అనంతరం శ్రీకాకుళం, అనంతపురం ఎడిషన్లు వచ్చాయి. 2004 నుంచి జిల్లాల టాబ్లాయిడ్స్ కూడా మొదలయ్యాయి. సిబ్బంది పెరిగారు. పెరిగిన యంత్రాంగం, పునాది, మారిన దృక్పథం ఇవన్నీ ప్రజాశక్తిని తెలుగు పత్రికా లోకంలో ఒక విలక్షణ ప్రగతిశీల పత్రికను చేశాయి.

అడుగడుగునా అక్రమాలు.. అవినీతి..!

పోలవరం పునరావాసంలో పాలకుల తీరు

గిరిజనులు, నిర్వాసిత గిరిజనుల మధ్య చిచ్చు పెడుతున్న అధికారులు

ఆదివాసీలను అడవికి దూరం చేసేలా పన్నాగం

పోరాటాలకు సన్నద్ధమవుతున్న అడవి బిడ్డలు

నిర్వాసితుల త్యాగాల పునాదులపై నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు పూర్తికాక ముందే పునరావాసం పూర్తి కావాలనేది అందరూ కోరుకుంటుందే. ఆచరణలో అందుకు భిన్నంగా జరుగుతుందని అందరికీ తెలిసిందే. నిర్వాసితులకు పునరావాసం కల్పించాలంటే భూమి అవసరం. గిరిజనులకు భూమికి భూమి ఇవ్వాలి. కాలనీల నిర్మాణానికి భూమి కావాలి. దీనికి భూసేకరణకు వివాదాలు లేనివి, చట్టబద్ధమైన భూములు సేకరించాలి. అయితే అధికార పార్టీల నేతల ప్రోత్సాహంతో కొందరు అధికారులు గిరిజనేతర భూస్వాములతో కుమ్మక్కై దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. దీర్ఘకాలంగా గిరిజనుల సాగులో ఉన్న భూములు, ఎల్‌టిఆర్ భూములు, గిరిజనులకు పట్టాలున్న భూములు, చివరికి కోర్టు వివాదాల్లో ఉన్న భూములు సైతం సేకరిస్తున్నారు. దీంతో గిరిజనులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. నిర్వాసిత గిరిజనులకు, స్థానిక గిరిజనులకు మధ్య వివాదాలు ఎగదోస్తున్నారు. దీనివల్ల నిర్వాసితులకు సాగు భూమి దక్కకపోగా, స్థానిక గిరిజనులు ఉన్న కొద్దిపాటి సాగు భూములు కోల్పోయే పరిస్థితులు దాపురించాయి.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల నిర్వాసితులవుతున్నవారికి ఏలూరు జిల్లా పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో భూసేకరణ చేస్తున్నారు. గతంలో సేకరించిన వాటిలో మిగులు భూములున్నాయని నాడు అధికారులు ప్రకటించారు. ఎన్ని ఎకరాలు ఎక్కడున్నాయనే వివరాలు నేటికీ ప్రకటించలేదు. నేడు తాజాగా మరో ఐదు వేల ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో 1/70 చట్టం అమలు చేయాలని 30 ఏళ్లుగా పోరాటాలు సాగుతున్నాయి. చట్టప్రకారం 1970 తర్వాత నుండి భూములు, ఆస్తుల అమ్మకాలు, కొనుగోళ్లు చెల్లవు. గిరిజనుల నుంచి గిరిజనేతరులు భూముల కొనుగోళ్లు చెల్లవు. గిరిజనుల భూములు గిరిజనులకు అమ్మొచ్చు. వీటిని ఏజెంట్ టు గవర్నమెంట్ – జిల్లా కలెక్టర్ (అందుకే ఏజన్సీ ప్రాంతం అని పిలుస్తారు) నిర్ధారించాలి. ఈ చట్టం కిందకు వచ్చే భూములను ఎల్‌టిఆర్ (భూమి బదిలీ నియంత్రణ చట్టం) భూములు అంటారు. పోరాటాలు సాగించి వేలాది ఎకరాలు గిరిజనులు సాధించుకున్నారు. వీటికి ప్రభుత్వాలు నేటికీ ఎటువంటి రక్షణా కల్పించలేదు. ఈ సమస్య ఏ ప్రభుత్వాలకూ పట్టడం లేదు. ఎంఎల్‌ఎలు ఏ పార్టీకి చెందిన వారైనా ఆదివాసీ గిరిజనులే. అయితే వీరెవరూ భూసమస్యపై గిరిజనులకు అండగా నిలవడం లేదు. బరితెగించి గిరిజనేతర భూస్వాముల పక్షాన నిలుస్తున్నారు.

పోలవరం నిర్వాసితుల కోసం గతంలో సాగిన భూసేకరణ వివాదాల్లో ఉన్నవి సేకరించారు. కోట్లాది రూపాయలు కుంభకోణం సాగిందనే ఆరోపణలు నేటికీ సాగుతూనే ఉన్నాయి. తాజాగా భూసేకరణ తంతు పాతదానికి కొనసాగింపుగా ఉంది. నాన్ షెడ్యూల్ ప్రాంతంలో సైతం గ్రామసభల్లో భూసేకరణ ప్రక్రియ చేపట్టాలని చట్టం చెబుతోంది. అలాంటిది షెడ్యూల్ ప్రాంతంలో పీసా చట్ట ప్రకారం గ్రామసభల పీసా సభ్యుల ఆధ్వర్యంలో జరపాలి. ఇది రాజ్యాంగబద్ధమైంది. పీసా గ్రామసభల ద్వారానే భూములు సేకరించాలి. లేకుంటే చట్ట విరుద్ధం. భూసేకరణ చెల్లదు.

బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరంలో జులై నెలలో పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ జరుగుతుందని స్థానిక గిరిజనులకు తెలిసింది. వెళ్లి తీరా చూస్తే గ్రామసభ అనే బ్యానర్ కట్టి ముగ్గురు గిరిజనేతర భూస్వాములతో తహశీల్దార్ మాట్లాడుతున్నాడు. ఇదేమి గ్రామసభ అనుకుంటే గ్రామంలో ఎటువంటి సమాచారం లేదు. పంచాయతీ సర్పంచి, సభ్యులు, పీసా కమిటీ సభ్యులకు సమాచారం ఎందుకు తెలియజేయలేదని, వారు లేకుండా గ్రామసభ జరపడమేమిటని నిలదీశారు. గ్రామసభ బ్యానర్‌పై దుప్పటి కప్పేశారు. దాంతో ఇది గ్రామసభ కాదని బొంకాడు. ప్రజలు నిలదీస్తే పలాయనం చిత్తగించాడు. కొద్ది రోజులకే భూసేకరణ నోటిఫికేషన్ పత్రికల్లో ప్రచురితమైంది. అందులో గిరిజనుల సాగులో ఉన్న పలు భూములున్నాయి. చిత్రమేమిటంటే గిరిజనులకు పట్టాలున్న భూములు సైతం గిరిజనేతర భూస్వాముల పేరున నోటిఫికేషన్‌లో ఉన్నాయి. ఇదే మండలంలో జైనవారిగూడెం, ఇనుమూరు, మర్లగూడెం, జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెం, అంకన్నగూడెం, సిరివారిగూడెం గ్రామాల్లో ఇదేతంతు సాగించాలని చూస్తున్నారు. వీటిలో ఏ గ్రామాల్లోనూ గ్రామసభలు జరపలేదు. సేకరించే ప్రతిపాదిత భూముల సర్వే ప్రక్రియ జరగలేదు. ఐనా సేకరిస్తున్నట్లు నోటిఫికేషన్‌లో పొందుపరుస్తున్నారు. ఇనుమూరు గ్రామానికి ఇంతవరకూ అధికారులు వెళ్లలేదు. అయితే ఆర్‌అండ్‌ఆర్‌లో సేకరిస్తున్నారనే ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. అంకన్నగూడెంలో దీర్ఘకాలంగా పట్టాలుండి గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములపైనా అదే తీరు. అదే పంచాయతీలోని జగన్నాధపురం మామిడితోట భూముల సేకరణలోనూ ఇదే తంతు. మిగిలిన

..12లో

హక్కులు, సంస్కృతి, మనుగడకు ఆదివాసీల పోరాటం

2006లో సవరించిన వన్యప్రాణుల రక్షణ చట్టంలోని సెక్షన్ 38(5) ప్రకారం, చట్టం కింద నియమించబడిన కమిటీలు శాస్త్రీయ అంచనా ద్వారా... ఒక నిర్దిష్ట ప్రాంతాన్ని ముఖ్యమైన వన్యప్రాణుల నివాస స్థలంగా ప్రకటిస్తే, ఆ ప్రాంత నిర్వహణ కోసం స్థానిక గ్రామ సభలను సంప్రదించాలి. అటవీ హక్కుల చట్టం ప్రకారం, హక్కులను గుర్తించడం ఒక షరతు. ఇంకా, పునరావాసం అవసరమని భావిస్తే, 2013 భూసేకరణ చట్టం ప్రకారం బాధిత కుటుంబాల సమ్మతితో పునరావాసం కల్పించాలి. ప్రభావితమైన పెద్ద ప్రాంతాలకు, అటవీ హక్కుల చట్టం ప్రకారం గ్రామసభ సమ్మతి అవసరం. అయితే, ఈ ప్రాంతాలలోని వర్గాల హక్కులను గుర్తించే చట్టాల్లోని ఈ నిబంధనలన్నిటినీ మోడీ ప్రభుత్వం స్పష్టంగా ఉల్లంఘిస్తున్నది.

ప్రపంచవ్యాప్తంగా 80 దేశాల్లో సుమారు 40 కోట్ల మంది ఆదివాసులు జీవిస్తున్నారు. భారత దేశంలో 705 ఆదివాసీ తెగల్లో సుమారు 10 కోట్ల మంది జీవిస్తున్నారు. కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ఆదివాసుల రాజ్యాంగ హక్కులను గుర్తించడానికి నిరాకరిస్తున్నది. అడవులపై ఆదివాసులు సాధించిన హక్కులను తొలగించి బడా కార్పొరేట్ కంపెనీలకు ప్రవేశం కల్పిస్తున్నది. ప్రపంచ ఆదివాసుల అస్తిత్వాన్ని రక్షించాలంటే వారికి రాజ్యాంగ పరమైన హక్కులు వుండాలి. అడవిపై పూర్తి హక్కులు వుండాలి. వీటితో పాటుగా వారి భాష, సంస్కృతి రక్షణకు నిరంతరం నినదించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జీవో నంబర్ 3 ప్రాధాన్యత

భారత రాజ్యాంగం 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసులకు అడవులు, భూములపై అధికారాలు కల్పించింది. షెడ్యూల్ ప్రాంతంలో ఆర్టికల్ 30,32,34 ప్రకారం ఎంఎల్ఏ, ఎంపీ స్థానాలు, పీసా చట్టం ప్రకారం సర్పంచ్, ఎంపిపి స్థానాలలో ఆదివాసులకు వంద శాతం రిజర్వేషన్ కల్పించింది. రాజ్యాంగం కల్పించిన హక్కులకు అనుగుణంగా ఆదివాసీ ప్రాంతాల్లో 100 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం పోరాడుతున్నది. జీవో నెం.3 స్థానంలో ఏజెన్సీలో 100 శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం చేసి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చాలి. కోర్టుల జోక్యం లేకుండా చర్యలు తీసుకోవాలి. ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంతంలో జీవో నంబర్ 3 చట్టబద్ధత ఉండగా 19 శాఖల్లో 36 రకాల ఉద్యోగాలు ఆదివాసీలకు హక్కుగా పొందేవారు. 2020లో సుప్రీంకోర్టు జీవో నంబర్ 3 రద్దు చెయ్యడంతో ఏజెన్సీలో హక్కుగా పొందే ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయాయి. జీవో నంబర్ 3 చట్టబద్ధత ఉండగా ఏజెన్సీ ప్రాంతాల్లో కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ పేరుతో వందలాది పోస్టులు ఆదివాసీ యేతరులు లబ్ధి పొందారు. జీవో నంబర్ 3 రద్దు అనంతర కాలంలో సచివాలయం, మెడికల్, విద్యాశాఖ, ఐసిడిఎస్, ఏకలవ్య స్కూలు, పాడేరు మెడికల్ కాలేజీ పోస్టుల నియామకంలో ఆదివాసులకు 6 శాతం రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించడంతో ఆదివాసులు వందలాది ఉద్యోగాలు కోల్పోయారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్సీ నోటిఫికేషన్లో ఆరు శాతం రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించడంతో ఆదివాలకు తీవ్ర అన్యాయం జరిగింది. రాష్ట్ర ఏజెన్సీ ఐటిడిఎ పరిధిలో 766 ఉపాధ్యాయ పోస్టులు నోటిఫై చేస్తే ఆదివాసీలకు దక్కేది కేవలం 42 పోస్టులు మాత్రమే. ఆదివాసీ ప్రాంతాల్లో 94 శాతం నివాసం ఉన్న ఆదివాసులకు 6 శాతం పోస్టులు, నివాసం ఉన్న గిరిజనేతరులకు మాత్రం 94 శాతం పోస్టులు దక్కడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆదివాసీ గిరిజన సంఘం ఏజెన్సీ స్పెషల్ డిఎస్సీ సాధన కమిటీ, ఇతర ఆదివాసీ సంఘాల పోరాటంతో సిఎంఓ కార్యాలయంతో చర్చల అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి గిరిజన సంక్షేమ శాఖ రివ్యూ సమావేశం అనంతరం ఏజెన్సీలో వందశాతం ఉద్యోగ కల్పనకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటన చేశారు. రంపచోడవరం, పార్వతీపురం మన్యం, పాడేరు ఐటిడిఎలో జీవో నంబర్ 3 చట్టబద్ధతపై ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో ఏజెన్సీలో 100 శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం చేసి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. ప్రభుత్వం మాత్రం జీవో నంబర్ 3 చట్టబద్ధతకు మూడు ఆప్షన్లను పరిశీలిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఆదివాసీ ప్రాంతాల్లో వంద శాతం ఉద్యోగం కల్పిస్తేనే ఆదివాసులకు న్యాయం జరుగుతుందని మిగతా ఆప్షనైన యాభై, జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తే ఆదివాసులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేస్తున్నది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల హామీ ప్రకారం 100 శాతం ఉద్యోగ కల్పనకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటన చేస్తూ...మరోవైపు మెగా డిఎస్సీలో ఆదివాసులకు 6 శాతం రిజర్వేషన్ అమలుకు పూనుకుని ఆదివాసులకు తీవ్ర అన్యాయం చేస్తున్నది. మెగా డిఎస్సీ నుండి ఆదివాసీ ప్రాంత పోస్టులు మినహాయించాలని ఏజెన్సీ స్పెషల్ డిఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్ చేస్తూ పోరాడుతున్నది.

ఎఎస్ఆర్ జిల్లా: ఆదివాసులు అత్యధికంగా నిర్వాసితులు అవుతున్న ప్రాంతం

దేశంలోకెల్లా అత్యధిక మంది ఆదివాసులను జల సమాధి చేస్తున్న జిల్లాలో అల్లూరి సీతారామరాజు జిల్లా మాత్రమే. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో 9 మండలాలలోని 270 గ్రామాలలో సుమారు 2.50 లక్షల మంది ఆదివాసులు జల సమాధి అవుతున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం, పెదకోట, గుజ్జేలి, చిట్టంపాడు, ఎర్రవరంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి సుమారు 100 గ్రామాల్లో 10 వేల మంది ఆదివాసులు జలసమాధి అవుతున్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం నిర్వాసితుల సమస్యలను గాలికొదిలేశాయి. ఆదివాసుల అడవులను అదాని పరం చేస్తున్నాయి. అటవీ హక్కుల చట్టాన్ని బలహీన పరచి అల్లూరి సీతారామరాజు జిల్లా షెడ్యూల్ ప్రాంతంలో అపారమైన సహజ వనరులు ఉన్న అడవులను ప్రైవేట్ సంస్థలకు కట్టబెడుతున్నాయి.

అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విజయనగరం జిల్లాలకు చెందిన అనంతగిరి, కొయ్యూరు, చింతపల్లి, దేవరపల్లి, వేపాడ మండలాల్లో పెదకోట, గుజ్జేలి, చిట్టంపాడు, ఎర్రవరం, చింతలపూడి, మారికలో అదాని ఎనర్జీ, నవయుగ ప్రైవేట్ కంపెనీలకు హైడ్రోపవర్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం వలన సుమారు 100 గ్రామాల్లో 10 వేల మంది ఆదివాసులు జలసమాధి అవుతున్నారు. సుమారు 7 వేల ఎకరాల ఆటవీ భూములు అదానీ ఎనర్జీ తదితర సంస్థలకు అప్పగించేందుకు రాష్ట్ర టిడిపి కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. పెదకోట హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ సామర్థ్యాన్ని 800 మెగావాట్ల నుండి 1800 మెగావాట్లకు, చింతలపూడి, మారిక మధ్యలో నిర్మాణ సామర్థ్యాన్ని 600 మెగావాట్ల నుండి 900 మెగావాట్లకు పెంచుతూ జీవో నంబర్ 51 జారీ చేసింది. ఆదివాసులకు నష్టం కల్గిస్తున్న జీవో నంబర్ 51 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘం పోరాడుతున్నది. పీసా గ్రామసభ ఆమోదం లేకుండా 1/70, అటవీ హక్కుల చట్టాన్ని ఉల్లంఘించి షెడ్యూల్ ప్రాంతంలో ప్రైవేట్ కంపెనీలకు హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ ఒప్పందాలకు అనుమతినిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసులకు నష్టం కలిగిస్తున్న జీవో నంబర్ 51 రద్దు చేయాలని, 1/70, అటవి హక్కుల, పీసా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్ చేస్తున్నది. దేవరాపల్లి మారిక గిరిజన సబ్ ప్లాన్ ప్రాంతంలో నిర్మిస్తున్న హైడ్రోపవర్ ప్రాజెక్టు నిర్మాణంపై 2013 భూసేకరణ చట్టాన్ని ఉల్లంఘించి ఆదివాసుల ఆమోదం లేకుండా ముందుకెళ్తున్నది. హైడ్రోపవర్ ప్రాజెక్టు నిర్మాణం వెంటనే ఆపాలని ఆదివాసి గిరిజన సంఘం పోరాటం చేస్తున్నది.

దేశంలో ఆదివాసీ ప్రాంతాల్లో ఆయుధ కర్మాగారం, ఏనుగుల కారిడార్లు, వన్యప్రాణుల పార్కులు, టైగర్ జోన్లు ఏర్పాటు చేస్తూ వేలాది ఎకరాల అటవీ భూములను సేకరించి లక్షలాది మంది ఆదివాసులను అడవి నుండి గెంటివేస్తున్నది. బొగ్గు, బాక్సైట్ తదితర మైనింగ్ తవ్వకాల కోసం కేంద్ర బిజెపి ప్రభుత్వం లక్షలాది ఎకరాల అటవీ భూములను ప్రైవేట్ కంపెనీలకు ధారాదత్తం చేసి లక్షలాది మంది ఆదివాసులను నిర్వాసితులు చేస్తున్నది.

జనగణనలో ఆదివాసులకు ప్రత్యేక కాలమ్ వుండాలి

దేశవ్యాప్తంగా ఆదివాసులు సుమారు 10 కోట్ల మంది జీవిస్తున్నారు. కేంద్రం చేపట్టే జనగణన ఎన్యూమరేషన్ లెక్కింపులో ఆదివాసులకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చెయ్యాలి. ఎన్యూమరేషన్ పత్రాల్లో ప్రస్తుతం పేర్కొన్న అరు మతాలతోపాటు ఆదివాసీ ఎస్టీ మత విశ్వాసం పేరిట కాలమ్‌ను పొందుపరచాలి. ఆదివాసుల ప్రజాస్వామిక, రాజ్యాంగపరమైన హక్కుల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలి.

అటవీ హక్కుల చట్టాన్ని బలహీనపరచి కార్పొరేట్ సంస్థలకు అప్పగింత

భారతీయ అటవీ చట్టం 1927 ఆదివాసీలు, అటవీ వాసులను ఆక్రమణదారులుగా ముద్ర వేయడం ద్వారా అడవి ఆక్రమణకు వలసవాద విధానాన్ని చట్టబద్ధం చేసింది. అటవీ హక్కుల చట్టం–2006 ప్రవేశికలో పేర్కొన్నట్లుగా, ఈ 'చారిత్రక అన్యాయాన్ని' కనీసం పాక్షికంగా పరిష్కరించడానికి వంద సంవత్సరాలు పట్టింది. అయితే పెట్టుబడిదారీ, నయా ఉదారవాద విధానాల కింద అన్నింటి కంటే ముఖ్యంగా బిజెపి ప్రభుత్వ పదేళ్ల పాలనలో అటవీ హక్కుల చట్టాన్ని అనేక విధాలుగా బలహీనపరిచాయి. ఈ చట్టం అమలు చాలా పేలవంగా ఉంది. ఎందుకంటే ఇది అడవులను, అటవీ సంపదను కార్పొరేట్ ప్రయోజనాలకు అప్పగించడానికి ప్రధాన అవరోధంగా పరిగణించబడుతుంది.

ఏప్రిల్ 2025 నాటికి, వ్యక్తిగత అటవీ హక్కుల గుర్తింపు కోసం చేసిన 49 లక్షలకు పైగా క్లెయిమ్‌లలో, సగం కంటే తక్కువ, అంటే 23.8 లక్షలు (49 శాతం) ఆమోదించబడినట్లు కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్ చూపిస్తున్నది. కమ్యూనిటీ అటవీ క్లెయిమ్‌ల కోసం 2.09 లక్షల క్లెయిమ్‌లు చేయబడ్డాయి. కానీ 1.21 లక్షలు మాత్రమే ఆమోదం పొందాయి. తిరస్కరించిన వాటిలో ఎక్కువ, క్లెయిమ్‌దారులకు సరైన చట్టపరమైన పరిష్కార విధానాలు లేకుండానే తిరస్కరించబడ్డాయి. విశ్లేషణ ప్రకారం 36.43 శాతం క్లెయిమ్‌లు తిరస్కరించబడ్డాయి. 14.45 శాతం ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి.

అటవీ హక్కుల చట్ట రాజ్యాంగ చెల్లుబాటుపై సవాలు చేస్తున్న కేసు ఇప్పటికీ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది. ఇది గిరిజనుల హక్కులపై కత్తిలా వేలాడుతోంది. దీనిని చాలా కాలం క్రితమే కొట్టివేయాల్సి ఉంది. కానీ ప్రభుత్వం స్వయంగా గిరిజనుల హక్కులను తొలగించాలని చూస్తోంది. ఈ కారణంగా, ప్రభుత్వం చట్టపరమైన సవాలును అస్సలు పట్టించుకోవడంలేదు. అటవీ భూమిని కార్పొరేట్లకు అప్పగిస్తున్నది. అడవులను ప్రైవేట్ కంపెనీలకు అప్పగిస్తున్నది.

ఆగస్టు 2023లో పార్లమెంటుకు సమర్పించిన సమాచారం ప్రకారం, 2008 నుండి 3.9 లక్షల హెక్టార్ల అటవీ భూమిని 'ప్రాజెక్టులకు' మళ్లించారు. 2014లో బిజెపి ప్రభుత్వం ఏర్పడి మోడీ ప్రధాని అయినప్పటి నుండి మళ్లింపు అత్యధికంగా జరిగింది. దీనికి, మోడీ ప్రభుత్వం అటవీ సంరక్షణ చట్టాన్ని వేగంగా సరళీకరించడం సహాయపడింది. మైనింగ్, నీటిపారుదల, విద్యుత్ ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు వంటి ప్రైవేట్ ప్రాజెక్టుల కోసం ఈ మళ్లింపులో ఎక్కువ భాగం జరిగింది. ఇందులో గత ఐదు సంవత్సరాలలో దేశవ్యాప్తంగా ప్రైవేట్ మైనింగ్ కంపెనీలు 46,759 ఎకరాల అటవీ భూమిని మైనింగ్ కోసం మాత్రమే మళ్లించాయి. 2019 ఏప్రిల్ 1, 2025 మార్చి 31 మధ్య, పర్యావరణ మంత్రిత్వ శాఖ 17 రాష్ట్రాలకు అటవీ భూమిలో ఖనిజాలు, బొగ్గును తవ్వడానికి 179 అనుమతులను ఇచ్చింది. భారతదేశం అంతటా ప్రస్తుతం ఓపెన్ కాస్ట్ మైనింగ్ పద్ధతి వున్నది. ఈ పద్ధతిని "స్లాటర్ మైనింగ్" అని పిలుస్తారు. అటవీ భూమిని బదిలీ చేయడం గురించి మాత్రమే కాదు. ఇది చుట్టుపక్కల ప్రాంతాలలో భారీ కాలుష్యానికి కారణమవుతుంది. నీటి వనరులను దెబ్బ తీస్తుంది. నేల, చెట్లు, వృక్ష సంపదతో పాటుగా అన్ని జాతులు ప్రభావితమవుతాయి. దీనివల్ల ప్రతి ప్రాజెక్టుకు లక్షలాది చెట్లు నరికివేయబడతాయి. గిరిజన జనాభా గణనీయంగా ఉన్న ప్రాంతాలలో డెబ్బై శాతం మైనింగ్ జరుగుతుంది. అలాంటి ప్రాజెక్టులు అత్యంత హాని కలిగిస్తాయి. అటవీ హక్కుల చట్టం అమలులోకి వస్తే, అడవులను ప్రైవేట్ నియంత్రణకు అప్పగించడం మరింత కష్టమవుతుంది. అటవీ హక్కుల చట్టం అమలులో ఇదే ప్రధాన అడ్డంకి. రక్షిత ప్రాంతాల విస్తరణ ప్రభావిత కుటుంబాల చట్టపరమైన హక్కులను విస్మరిస్తుంది.

మోడీ ప్రభుత్వం చట్టవిరుద్ధమైన ప్రక్రియ ద్వారా 'రక్షిత' భూమి మొత్తాన్ని గణనీయంగా పెంచింది. 2006లో సవరించిన వన్యప్రాణుల రక్షణ చట్టంలోని సెక్షన్ 38(5) ప్రకారం, చట్టం కింద నియమించబడిన కమిటీలు శాస్త్రీయ అంచనా ద్వారా...ఒక నిర్దిష్ట ప్రాంతాన్ని ముఖ్యమైన వన్యప్రాణుల నివాస స్థలంగా ప్రకటిస్తే, ఆ ప్రాంత నిర్వహణ కోసం స్థానిక గ్రామ సభలను సంప్రదించాలి. అటవీ హక్కుల చట్టం ప్రకారం, హక్కులను గుర్తించడం ఒక షరతు. ఇంకా, పునరావాసం అవసరమని భావిస్తే, 2013 భూసేకరణ చట్టం ప్రకారం బాధిత కుటుంబాల సమ్మతితో పునరావాసం కల్పించాలి. ప్రభావితమైన పెద్ద ప్రాంతాలకు, అటవీ హక్కుల చట్టం ప్రకారం గ్రామసభ సమ్మతి అవసరం. అయితే, ఈ ప్రాంతాలలోని వర్గాల హక్కులను గుర్తించే చట్టాల యొక్క ఈ నిబంధనలన్నిటినీ మోడీ ప్రభుత్వం స్పష్టంగా ఉల్లంఘిస్తున్నది. ఉదాహరణకు, 2014లో రక్షిత ప్రాంతాల సంఖ్య దాదాపు 740గా ఉంది. దీని విస్తీర్ణం 161,081.622 కి.మీ. ఇది నవంబర్ 2023 నాటికి 175,169.422 కి.మీ కు (భారతదేశ భౌగోళిక ప్రాంతంలో 5.32 శాతం) విస్తరించి ఉన్న 1,014 రక్షిత ప్రాంతాలకు పెరిగింది. ఫిబ్రవరి 2025 నాటికి, ఈ సంఖ్య 1,022 రక్షిత ప్రాంతాలకు పెరిగిందని నివేదించబడింది. అందువల్ల, 2015 నుండి 2025 వరకు రక్షిత ప్రాంతాలు, కారిడార్‌ల కోసం కేటాయించిన మొత్తం అదనపు భూమి దాదాపు 16,000–17,000 కి.మీ. విస్తీర్ణంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆదివాసులకు అడవిపై హక్కుల రక్షణకై పోరాటానికి సన్నద్ధం కావాలి.

- కిల్లో సురేంద్ర, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,

'ప్రజాశక్తి' వెన్నెముక బొమ్మారెడ్డి

ప్రజాశక్తి - విశాఖపట్నం: ఆంధ్ర దేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన అన్ని పత్రికల్లోనూ పనిచేసిన ఘనత ప్రజాశక్తి'మంతుడు' బొమ్మారెడ్డికే దక్కింది. అన్ని దశలలోను బొమ్మారెడ్డి పత్రికకు వెన్నెముకగా నిలిచారు. 'ప్రజాశక్తి' దినపత్రిక తెలుగు పత్రికా రంగంలో గుర్తింపు తెచ్చుకుని నేడు ఇంతటి సమున్నత స్థితికి చేరుకుని 45వ వసంతంలోకి అడుగు పెట్టిందంటే ఇందులో బొమ్మారెడ్డి కృషి, త్యాగం మరువలేనిది. బొమ్మారెడ్డి పలు పుస్తకాలు, అనువాద రచనలు చేశారు.

1917లో కృష్ణా జిల్లా తేలప్రోలు గ్రామంలో ధనిక రైతు కుటుంబంలో బొమ్మారెడ్డి జన్మించారు. 2006 అక్టోబరు 13న కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆ ముగ్గురికి ఆయన కోరుకున్న పద్ధతిలోనే సంస్కరణ వివాహం జరిపించారు. తొమ్మిది పదుల నిండైన జీవితంలో అయిదు పదుల కమ్యూనిస్టు పత్రికా సంపాదకునిగా ప్రస్థానం సాగించారు. 1942లో కమ్యూనిస్టు పార్టీ పత్రిక ప్రజాశక్తి రావడంతో అందులో సబ్‌ఎడిటర్‌గా చేరారు. కొన్నాళ్లకే పత్రికను ప్రభుత్వం నిషేధించినా బొమ్మారెడ్డి పత్రికా రంగాన్ని విడనాడలేదు. ఆనాటి 'ఆనంద వాణి' పత్రికకు వ్యాసాలు రాస్తుండేవారు. కమ్యూనిస్టు నాయకులందరూ అజ్ఞాత వాసంలోకి వెళ్లగా బొమ్మారెడ్డి మాత్రం గన్నవరం తాలూకా కపిలేశ్వరపురం వద్ద రహస్యంగా రాజకీయ తరగతులు నిర్వహిస్తుండేవారు. అప్పట్లో 'జనత' పత్రికను ఉపయోగించుకోవలసిందిగా గంగినేని వెంకటేశ్వరరావు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వానికి కబురంపారు. 'జనత' పత్రికను కమ్యూనిస్టు పార్టీ తీసుకుని బొమ్మారెడ్డి, మా భూమి నాటక కర్త వాసిరెడ్డి భాస్కరరావును సంపాదక వర్గంగా నిర్వహించారు. ఆలోగా విజయవాడలో పార్టీ నాయకులపై నిర్బంధం ముమ్మరం కావడంతో పత్రికను మూసేసి బొమ్మారెడ్డిని మద్రాసు వెళ్ళమని పార్టీ ఆదేశించింది.

మద్రాసులో కమ్యూనిస్టు పార్టీ ఒక లా విద్యార్థి పేరుతో 'సందేశం' అనే వార పత్రికను నడిపింది. బొమ్మారెడ్డి ఆ పత్రికలో కొద్దికాలం పనిచేశారు. ఇంతలో తాపీ ధర్మారావు గారి 'జనవాణి'లో చేరవలసిందిగా పార్టీ ఆదేశించింది. దాంతో బొమ్మారెడ్డి తాపీధర్మారావు క ు వ వా ం ు డ ు మోహనరావుతో కలిసి ఆ పత్రికలో పనిచేశారు.

మద్రాసులో బొమ్మారెడ్డి లాంటి కమ్యూనిస్టుల పరిస్థితి మరీ ఇబ్బందికరంగా ఉండేది. ఆంధ్రలో పార్టీమీద ప్రభుత్వ నిఘా ఎక్కువ కావడంతో నాయకులు మద్రాసుకొచ్చి తలదాచుకునేవారు. వారికి వసతి ఏర్పాట్లు చేసే బాధ్యత బొమ్మారెడ్డి లాంటి యువకులపై ఉండేది. ఎప్పుడు పోలీసులు కన్ను తమపై పడుతుందోననే వాతావరణంలో నాయకులు ప్రాణాలకు తెగించి పనిచేయాల్సి వచ్చేది. ఇంతలో తెలంగాణా పోరాటం ముగిసి ఆంధ్రలోకి తిరిగి వచ్చి పని చేయడానికి అనువైన పరిస్థితులేర్పడడంతో బొమ్మారెడ్డి విజయవాడ చేరుకుని 'ప్రజాశక్తి' వారపత్రికలో పనిచేయడం ప్రారంభించారు. విశాలాంధ్ర సంపాదకవర్గంలో చేరి పన్నెండేళ్లపాటు అంటే పార్టీలో చీలిక వచ్చే వరకు అందులో పనిచేశారు. చీలిక తరువాత సిపిఐ(ఎం) తరపున 'జనశక్తి' వార పత్రిక నిర్వహించబడుతుండేది. అప్పట్లో 'జనశక్తి' ఎడిటర్‌ను అరెస్టు చేయడంతో పత్రికా నిర్వహణ బాధ్యతను బొమ్మారెడ్డికి పార్టీ అప్పగించింది.

నాయకులు విడుదలైన తరువాత 'జనశక్తి' దినపత్రికగా మారినా కొన్నాళ్లకు అది మార్క్సిస్టు లెనినిస్టుల చేతికిపోయింది. ఆ తరువాత 'ప్రజాశక్తి' వారపత్రికగా మొదట కొంత కాలం నడిచి తరువాత ద్వైవార పత్రికగా, అటుపిమ్మట దినపత్రికగా మారింది. అన్ని దశలలోను బొమ్మారెడ్డి పత్రికకు వెన్నెముకగా నిలిచారు.

నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యం

(మొదటి పేజీ నుంచి)

కింద ప్రజలకు రూ.4.20 కోట్ల చెక్కులను అందించి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసాను కల్పించామని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని ఇల్లు లేని నిరుపేదలకు నూతన గృహ నిర్మాణాలను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

చిర్రి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు

చిర్రి ఛారిటబుల్ ట్రస్ట్ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి నియోజకవర్గంలోని పేదల ఆరోగ్య అవసరాలకు ఆర్థిక సాయం చేయడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

గిరిజనుల సమగ్రాభివృద్ధే జిసిసి లక్ష్యం

గిరిజన సహకార సంస్థ ఉపాధ్యక్షులు, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనాకుమారి

విశాఖలోని జిసిసి ప్రధాన కార్యాలయం

ప్రజాశక్తి- విశాఖపట్నం

గిరిజనుల సమగ్ర సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసమే గిరిజన సహకార కార్పొరేషన్ (జిసిసి)ని 1956లో స్థాపించినట్లు ఆ సంస్థ ఉపాధ్యక్షులు, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనాకుమారి తెలిపారు. జిసిసి కార్యకలాపాలు, ముఖ్య ఉద్దేశాలను ఆమె ప్రజాశక్తికి తెలియజేశారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

జిసిసి ముఖ్య ఉద్దేశాలు :

◆ అటవీ ఉత్పత్తులు (ఎంఎఫ్‌పి), వ్యవసాయ ఉత్పత్తులు (ఎపి)ను అడవులపై ఆధారపడిన గిరిజన కుటుంబాల నుండి మన్నికైన ధరలకు ప్రాథమిక సంఘాల మాధ్యమంగా కొనుగోలు చేయడం.

◆ అత్యవసర వస్తువులు (ఇసిఎస్), రోజువారీ వినియోగ వస్తువులు తగిన ధరలకు గిరిజనులకు సరఫరా చేయడం.

◆ వివిధ వ్యవసాయ కార్యకలాపాల కోసం గిరిజన రైతులకు క్రెడిట్ మద్దతు కల్పించి, నగదు లేదా పంట రూపంలో తిరిగి చెల్లించ గల సౌకర్యం కల్పించడం.

◆ గిరిజన కుటుంబాల ఉత్పత్తులకు విలువ జోడించి వాటికి మంచి ధరలు పొందేలా చేయడం.

◆ గిరిజన ప్రాంతాల్లో చిన్నఎత్తు పరిశ్రమల స్థాపన చేసి వినియోగ ఉత్పత్తులను అభివృద్ధి చేయడం, మార్కెట్‌ను అన్వేషించడం.

జిసిసి వివిధ రంగాల్లో విస్తరించి గిరిజనుల ఆదాయాన్ని పెంచేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టింది. వాటిలో ఎంఎఫ్‌పి కొనుగోలు, కాఫీసాగుకు రుణాలివ్వడం, మార్కెటింగ్ మద్దతు, పెట్రోల్ బంకులు, గ్యాస్ పంపిణీ, అత్యవసర వస్తువుల సరఫరా, వ్యవసాయానికి రుణాలు, విలువజోడింపు, గిరిజన బ్రాండ్ ద్వారా ఉత్పత్తుల అమ్మకం మొదలైనవి ఉన్నాయి.

2024-25లో జిసిసి సాధించిన ముఖ్యమైన అంశాలు :

◆ లక్ష గిరిజన కుటుంబాలకు జీవనాధారం కల్పిస్తూ, 18,065 మెట్రిక్ టన్నుల అటవీ, వ్యవసాయ ఉత్పత్తులు, విలువ రూ.9,844 లక్షలు కొనుగోలు చేయడం.

◆ ఇప్పటి వరకు రూ.328.15 లక్షల విలువైన ఎంఎఫ్‌పి/ ఎపి కొనుగోలు చేసి సుమారు 40,000 గిరిజన రైతులకు లబ్ధి చేకూర్చడం.

◆ తామరిందు, మోమొపువ్వ, పుంగం, నక్సోమికా, బెల్లగింజలు, ఆమ్లా, పసుపు, మిరపకాయలు మొదలైన ఉత్పత్తుల కొనుగోలు ధరలు మార్కెట్ ధరల ప్రకారం పెంచడం.

◆ ప్రధాన మంత్రి జన జీవన్ వ్యాపార యోజన (పిఎంజెవిఎం) కింద 415 విడివికెల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.6163 లక్షలు మంజూరు. అందులో రూ.3604 లక్షలు విడుదల. ఇప్పటివరకు 367 విడివికెల పని చేస్తున్నాయి.

జిసిసి ఉత్పత్తులు

◆ పిఎం జన్‌మన్ పథకంలో పథకంలో 73 ప్రత్యేక విడివికెల (పిబిటిజిల కోసం) ఏర్పాటు చేయడం, వాటికి రూ.315 లక్షలు మంజూరు. రూ.157.70 లక్షలు విడుదల చేయడం. అన్నింటినీ 2024-25లో పని చేయించటం.

◆ విడివికెలు గిరిజన ఎంఎఫ్‌పి సేకరించే వారికి ఆదాయాన్ని పెంచేలా, విలువ జోడింపు, బ్రాండింగ్, మార్కెటింగ్ ద్వారా గిరిజన స్వయం సహాయక బృందాల్లో ఆత్మవిశ్వాసం పెంచడం.

జిసిసి 2025-26 సంవత్సరానికి కార్యాచరణ ప్రణాళిక

కార్యకలాపం	లక్ష్యం (రూ.కోట్లలో)
అటవీ/వ్యవసాయ/పర్వత ఉత్పత్తుల కొనుగోలు	104.00
కాఫీ కొనుగోలు	21.50
అవసర వస్తువులు (క్యాష్ అండ్ క్రెడిట్)	16.70
రోజువారీ అవసరాల సరఫరా (క్యాష్‌అండ్ క్రెడిట్)	88.73
సూపర్ బజార్	6.30
పెట్రోల్ బంక్	312.11
ఎల్‌పిజి గ్యాస్	38.54
క్రెడిట్ మంజూరు అండ్ రికవరీ	3.78
రిటైల్ మార్కెటింగ్ అమ్మకాలు	28.50
మొత్తం	620.16

◆ 2024-25 కాఫీ సీజన్లో 752.558 మెట్రిక్ టన్నుల అరబికా/రోబస్టా కాఫీ రైతుల నుండి రూ.2480.23 లక్షలకు పైగా కొనుగోలు చేయడం. సర్టిఫైడ్ అరబికా పార్చ్‌మెంట్ కాఫీకి రూ.450, అరబికా చెర్రీ కాఫీకి రూ.330 చెల్లించడం.

◆ ప్రస్తుత కాఫీ సీజన్‌లో రూ.20 కోట్లకు ప్రభుత్వం మంజూరు, రూ.20 లక్షలు విడుదల. ఇప్పటివరకు 3194 గిరిజన కాఫీ రైతులకు రూ.24.80 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ చేయడం.

◆ టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్‌తో ఒప్పందం, 10 మెట్రిక్ టన్నుల సర్టిఫైడ్ అరబికా చెర్రీ కాఫీని రూ.900 కేజీకి సరఫరా చేయడం.

◆ ఆర్టికల్ 275(1) కింద, 2024-25లో రూ.1000 లక్షలతో కొయ్యూరు మండలం డౌనూరు/నర్సీపట్నం వద్ద ఇంటిగ్రేటెడ్ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు మంజూరు.

◆ కాఫీ రైతులకు రూ.27.90 లక్షలు, వ్యవసాయ రుణాలుగా రూ.39.90 లక్షలు 2024-25లో మంజూరు.

◆ చింతపల్లి (884.55 హెక్టార్లు), జీకేవీధి (1374 హెక్టార్లు) మండలాల్లో కాఫీసాగు కోసం ఆర్గానిక్ సర్టిఫికేషన్ మొత్తం 2600 గిరిజన రైతులకు లాభం.

◆ త్వరలో జి.మాడుగుల, అరకు, పాడేరు, పెద్దబయలు మండలాల్లో ప్రతి మండలంలో 2500 మంది రైతుల కోసం సర్టిఫికేషన్ విస్తరణ మొత్తం 10,000 మంది రైతులకు లబ్ధి.

◆ విలువజోడించిన ఉత్పత్తులు : ఫిల్టర్ కాఫీ, ఇన్‌స్టంట్ కాఫీ, తేనె, చింతపండు, సబ్బులు, శీకాయ, నన్నారి, బిల్వం, పసుపు, రాజ్మా, హిల్బ్రూ మొదలైనవి రూ.1929.28 లక్షల విలువైన అమ్మకాలు.

◆ రిటైల్ మార్కెంగ్ బలోపేతం ప్రధాన పట్టణాల్లో, విమానాశ్రయాలు, రైల్వేస్టేషన్లు, ఆర్‌టిసి బస్టాండ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, టూరిజం కేంద్రాలు, ఫ్రాంచైజీలు , ఈ-కామర్స్ ద్వారా అమ్మకాలు.

అరకు కాఫీ స్టాల్

ఉద్యమాల మార్గదర్శి, అక్షరాల రూపశిల్పి ఎంహెచ్

మోటూరు హనుమంతరావు.. ఎం.హెచ్ గా సుపరిచితులైన మోటూరు ఒక నిస్వార్థ ప్రజా నాయకుడు. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత. సమర్థుడైన సంపాదకుడుగా, శక్తివంతమైన రచయితగా, ఉర్రూతలూపే ఉపన్యాసకుడుగా బహుముఖ ప్రజ్ఞాశాలి. సమిష్టి తత్వాన్ని అమలు జరిపిన క్రమశిక్షణా శీలి. అవగాహనలో, అనుభవంలో ఆరితేరినా తరాల అంతరం లేకుండా అందరితో ఆప్యాయంగా అభిమానంగా మెలిగిన అనురాగమూర్తి. సహచరులనూ, కార్యకర్తలనూ సామాన్య ప్రజలనూ సదా ఆదరిస్తూ సార్థక జీవితం గడిపిన సంయమనశీలి. రాజకీయ వ్యక్తిగత హుందాతనానికి అర్థం చెప్పిన సంస్కారి. ఆటుపోట్లకు, అవరోధాలకు తల వంచని ధీశాలి. తెలుగు నాట ఎందరో రాజకీయ నేతలూ, పాత్రికేయ ప్రముఖులూ ప్రసిద్ధులూ వున్నా ఇన్ని ప్రత్యేకతల కలబోత గనకే ఎం.హెచ్ అందరి గౌరవం పొందగలిగారు. ప్రగతిశీల కళాసాహిత్య ఉద్యమాలపై ఆయనది ప్రత్యేక ముద్ర. గుంటూరు (ప్రస్తుతం బాపట్ల) జిల్లా వెల్లటూరులో 1917లో పుట్టిన మోటూరు బాల్యంలోనే స్వాతంత్ర్య పోరాటం సామ్యవాద ఆశయాల వైపు ఆకర్షితులై ఆఖరి శ్వాస వరకూ అచంచలంగా కొనసాగారు. ఎం.హెచ్. వ్యాసాలు రాయడం, అనువాదాలు చేయడం 1941-42 రహస్య కాలంలో ప్రారంభించారు. తొలి ప్రజాశక్తి 1948లో పాలక వర్గాల నిషేధానికి గురైన తర్వాత ఉద్యమావసరాల కోసం జనత అనే పత్రిక తీసుకువచ్చే ప్రయత్నం జరిగినప్పుడు దాని తొలి సంపాదకీయం రాశారు గానీ ఇంతలోనే అరెస్టయ్యారు. బొమ్మారెడ్డి, ప్రసిద్ధ రచయిత గంగినేని వెంకటేశ్వరరావు దాన్ని నిర్వహిం చారు. ఈ సంగతి కూడా చాలా దశాబ్దాలు గడిచాక అనుకోకుండా జనత తొలి పలుకు చదివి ఇది మీ శైలిలా వుందని అడిగితే ఆయ నకు ఇదంతా గుర్తుకు వచ్చింది. 1952 ఏప్రి ల్‌లో ప్రజాశక్తి స్థానంలో విశాలాంధ్ర ఏర్పడింది. అదే 1952లో మంత్రి కల్లూరి చంద్రమౌళిని ఓడించి రేపల్లె నుంచి తొలిసారి శాసనసభకు ఎన్నికైన ఎం.హెచ్ ఏడాదిలోనే విశాలాంధ్ర సంపాదకుడయ్యారు. సాహిత్య పత్రికా విషయాల్లో పేరెన్నిక గన్న అప్పటి సంపాదకుడు మద్దుకూరి చంద్రశేఖరరావు (చంద్రం) ఉమ్మడి పార్టీ రాష్ట్ర కార్యదర్శి కావడంతో ఎం.హెచ్ సంపాదక బాధ్యత స్వీకరించారు. తర్వాత దాదాపు అర్ధ శతాబ్ది పాటు ఆయన వివిధ రూపాల్లో ఉద్యమ పత్రికల నిర్వహణ, రూపకల్పన, రచనల్లో కీలక పాత్ర వహించారు. 2001లో కన్ను మూసిన ఎం.హెచ్ జీవిత విశేషాలను జూన్ 18న వర్ధంతి సందర్భంగా ప్రజాశక్తి గుర్తు చేసింది. ఈ అవార్డు ప్రదానం సందర్భంగా పత్రికా రంగానికి సంబంధించిన కోణాలు చెప్పుకుందాం.

కలమే కరవాలంగా....

1953-55 తన సంపాదకత్వం మూడు పువ్వులూ ఆరు కాయలుగా సాగిందని ఎం.హెచ్ అనేవారు. తన చెణు కులూ వ్యాఖ్యలూ విమర్శలూ పదునుగా నడిచేవి. తెలుగు నుడికారంలో సహజ సిద్ధమైన పట్టు గల ఎం.హెచ్ కలాన్ని చాలా వాడిగా వాడేవారు. దాదాపు అధికారంలోకి వచ్చేంత బలంతో కమ్యూనిస్టు పార్టీ కాంగ్రెస్‌ను హోరాహోరీ సవాలు చేస్తున్న నిత్య రాజకీయ పోరాటం. తీవ్ర సంఘర్షణ. అలాంటి దశలో ఎం.హెచ్ సంపాదకీయా లతో పాటు కంచు కాగడా శీర్షిక, పలుకులూ ములుకులూ వంటి శీర్షికలు నిర్వహిం చేవారు. నార్ల వెంకటేశ్వరరావు నాటి ఆంధ్రప్రభతో సహా కమ్యూనిస్టులపై చేసే దాడిని ఎదుర్కోవలసిన దశ. ఇప్పటి వివాదాల కంటే సూటిగా కమ్యూనిస్టులను ఓడించమంటూ పిలుపునిచ్చేవారు. ఇతర కారణాలకు తోడు ఈ దుష్ప్రచారాలూ పని చేసి 1955 ఎన్నికలలో కమ్యూనిస్టులు అధికారంలోకి రాకపోయినా 35 శాతం ఓట్లు తెచ్చుకోగలి గారు. కొందరిలో ఆ నిరుత్సాహం, సైద్ధాంతిక విభేదాల మధ్య ఎం.హెచ్ సంపాదక బాధ్యతల నుంచి తప్పుకోవడం, ఉద్యమం కోసం మళ్లీ బాధ్యతలు తీసుకోవడం చేస్తూ వచ్చారు. ఏమైనా ఆయన రచనల పదును ఇంకా నిశితమవుతూ వచ్చింది. ఆ సమయంలోనే విశాలాంధ్ర నిర్వహణలో డివి సుబ్బారావు, గోళ్ల రాధాకృష్ణమూర్తి, ఎల్. జోగారావు వంటి వారు ముఖ్య పాత్ర వహించారు. భారత్ చైనా సరిహద్దు వివాదం, కమ్యూనిస్టు ఉద్యమ అంతర్గత పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం ఎం.హెచ్ తో సహా నాయకులను నిర్బంధించింది. ఈ ఒడుదు డుకుల మధ్య డివి సుబ్బారావు కీలక కృషి తో ఎబికె ప్రసాద్ సంపాదకుడుగా జనశక్తి వారపత్రిక ప్రారంభమైంది. కొద్ది కాలంలోనే డివిఎస్, ఎబికె కూడా అరెస్టవడంతో బయట వున్న నండూరి ప్రసాదరావు, బొమ్మారెడ్డి తదితరుల సాయంతో దాన్ని నిర్వహించారు. తీవ్ర క్యాన్సర్‌కు గురైన డివిఎస్‌ను ఎంతో ఒత్తిడి తర్వాత విడుదల చేసినా...1966లో డిటెన్యూగానే కన్నుమూసిన త్యాగజీవి డివిఎస్‌ను ఎం.హెచ్ ఎప్పుడూ గుర్తు చేసేవారు.

మళ్లీ ప్రజాశక్తికి స్వాగతం!

1967 ఎన్నికల నాటికి జనశక్తిని దినపత్రికగా నడపాలని ఎం.హెచ్, జోగారా వు రాజ్‌కోట వెళ్లి ముద్రణ యంత్రాన్ని కొనుక్కొచ్చారు. ఈ లోగా ఉద్యమంలో మరోసారి వచ్చిన విభేదాలతో జనశక్తి యాజమాన్యం మారడంతో సిపిఎం ఆధ్వర్యంలో 1968 జనవరి 27 ప్రజాశక్తి వారపత్రికగా పున:ప్రారంభమైంది. 1966 నుంచి 1982 వరకూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన ఎం.హెచ్ ఈ సమయంలోనూ కీలకమైన రచనలు చేశారు. బొమ్మారెడ్డి సంపాదకుడుగా వెలువడిన ప్రజాశక్తి వారపత్రికలో తొలుత పాటూరు రామయ్య వుండగా కొంత కాలం వాసిరెడ్డి సత్యనారాయణ పనిచేశారు. తుమ్మల వెంకట సుబ్బయ్య మేనేజరుగా వుండేవారు. 1975లో ఎమర్జన్సీ సమయంలో ఆయన రవి, అంజి వంటి తన పాత కలం పేర్లతో చేసిన రచనలు ఎంతో ప్రభావ శీలంగా వుండేవి. వాటిలో రాజు వెడలె... అంటూ సంజయ్ గాంధీపై చేసిన వ్యంగ్య రచన వంటివి నాటి పాఠకులు మర్చిపోలేరు. 1977 తర్వాత నేనూ వారపత్రికలో చేరాను. అప్పటికి ఎం.హెచ్, బొమ్మారెడ్డి అరవైలలో వుంటే నేను అప్పుడే ఇరవై దాటుతున్న స్థితి. అయినా ఎంతగానో ఆదరించి ప్రోత్సహించారు. కాలమంతటా ఎడాపెడా సైద్ధాంతిక పెడ ధోరణులపై ఆయన గొప్ప పోరాటం చేశారు. 1981 ఆగస్టు 1న ప్రజాశక్తి దినపత్రికగా మారింది. "వారపత్రికగా సెలవు, దినపత్రికగా మీ సేవకు సిద్ధం. సెలవివ్వవలసిన వారు మీరు, స్వాగతం పలకాల్సిన వారూ మీరే" అని ఎం.హెచ్ రాశారు. ఇందులోనే తన శైలీ విన్యాసం మనం చూడొచ్చు. ఈ కాలంలో శాసనమండలికీ రాజ్యసభకూ కూడా ఎన్నికై సవ్యసాచిగా బాధ్యతలు నిర్వహించారు. "అవి వారపత్రికలయినా, దినపత్రికలయినా, నా పేరిటే అవి నడిచినా నడవకపోయినా నేను జైలులో వున్నా రహస్యంగా వున్నా శాసనసభ్యుడుగా వున్నా పార్టీ కార్యదర్శిగా వున్నా విశాలాంధ్రకూ జనశక్తికీ, ప్రజాశక్తికీ నా రచనలూ సంపాదకీయాలూ అందుబాటులో వుంటూ వచ్చాయి" అని తన జ్ఞాపకాల్లో రాశారు.

ఆయన చూపిన బాటలో..

ప్రజాశక్తి దినపత్రికగా పున:ప్రారంభమైనప్పుడు నడపడం కష్టమని చాలా మంది వ్యాఖ్యానించారుగానీ ఎం.హెచ్ అనుభవం, నాయకత్వ సహకారం దాన్ని విజయవంతంగా విస్తరిం చేందుకు బాట వేశాయి. రాజకీయంగానూ లౌకిక ప్రజాస్వా మ్య పరిరక్షణలో అది ముందు నిలిచింది. మారిన పరిస్థితుల్లో అనేక నూతన ప్రయో గాలు, చొరవల వల్లనే ఇది సాధ్యమైంది. ఉద్యమ పితామహుడైన సుందరయ్య గారు, లావు బాలగంగాధర రావు, కొరటాల సత్యనారాయణ, రాఘవు లు వంటి నాటి కార్యదర్శులు ఈ కృషికి తోడు నిలిచారు. యాజమాన్యంలో మళ్లీ, గోళ్ల రాధాకృష్ణ మూర్తి, తర్వాత వి.కృష్ణయ్య ఆ యా దశల్లో జనరల్ మేనేజర్లుగా ముఖ్య పాత్ర వహించారు. ఇలా ఎందరో సీనియర్లు, యువత, కొత్త వారు పాలుపం చుకున్నారు. గనకే ప్రజాశక్తి నిలదొక్కుకో గలిగింది. ఎన్నో పత్రికలు మూతపడ్డాయి గాని ప్రజాశక్తి నిర్విఘ్నంగా కొనసాగిందంటే ఇదే పునాది. 1990లలో ప్రజాశక్తి పురోగమనం వేగం పుంజుకుంది. ఉద్యమ కుటుంబం నుంచి వచ్చాను గనక చిన్నప్పటి నుంచి ఒక స్ఫూర్తిగా భావిస్తున్న ఎం.హెచ్ వంటి దిగ్గజంతో రెండు దశాబ్దాలు సన్నిహితంగా మెలగడం, కొన్నేళ్లు సహ సంపాదకుడుగా వుండటం నాకు లభించిన గొప్ప అవకాశం. ఆఫీసుకు రాగానే ఆయన గదికి వెళ్లగానే కాఫీ తాగి రాజకీయాలు, సాహిత్యం, చరిత్ర విషయాలు, అనుభవాలు తెలుసుకోవడం మరచిపోలేని అనుభవం. క్లిష్ట పరిస్థితులను, సమస్యలను సమన్వయం చేయగల వాస్తవికత ఆయన స్వంతం. తర్వాత కాలంలో నేను బుక్‌హౌస్ బాధ్యతలకు వెళ్లగా వి.శ్రీనివాసరావు మొదట ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా, 2001 తర్వాత పూర్తి స్థాయి సంపాదకుడుగా ప్రజాశక్తి బాధ్యతలు చేపట్టారు. శ్రీనివాసరావు ఢిల్లీ వెళ్లాక ఎస్.వినయ కుమార్ సంపాదకుడుగా పనిచేశారు. 2013లో మళ్లీ నేను పత్రిక సంపాదక బాధ్యతల్లో వుండగా రాష్ట్ర విభజనతో పాటూరు రామయ్య ఎడిటర్‌గా ఎస్.వెంకట్రావు ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా ప్రజాశక్తి విజయవాడకు మారింది. 2018 నుంచి ఎం.వి.ఎస్.శర్మ, ప్రస్తుతం తులసీదాస్ సంపాదకులుగా ఎం.హెచ్ ఒరవడిని కొనసాగిస్తూ వస్తున్నారు. మా అందరికీ ప్రేరణ ఎం.హెచ్ అన్నది నిజం. ఆయన కుటుంబం మొత్తం అదే బాటలో కొనసాగించడం మరింత విశేషం.

రాజకీయంగా రాజీ పడని సైద్ధాంతిక స్పష్టత పాటిస్తూనే భిన్నాభిప్రాయాలను గౌరవించడం, ప్రజాస్వామిక ప్రమా ణాలను అనుసరించడం ఇందుకు కారణమైంది. మీడియా విస్తరణ తర్వాత నిట్టనిలువునా చీలిపోయి అసత్యాలు అసభ్యతలు తాండవిస్తున్న నేటి తరుణంలో ఎం.హెచ్ పెట్టిన వరవడి ప్రజాశక్తిని విభిన్నంగా నిలబెట్టగలిగింది. అంతర్జా తీయంగా సోషలిస్టు శక్తులకు ఎదురుదెబ్బ తగిలినప్పుడు, జాతీయంగా మతతత్వ రాజకీయాల ముప్పు ఎదుర్కొనవలసి వచ్చినప్పుడు ఇదే దీక్షా పటిమ ప్రత్యామ్నా యం చూపగలిగింది. రాజకీయంగా విభేదించేవారు కూడా ప్రజాశక్తి విశ్వసనీయతను ప్రశంసిస్తారు. పాలక వర్గాల పాచికలనూ ప్రపంచీకరణ తాకిడిని, మత మార్కెట్ తత్వాల సవాళ్లనూ ఎదుర్కొంటూ ప్రతి అక్షరం ప్రజల పక్షంగా ముందుకు సాగుదాం.

- తె.ర

తెలుగు పత్రికలకు వారధి ఆంధ్ర పత్రిక

తెలుగులో పూర్తిస్థాయి దిన పత్రికగా ఆంధ్ర పత్రికను స్థాపించి, నిర్వహించిన కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు చిరకాలం స్మరించుకోదగిన మహ నీయుడు. అంతకు ముందు అనేక మంది కొద్దికాలం పాటు చిన్నా పెద్దా పత్రికలను నెలకొల్పి నడిపించారు. కానీ అవి పత్రికా వ్యవస్థలో రాణించలేక పోయాయి. నాగేశ్వరరావు 1908 ఆగష్టు 8న ఆంధ్రపత్రికను తెలుగు వార పత్రికగా ప్రారంభించారు. ఆయన స్వదేశీ పరిశ్రమలను స్థాపించాలన్న వాంఛతో కోల్‌కతా, ముంబై వంటి నగరాలను సందర్శించి, ముంబయిలో అమృతాంజనం పరిశ్రమ ను నెలకొల్పారు. తెలుగు వారిలో స్వాతంత్ర్య కాంక్షను పెంపొందిం చాలనే లక్ష్యంలో ఆంధ్రపత్రికను స్థాపించారు. ఆంధ్రపత్రికను 1914 ఏప్రిల్ 1న మద్రాసుకు తరలించి, దానిని దినపత్రికగా వెలువరించారు. రాజద్రోహం నేరం కింద మూడేళ్ల కఠినకారాగార శిక్షను అనుభవించిన గాడిచర్ల హరిసర్వోత్తమరావు తో మాట్లాడేందుకు కొందరు భయపడే ఆ రోజుల్లో ఆయనను 'ఆంధ్ర పత్రిక' దినపత్రికకు మొదటి సంపాదకునిగా నియమించారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ యజమాని రామ్‌నాథ్ గోయంకా మద్రాసులో 1938లో తెలుగు దినపత్రికగా ఆంధ్రప్రభను స్థాపించే వరకూ తెలుగువారికి ఆంధ్రపత్రిక ఏకైక దినపత్రికగా వెలుగొందింది. ఆంధ్ర పత్రిక ద్వారా తెలుగు ప్రజలను రాజకీయంగానూ, సాంఘికపరంగానూ చైతన్య పరిచారు. అంతేకాదు 'భారతి' అనే చైతన్య పత్రికను కూడా నెలకొల్పి సాహిత్య, సాంస్కృతిక కళారంగాలను ప్రోత్సాహించారు. తన పత్రిక ద్వారా అనేక మంది పాత్రికేయులను, రచయితలను పెంపొందించడానికి సహాయపడ్డారు. దినపత్రికను నిర్వహించడం ఆ రోజుల్లో ఎంతగానో నష్ట దాయకమైనప్పటికీ నాగేశ్వరరావు వెనుకాడకుండా ఆంధ్ర పత్రికను కొనసాగించారు.

తెలుగు ప్రజలకు దిన పత్రికను తొలిసారిగా అందించి మహత్తర సేవలందించిన కాశీనాధుని నాగేశ్వరరావు అత్యంత పూజనీయుడని, ఆయన ఫొటోను ప్రజాశక్తి కార్యాలయంలో ఉంచడం సముచితమని సుందరయ్యగారు సలహా ఇచ్చారంటే ఆయన కృషి పట్ల ఎంతగా గౌరవాభిమానాలు ఉన్నాయో గ్రహించవచ్చు. నాగేశ్వరరావు కృష్ణా, ఉభయ గోదావరులు సంయుక్త నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా శాసనసభకు పెద్ద మెజారిటీతో ఎన్నికయ్యారు. విజయవాడలోని ఆయనకు చెందిన దుర్గాభవనం కాంగ్రెస్ కార్యకలాపాలకు నిలయంగా మారింది.

జన, కుల గణనలో కీలకాంశాలు

న్యాయం కోసం జరిపే పోరాటంలో కుల సమాచారం ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడుతుంది. అసమానతల నిజ స్వభావాన్ని బహిర్గతం చేయడానికి, ప్రస్తుత విధానాల వైఫల్యాన్ని బయటపెట్టడానికి, కుల ఆధారిత రాజకీయాలను ఎండగట్టడానికి ఇది సాయపడుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే కులాల వారీగా జనాభా లెక్కలు సేకరిస్తే కులాలకు అతీతంగా నిర్మాణాత్మక మార్పుల కోసం పోరాడే విస్తృత ఉద్యమం ఊపిరి పోసుకుంటుంది. నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణ, గృహ నిర్మాణం, భూసంస్కరణలు, ఉపాధి హామీలు, ప్రభుత్వ సేవల కల్పనలో సార్వత్రిక ప్రవేశం లభిస్తుంది.

> "కుల సమాచారం ఉపయుక్తమైనదే అయినప్పటికీ అది అన్నింటికీ మందు కాదు. కుల సమాచారం అందుబాటులో ఉన్నచోట కూడా ఎస్సీ, ఎస్టీలలో అసమానతలు వేళ్లూనుకుపోయి ఉన్నాయి. కేవలం కులగణన ద్వారా న్యాయం చేకూరదు. కుల వ్యవస్థ నిర్మూలన కోసం పోరాడడంలో మన నిబద్ధతను అనవసరమైన భ్రమలు బలహీనపరుస్తాయి. ముఖ్యంగా మోడీ ప్రభుత్వ హయాంలో నయా ఉదారవాద విధానాలు సంక్షేమ కార్యక్రమాలను బలహీనపరిచాయి. ప్రైవేటీకరణను ప్రోత్సహించాయి. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించాయి. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఉద్దేశించిన పథకాలను నీరుకార్చాయి. ఈ వ్యవస్థీకృత సమస్యలను సవాలు చేయని పక్షంలో కులగణన మాత్రమే పేదలు, అణగారిన వర్గాల జీవితాలను మార్చదు."

సుదీర్ఘ జాప్యం, అనిశ్చితి అనంతరం ఎట్టకేలకు 2027లో జాతీయ జనాభా లెక్కల సేకరణ కోసం భారత రిజిస్ట్రార్ జనరల్ నోటిఫికేషన్ జారీ చేశారు. రాబోయే ఈ జనగణనలో ప్రధాన మార్పు ఏమిటంటే కులగణనను చేర్చాలని నిర్ణయించడం. కులగణనను అధికార బిజెపి, దాని సైద్ధాంతిక మాతృసంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్) చాలా కాలంగా వ్యతిరేకిస్తున్నాయి. సామాజిక న్యాయం కోసమే ఈ చర్య తీసుకోవడం జరిగిందని ఇప్పుడు బిజెపి ప్రతినిధి చెబుతున్నప్పటికీ ఈ నిర్ణయం వెనుక సూత్రబద్ధమైన నిబద్ధత కంటే రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని అర్థమవుతోంది.

కోవిడ్-19 మహమ్మారి కారణంగా జనాభా లెక్కల సేకరణ ఆలస్యమైనప్పటికీ ఆ తర్వాత దానిని చేపట్టడంలో బిజెపి పెద్దగా ఆసక్తి చూపలేదు. బహుశా నియోజకవర్గాల పునర్విభజనను త్వరగా జరపాలని భావించి ఉండవచ్చు. రాజ్యాంగం ప్రకారం 2026 తర్వాత చేపట్టే తొలి జనగణన ఆధారంగా పునర్విభజన ప్రక్రియను నిర్వహించాల్సి ఉంటుంది. 2026కు ముందు జనాభా లెక్కల సేకరణ జరిపితే పునర్విభజనను చేపట్టడం సాధ్యపడదు. ఇప్పుడు 2027లో జనగణన జరపాలని నిర్ణయించినందున వెంటనే పునర్విభజన కసరత్తుకు శ్రీకారం చుట్టబోతున్నారు.

కులగణన చేపట్టాలన్న డిమాండ్లను బిజెపి నిరంతరం వ్యతిరేకిస్తూనే ఉంది. కులాల వారీగా లెక్కల సేకరణను వ్యతిరేకించాలని తాము విధానపరమైన నిర్ణయం తీసుకున్నట్లు 2021లో లోక్‌సభకు కేంద్రం తెలియజేసింది. సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో కూడా ఇదే వైఖరిని పునరుద్ఘాటించింది. ప్రధానమంత్రి స్వయంగా లోక్‌సభ ఎన్నికలకు ముందు 2023లో చేసిన ప్రసంగంలో కుల విభజనను తక్కువ చేసి మాట్లాడారు. భారతదేశంలో కేవలం నాలుగు కులాలు...మహిళలు, యువత, రైతులు, పేదలు...మాత్రమే ఉన్నాయని ఆయన ప్రకటించారు.

కులగణన విషయంలో బిజెపి దీర్ఘకాలిక వ్యతిరేకత దాని భావజాలంలోనే ఉంది. కులగణనను సంఘ్‌పరివార్ ఎప్పుడూ అనుమానంగానే చూస్తోంది. అది హిందూ సమాజంలోని తీవ్ర అసమానతలను బయటపెడుతుందని, తాము హిందూత్వ ద్వారా కోరుకున్న ఐక్యతను దెబ్బతీస్తుందని భయపడింది. అయితే వాస్తవానికి కుల గణాంకాలు అట్టడుగు వర్గాల స్వరాన్ని పెంచుతాయని, వనరులను మరింత సమానంగా పంపిణీ చేయాలని ఆ వర్గాలు డిమాండ్ చేస్తాయని, బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ మత సమీకరణ వ్యూహాన్ని సవాలు చేస్తాయని సంఘ్‌పరివార్ ఆందోళన చెందుతోంది.

రాజకీయ యూటర్న్

అయినప్పటికీ బిజెపి తన వైఖరిని మార్చుకుంది. 2024 ఎన్నికలలో ఎదురైన పరాజయాలు, ఓబీసీ ఓటర్లలో పడిపోతున్న మద్దతును దృష్టిలో పెట్టుకొని 2027 జనగణనలో కులాల వారీ సమాచారాన్ని సేకరిస్తామని ప్రకటించింది. ఇది రాజకీయ ప్రేరేపిత మార్పుగా కన్పిస్తోంది. కులగణనను ప్రతిపక్ష పార్టీలు రాజకీయం చేస్తున్నాయని విమర్శిస్తున్న బిజెపి, వారి ప్రభావాన్ని తటస్థం చేసేందుకు వాటి డిమాండ్‌నే అందిపుచ్చుకుంది. ఆర్‌ఎస్‌ఎస్ సైతం సానుకూల వైఖరి ప్రదర్శించింది. ఎన్నికల ప్రయోజనాల కోసం ఉపయోగించనంత వరకూ కులాల సమాచారాన్ని సంక్షేమ ప్రయోజనాల కోసం వాడుకోవచ్చునని ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన ప్రముఖ ప్రతినిధి ఒకరు తెలిపారు.

చాలా కాలంగా కుల ఆధారిత సమాచారం అందుబాటులో లేకపోవడానికి కాంగ్రెస్ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఆ పార్టీ కులగణనను నిర్వహించలేదు లేదా మండల్ కమిషన్ సిఫార్సులను వెంటనే అమలు చేయలేదు. 2011లో సామాజిక-ఆర్థిక కులగణన (ఎస్.ఇ.సి.సి)ను చేపట్టింది కానీ దానిని ఉద్దేశపూర్వకంగానే సార్వత్రిక గణన నుండి వేరుచేసింది. ఆ తర్వాత కచ్చితత్వం లోపించిందంటూ కులగణనను పక్కన పెట్టింది. 2014లో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఎస్.ఇ.సి.సి డేటాను పూర్తిగా పక్కన పెట్టింది. దీంతో ఈ ప్రక్రియ కోసం ఖర్చు చేసిన రూ.5,000 కోట్ల ప్రజాధనం వృథా అయింది.

భారతదేశంలో కులగణనకు సుదీర్ఘమైన, విభిన్నమైన చరిత్ర ఉంది. 1881 నుండి 1941 వరకూ జనాభా లెక్కల సేకరణలో కులాల సమాచారాన్ని కూడా తీసుకునే వారు. స్వాతంత్ర్యానంతరం దీనికి స్వస్తి చెప్పారు. ఇకపై జనాభా లెక్కల సేకరణలో కుల ప్రస్తావన ఉండబోదని 1950లో వల్లభ్‌భాయ్ పటేల్ ప్రకటించారు. కుల సమాచార సేకరణను తిరిగి ప్రారంభించాలని 1953లో కాకా కాలేల్కర్ నేతృత్వంలోని వెనుకబడిన తరగతుల మొదటి కమిషన్, ఆ తర్వాత 1980లో మండల్ కమిషన్ ప్రభుత్వాన్ని కోరాయి. కచ్చితమైన సంఖ్య లేనిపక్షంలో రిజర్వేషన్లు, సంక్షేమ విధానాలు లోపభూయిష్టంగా ఉంటాయిని వాదించాయి. అయినప్పటికీ ఆ తర్వాత కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఈ సిఫార్సులను పట్టించుకోలేదు. రాబోయే జనగణనలో కులాల సమాచారాన్ని సేకరించాలని 2021లో వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్ మరోసారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

జాతీయ స్థాయిలో కులాల సమాచారం లేకపోవడంతో అనేక రాష్ట్రాలు సొంతగా కుల సర్వేలు ప్రారంభించాయి. స్వతంత్ర భారత చరిత్రలో తొలిసారి 1968లో కేరళలో ఇ.ఎం.ఎస్ నంబూద్రిపాద్ నేతృత్వంలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం సమగ్ర, శాస్త్రీయ పద్ధతిలో కుల వివరాల సేకరణ కోసం కులాలు, వర్గాలపై సామాజిక-ఆర్థిక సర్వే చేపట్టింది. రాష్ట్ర జనాభాలో ఓబీసీలు, అత్యంత వెనుకబడిన తరగతుల వారు 63 శాతానికి పైగా ఉన్నారని 2023లో బీహార్‌లో నిర్వహించిన కుల సర్వే తేల్చింది. దీంతో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లను ఆ రాష్ట్ర ప్రభుత్వం 50 నుండి 65 శాతానికి పెంచింది. అయితే కోర్టు వివాదం కారణంగా దాని అమలు ఆగిపోయింది. అదే విధంగా తెలంగాణ ప్రభుత్వం 2024లో కుల సర్వే నిర్వహించి విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థలలో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ బిల్లును ఆమోదించింది. రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూలులో చేర్చడం కోసం దానిని పంపింది. కర్ణాటక సైతం తన సామాజిక-ఆర్థిక, విద్యా సర్వే ద్వారా చర్యలు చేపట్టింది. అయితే రాజకీయ అనిశ్చితులు, డేటా చెల్లుబాటుపై ఆందోళనల నేపథ్యంలో ఆ నివేదికను ఇంకా ప్రచురించలేదు.

రాష్ట్రాలవారీగా జరిగిన కుల సర్వేలు, వివిధ వర్గాల నుంచి పెరుగుతున్న డిమాండ్లు, వాటి తక్షణ రాజకీయ ప్రయోజనాల రీత్యా కులాల వారీగా లెక్కలు సేకరించడానికి బిజెపి అంగీకరించాల్సి వచ్చింది.

2027 జనగణన రెండు దశలుగా జరుగుతుంది. 2026 అక్టోబరులో ప్రారంభమయ్యే తొలి దశలో మంచు కురిసే ప్రాంతాలలో జనగణన చేపడతారు. 2027 మార్చి 1న రెండో దశ ప్రారంభమవుతుంది. దీనిలో దేశంలోని మిగిలిన ప్రాంతాలలో జనాభా లెక్కలను సేకరిస్తారు. జనగణనలో రెండు భాగాలు ఉంటాయి. మొదటిది గృహాలను లెక్కించడం, గృహాల గణన. ఆ తర్వాత జనాభా లెక్కలు సేకరిస్తారు. మొదటిసారిగా జనగణనను పూర్తిగా డిజిటలీకరణ చేస్తున్నారు. మొబైల్ యాప్స్, స్వీయ గణన, రియల్-టైమ్ పర్యవేక్షణను అందులో చేరుస్తారు. జనాభా లెక్కల సేకరణ దశలో కుల సమాచారాన్ని తీసుకుంటారు. గణన పూర్తయిన పది రోజులలో ప్రాథమిక సమాచారాన్ని విడుదల చేస్తారు. అనంతరం ఆరు నెలలలో సవివరమైన విభజన డేటా విడుదలవుతుంది. ఈ కాలక్రమాన్ని పాటించినట్లయితే మొత్తం పునర్విభజన ప్రక్రియను 2029 ఎన్నికల లోగానే పూర్తి చేయవచ్చు. అయితే తన తక్షణ రాజకీయ ప్రయోజనాల కోసం ఈ మొత్తం ప్రక్రియను బిజెపి మార్చే అవకాశం కూడా ఉంది.

రాజకీయ చిక్కుముడులు, సవాళ్లు

జనగణనలో కులాన్ని చేర్చడం వల్ల వివిధ కులాల సంఖ్య, వాటి సామాజిక ఆర్థిక స్థితిగతులకు సంబంధించి విశ్వసనీయమైన సమాచారం లభిస్తుంది. రిజర్వేషన్ల పెంపు, ఓబీసీల ఉప-వర్గీకరణ, రిజర్వేషన్లపై ప్రస్తుతం అమలులో ఉన్న 50 శాతం పరిమితి తొలగింపు డిమాండ్లను బలపరచడానికి ఇది దోహదపడవచ్చు. ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన (ఇ.డబ్ల్యు.ఎస్) వారికి పది శాతం కోటా వెనుక ఉన్న హేతుబద్ధతను ధృవీకరించడానికి లేదా తిరస్కరించడానికి కూడా ఈడేటా ఉపకరిస్తుంది. ఓబీసీల క్రీమీలేయర్ ప్రమాణాలను పరిశీలించవచ్చు. ఈ డేటా కొత్త సమాచారాన్ని వెల్లడిస్తే ఎస్సీలకు కూడా విస్తరింపజేయాలన్న డిమాండ్ ఊపందుకోవచ్చు. అన్నింటికంటే ముఖ్యంగా ప్రైవేటు రంగానికి దీనిని విస్తరించాలనే అభిప్రాయం ..14లో

హరిత విప్లవ ఆద్యుడు స్వామినాథన్

ఆధునిక భారతదేశ చరిత్రలో అనేక మంది ప్రముఖులు దేశ రాజకీయార్థిక స్వావలంబన కోసం కృషి చేశారు. దేశ ఆహార భద్రతకు కీలకమైన, వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేసిన వారిలో ప్రొఫెసర్ స్వామినాథన్ ఒకరు. స్వామినాథన్‌ను "హరిత విప్లవ" పితామహుడిగా పేర్కొనటం చూస్తున్నాం. కాని ఆయన తరచుగా దేశ వ్యవసాయానికి పితామహుడు రైతని, ఆహార భద్రతకు కుటుంబ వ్యవసాయం కీలకమని అంటుండేవారు. జాతీయ రైతు కమిషన్ చైర్మన్‌గా స్వామినాథన్ ప్రభుత్వాల ముందుంచిన నివేదికలు చాలా విలువైనవి. దేశ రైతు–వ్యవసాయ ఉద్యమాలలో ముఖ్య పాత్ర పోషించిన కిసాన్ సంయుక్త మోర్చా...ప్రభుత్వ మెడలు వంచటానికి ఆయుధంగా పని చేసిన సిఫార్సులనిచ్చారు. స్వామినాథన్ తన 98 ఏళ్ల జీవితంలో అనేక వైవిధ్యమైన విజయాలను అందుకున్నారు. అదే సమయంలో అసంబద్ధ విమర్శలనూ ఎదుర్కొన్నారు. ఆయన 2005–2006 సంవత్సరాల్లో ప్రభుత్వం ముందుంచిన సమగ్ర జాతీయ రైతు కమిషన్ నివేదికలు పాలకుల పక్షపాత వైఖరిని బహిర్గతం చేశాయి.

బి.పి.పాల్, వెంకటాచలం, రామయ్య వంటి ప్రముఖ శాస్త్రవేత్తల వారసుడిగా స్వామినాథన్ దేశ ముఖ్య ఆహార పంటలైన గోధుమ, వరి వంటి వ్యవసాయాల్ని మలుపు తిప్పారనేది అందరూ అంగీకరించే విషయం!

స్వామినాథన్ తన కుటుంబ నేపథ్యమైన వైద్య వృత్తిని చేపట్టకుండా, దానికి భిన్నంగా దేశ అవసరాలకు కీలకమైన వ్యవసాయ రంగాన్ని ఎన్నుకోవటమే ప్రత్యేకమైన విషయం. అలానే సమాజంలో గుర్తింపు తెచ్చి, అధికారాన్ని అధికంగా అందించగల ఐ.పి.ఎస్ ఎన్నికను

దేశ ఆహార భద్రతకు కీలకమైన గోధుమ పంట సాగును మలుపు తిప్పేందుకు (ప్రముఖ మెక్సికన్ శాస్త్రవేత్త నార్మన్ బోర్లాగ్ సహాయంతో) కృషి చేసి ఎందరో శాస్త్రవేత్తల్ని, విద్యావేత్తల్ని తయారుచేశారు. సమాంతరంగా ఆసియా దేశాల మూల వరి వంగడాల ప్రభావాలతో మార్చబడిన వారి వ్యవసాయాన్ని మలుపు తిప్పారు. ఆ నేపథ్యానికి, సాధనకు లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరా గాంధి, సుబ్రమణ్యం వంటి వారు తగిన నిధులనిచ్చే ప్రణాళికల్ని రూపొందించారు. ఫలితంగా 1980-85 నాటికి దేశంలో తిండిగింజల ఉత్పత్తి ఐదు రెట్లు పెరిగింది. సమాంతరంగా వివిధ ఆహార పంటలు, వ్యవసాయ ఉప వృత్తుల ఉన్నతికి తగిన మానవ వనరును రూపొందించగలిగిన సంస్థలెన్నో ఏర్పడ్డాయి. విలియం గాడ్, నార్మన్ బోర్లాగ్ వంటి ప్రముఖులు ఆయనను "భారత హరిత విప్లవ" ప్రేరకుడన్నారు.

త్యజించి, వ్యవసాయ–జన్యు శాస్త్రవేత్తగా నైపుణ్యత పొందటమే విశేషం. ప్రఖ్యాత విదేశీ సంస్థల్లో, గుర్తింపు పొందిన శాస్త్రవేత్తల నేతృత్వంలో ఐరోపాలో పని చేసి, ధనిక దేశాల సౌకర్యాల కోసం ఎగబడకుండా, భారతదేశం రావటమే స్వామినాథన్ ప్రత్యేకత. ప్రముఖ వరి పరిశోధనా కేంద్రం, కటక్ (ఒడిస్సా) పరిశోధకుడిగా మొదలెట్టి పరిశోధన, విద్య రంగాల్లో ప్రసిద్ధ అఖిల భారత సంస్థలో ఉన్నత స్థాయికి ఎదగటం (డైరెక్టర్ ఐ.ఎ.ఆర్.ఐ) ఆయన మేధస్సు, స్వయంకృషికి నిదర్శనం. ఆ క్రమంలోనే ఆయన దేశ ఉన్నత వ్యవసాయ పరిశోధనా మండలి నిర్దేశకుడిగా ఎదగటం విలువైన విషయం. కేంద్ర ప్రభుత్వ ముఖ్య వ్యవసాయ సలహాదారుగా ప్రముఖ పాత్ర వహించారాయన. దేశ ఆహార భద్రతకు కీలకమైన గోధుమ పంట సాగును మలుపు తిప్పేందుకు (ప్రముఖ మెక్సికన్ శాస్త్రవేత్త నార్మన్ బోర్లాగ్ సహాయంతో) కృషి చేసి ఎందరో శాస్త్రవేత్తల్ని, విద్యావేత్తల్ని తయారుచేశారు. సమాంతరంగా ఆసియా దేశాల మూల వరి వంగడాల ప్రభావాలతో మార్చబడిన వారి వ్యవసాయాన్ని మలుపు తిప్పారు. ఆ నేపథ్యానికి, సాధనకు లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరా గాంధి, సుబ్రమణ్యం వంటి వారు తగిన నిధులనిచ్చే ప్రణాళికల్ని రూపొందించారు. ఫలితంగా 1980–85 నాటికి దేశంలో తిండిగింజల ఉత్పత్తి ఐదు రెట్లు పెరిగింది. సమాంతరంగా వివిధ ఆహార పంటలు, వ్యవసాయ ఉప వృత్తుల ఉన్నతికి తగిన మానవ వనరును రూపొందించగలిగిన సంస్థలెన్నో ఏర్పడ్డాయి. విలియం గాడ్, నార్మన్ బోర్లాగ్ వంటి ప్రముఖులు ఆయనను "భారత హరిత విప్లవ" ప్రేరకుడన్నారు.

ప్రతిభగల స్వామినాథన్‌ను ప్రపంచ స్థాయి వ్యవసాయ పరిశోధనా సంస్థ (సి.జి.ఐ.ఎ.ఆర్) తన ముఖ్య పరిశోధనా సలహాదారుగా గుర్తించింది. మనీలా (ఫిలిప్పైన్స్) అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ నిర్దేశకుడిగా నియమించుకున్నారు. ఆ క్రమంలో ఆయన తనదైన ముద్రతో అనేక ఆసియా, ఆఫ్రికా దేశాల వ్యవసాయ పరిశోధనా రంగ ప్రగతికి తోడ్పడ్డారు. చైనా, వియత్నాం, ఆఫ్ఘనిస్థాన్, మయన్మార్ వంటి దేశాల పరిశోధనా రంగ ప్రగతికి తోడ్పాటునిచ్చారు. చైనా నెలకొల్పిన వ్యవసాయ వ్యవస్థ ప్రత్యేకతను గుర్తించారు.

స్వామినాథన్‌ను అనేక విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. అలానే, అనేక సంస్థలు, వ్యక్తులు పురస్కాలిచ్చారు. ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి ద్వారా ఆయన మొదటి 'ప్రపంచ ఆహార పురస్కారం' (వరల్డ్ ఫుడ్ ప్రైజ్) పొందటం విశేషం. అంతేగాక ఆయనకు 'పద్మ' అవార్డులన్నీ లభించాయి. మరణానంతరం "భారత రత్న" కూడా ఇచ్చారు.

స్వామినాథన్ రాజ్యసభ సభ్యుడిగా "మహిళా రైతుల" హక్కుల గురించి, పటిష్ట వ్యవసాయ రంగ అభివృద్ధి గురించి, సమగ్ర భూ, రైతు రక్షణ అంశాలతో ముడిపడిన సంస్కరణల విషయాల్ని ప్రస్తావించారు. మహిళా రైతులకు భూ వనరు, ప్రభుత్వ పథకాల విస్తరణకు తగిన చట్టాల్ని ప్రవేశ పెట్టిన ఘనత స్వామినాథన్‌ది. వ్యవసాయ సాంకేతికాల విస్తరణ, ఉత్పత్తి పరంగా ప్రభుత్వ పాత్ర పెరగాలని, ప్రభుత్వేతర సంస్థల ద్వారా రైతులకివ్వబడే సాంకేతికాల పరంగా, నియంత్రణ జరగాలని చట్ట సభలో వ్యక్తపరిచారు. ముఖ్యంగా కృత్రిమ జన్యు మార్పిడి ద్వారా జరిగిన సాంకేతికాల్ని విశ్లేషించి, పరిశోధించకుండా విస్తరింప చేయకూడదని చెప్పారు. విచ్చలవిడి రసాయనాల వాడకం, యంత్రాల వినియోగం వలన జరుగుతున్న నష్టాల్ని 1968 సైన్స్ కాంగ్రెస్ స్థాయిలోనే వివరించారు.

ప్రపంచ శాంతికి దోహదపడే లక్ష్యంతో ఏర్పడ్డ "పుగ్వాష్ సమూహం" (బెట్రాండ్ రస్సెల్, ఐన్‌స్టీన్ వంటి ప్రముఖులు, ఇతర నోబెల్ పురస్కారాలు పొందిన శాస్త్రవేత్తలు కలిసి ఏర్పాటు చేసిన సంస్థ)కు 2002–2007 కాలంలో నిర్దేశకుడిగా ఎన్నికయ్యారు. తనకొచ్చిన పురస్కారాలను దేశ ప్రముఖ సంస్థల ఆర్థిక సహకారాల్ని, ప్రజా సైన్ ఉద్యమం కోసం స్వామినాథన్ పరిశోధనా సంస్థను నడపటం మరో ప్రత్యేకత (అనేక మంది ఉన్నత స్థాయి శాస్త్రవేత్తలు, ఉపకులపతులు కార్పొరేట్, ప్రైవేట్ కంపెనీల సలహాదారులుగా 'సేవ' చేయటాన్ని చూస్తున్నాం). భారతదేశం హరిత విప్లవ వరవడిలో నష్టపోయిన, స్థానిక చిరుధాన్య పంటల అభివృద్ధికి తన సంస్థ ద్వారా కృషి సల్పారు. అలానే వ్యవసాయ అనుబంధ వృత్తిగా ఉన్న మత్స్యకారులు అభివృద్ధికి తగిన పథకాలను రూపొందించి దక్షిణ భారతదేశ తీర ప్రాంతంలో పరిశోధనలు, విస్తరణ కార్యక్రమాలు నిర్వహించారు. మడ అడవుల్ని రక్షించి జలజీవాల మనుగడను కాపాడే పథకాలను అమలు చేశారు. ఆహార భద్రత పథకాల అమలు విషయంలో ప్రభుత్వాల ఆచరణ అంశాలను విశ్లేషించగల శాఖల్ని నిర్వహించారు.

తాను హరిత విప్లవ పితామహుడిని అనిపించు కోవటం కంటే ముగ్గురు మహిళా శాస్త్రవేత్తలకు తండ్రిని అనిపించుకోవటానికే గర్వపడతానన్న వ్యక్తి స్వామినాథన్. అలాగే విద్యారంగ విస్తరణ ఉద్యమంలో పని చేసి అనేక సంస్కరణలకు ప్రేరకురాలిగా జీవించిన మీనా (భూతలింగం) భర్తగా తాను చెప్పుకోదగిన స్థాయికి చేరానని భావించారాయన. జీవిత చివరి దశలో జాతీయ రైతు కమిషన్ బాధ్యుడిగా, భారతదేశ రైతులకు తగిన సంస్కరణలను ముఖ్యంగా ఆదివాసీలకు, చిన్న సన్నకారు వృత్తిదారుల అభివృద్ధికి తగిన విధంగా సూచనలివ్వటం గర్వించదగిన విషయమని చెప్పుకొన్నారు. అఖిల భారత కిసాన్ సభ నాయకులతో కలిసి, తను ఆశించిన ప్రభుత్వాల వైఖరిలో రావాల్సిన మార్పుల్ని వ్యక్తపరిచారు. వామపక్షాలు కోరే వ్యవసాయ వనరుల విషయంలో జరిగిన సంస్కరణల్ని తన నివేదికల్లో పొందుపరిచారు. పరోక్షంగా భూసారం, పర్యావరణం కాపాడబడాలంటే, దున్నే వారికే (వ్యవసాయం చెయ్యగలిగిన రైతుకే) భూమి, సాగునీటి వనరు ఉండాలని వివరించారు. అలాగే ప్రపంచ వాణిజ్య సంస్థ అసమంజస విధానాల్ని సరిచెయ్యాలంటే "భారత వాణిజ్య సంస్థ" ద్వారా రైతు రక్షించబడాలని స్పష్టంగా పేర్కొన్నారు. పంట భూములు వ్యవసాయేతర రంగాలకు, సంస్థలకు మరల్చకూడదని సూచించారు. వ్యవసాయ రక్షణకు ప్రత్యేక వ్యవసాయ మండళ్లను రూపొందించాలని సూచించారు. "ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్సర్వేషన్ ఆఫ్ నేచర్" నిర్దేశకుడిగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు తగిన సంస్కరణలు అమలుజరగాలని వివిధ దేశాల ప్రభుత్వాలకు ఐక్యరాజ్య సమితి ద్వారా సూచించారు.

ప్రొ.స్వామినాథన్ శతజయంతి (ఆగస్టు 7, 2025) సందర్భంగా ఆయన స్మృత్యర్థం స్వామినాథన్ పరిశోధనా సంస్థ (చెన్నై), భారత దేశ వ్యవసాయ శాఖ వారు సంయుక్తంగా న్యూ ఢిల్లీలో అంతర్జాతీయ సెమినార్ నిర్వహించారు. అందుకు వారిని అభినందిస్తూ ఆయనిచ్చిన విలువైన జాతీయ రైతు కమిషన్ సిఫార్సుల్ని ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు జరపాలని కోరుకుందాం! అప్పుడే ఆయనకిచ్చిన "భారత రత్న"కు సార్థకత లభిస్తుందని, ప్రభుత్వాలు "హిపోక్రసీ" ప్రవాహం నుంచి బయట పడగలవని ఆశిద్దాం!!

అమెరికా అడ్డగోలు సుంకాలు.. ఆక్వా రైతు కుదేలు

(4వ పేజీ నుంచి)

పథకం (ఎం.ఐ.ఎస్) ద్వారా సబ్సిడీ ధర ఇవ్వాలి. ఇన్సూరెన్సు వర్తింపచేయాలి.

❖ నాణ్యమైన సీడ్, ఫీడ్ అందేలా చూడాలి. ధరలు నియంత్రించాలి. విద్యుత్ రాయితీ, పెండింగ్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వాలి.

❖ దేశంలో వినియోగం పెరిగేలా (డొమెస్టిక్) చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో తక్కువ ధరకు లభించే ఈ పౌష్టికాహారం విద్యార్థులకు భోజన పథకంలో అందించాలి. సబ్సిడీ రేట్లకు ప్రజలకు అందించాలి. సైన్యానికి వినియోగించాలి.

❖ మార్కెట్ యార్డుల్లో, సొసైటీల్లో శీతల గిడ్డంగులు నిర్మించి రైతాంగానికి అందుబాటులోకి తేవాలి.

❖ కేంద్రం ఎక్స్‌లెన్సీ నిధులు ఇచ్చి ఆక్వా ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలి. సమస్యలు పరిష్కరించాలి.

సమస్యల పరిష్కారానికి ఆక్వా రైతాంగం ఇతర పంటల రైతుల సహకారంతో ఐక్యంగా, రాజకీయాలకు అతీతంగా కదలాలి. ఉద్యమించాలి. కష్టపడి పండించి నష్టపోవడం కాదు. పోరాడి సాధించుకోవాలి. దేశంలో సాగుతున్న రైతాంగ ఉద్యమాలతో మమేకం కావాలి. పాలకుల కళ్ళు తెరిపించాలి.

– బి.బలరాం,
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

అడుగడుగునా అక్రమాలు.. అవినీతి..!

(5వ పేజీ నుంచి)

మిగిలిన గ్రామాల్లోనూ ఇదే తంతు నడుస్తుందని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు.

అసలు గిరిజనులు భూములపై లేకుండా చేయడానికి బుట్టాయగూడెం, జీలుగుమిల్లి తహశీల్దార్లు, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒలు చట్టవిరుద్ధంగా గిరిజనేతర భూస్వాములకు అనుకూలంగా ప్రొటెక్షన్ ఆర్డర్లు ఇచ్చేస్తున్నారు. షెడ్యూల్ ప్రాంతంలో ఈ స్థాయి అధికారులకు ప్రొటెక్షన్ ఆర్డర్లు ఇచ్చే అధికారం లేకున్నా బరితెగించి భూస్వాములిచ్చే కాసులకు కక్కుర్తిపడి, అధికార పార్టీ నేతల ఒత్తిడికి తలొగ్గి ఈ పనులు సాగిస్తున్నారు. ఈ ఆర్డర్లతో పోలీసులు రంగంలోకి దిగి గిరిజనులను, వారికి అండగా నిల్చిన నాయకులను బెదిరిస్తున్నారు. తద్వారా వీరిని భూముల నుండి గెంటేసి ఈ భూములను ఆర్అండ్ఆర్ భూసేకరణలో పెట్టాలని చూస్తున్నారు.

ఇది షెడ్యూల్ ప్రాంతం అయినందున దీనిపై గవర్నర్, రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి. గిరిజనుల సంక్షేమం కోసం కట్టుబడితే ప్రభుత్వాధినేతలు, అధికారులు గిరిజనుల భూములను రక్షించాలి. నిర్వాసిత గిరిజనులకు వివాదాలు లేని భూములు ఇవ్వాలి. తద్వారా వారి బతుకుదెరువును కాపాడాలి. గిరిజనులు తమ భూములను రక్షించుకునేందుకు వేరే మార్గం లేక అనివార్యంగా గిరిజనులు పోరాటాలకు సిద్ధపడే స్థితికి ప్రభుత్వాలు నెడుతున్నాయి.

–ఎ.రవి, సిపిఎం జిల్లా కార్యదర్శి

మతతత్వాన్ని ఎదుర్కోవడంలో సాంస్కృతిక ఉద్యమాల ప్రాముఖ్యత

మతోన్మాదాన్ని ఎదుర్కొనడంలో సాంస్కృతిక రంగానికి సామర్థ్యం ఉన్నప్పటికీ నేడు సాంస్కృతిక రంగం అనేక సవాళ్ళను ఎదుర్కోంటోంది. మతపరమైన శక్తులు తరచుగా సాంస్కృతిక వారసత్వంలోకి చొరబడి వక్రీకరణలకు పూనుకుంటున్నాయి. కొన్ని చారిత్రక అంశాలను ఈ శక్తులు కో-ఆప్ట చేసుకోవడం ద్వారా మతోన్మాదానికి పూనుకుంటున్నాయి. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో విభజన రాజకీయాల కోసం మతపరమైన చిత్రాలను, కళలను, కథనాలను ప్రోత్సహించినట్లే ఇప్పుడు కొన్ని శక్తులు మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తున్నాయి.

మతతత్వం అనేది సమాజాన్ని మతపరమైన లేదా జాతిపరమైన విభేధాల ద్వారా విడదీసే ఒక సిద్ధాంతం. అది తరచుగా అసహనం, సంఘర్షణలను ప్రోత్సహిస్తుంది. ముఖ్యంగా భారతదేశం లాంటి దేశాల్లో సామాజిక సామరస్యానికి ఇది తీవ్రమైన ముప్పుగా పరిణమించింది. దీనిని ఎదుర్కోవాలంటే సాహిత్యం, విద్య, సాంస్కృతిక ఉద్యమాల ప్రాముఖ్యత చాలా ఉంది. మతతత్వంతో సంబంధంలేని ఉమ్మడి ఆచారాలు, సాంప్రదాయాలు, సామాజిక విలువలతో కూడిన సమైక్య ప్రయత్నాలు అందుకు చాలా అవసరం. గతంలో సాంస్కృతిక ఉద్యమాలు మతోన్మాదానికి శక్తివంతమైన విరుగుడుగా పనిచేశాయి. మతతత్వాన్ని తిరస్కరించడంలో చరిత్రలో దీనికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. రవీంద్రనాథ్ టాగూర్ రచించిన 'గీతాంజలి' రచన ప్రజా సమూహాల్లో ఐక్యత, పరస్పర అవగాహన, మానవతా విలువల్ని గొప్పగా చాటి చెప్పింది. ఆనాటి (1910–12) పరిస్థితుల్లో హిందు, ముస్లిం ఉమ్మడి సాంప్రదాయాలతో యావత్తు దేశం ఐక్యం అవ్వాల్సిన ప్రాధాన్యతను చాటింది. 'గీతాంజలి' రచనలో రవీంద్రనాథ్ టాగూర్ వలస పాలనకు వ్యతిరేకంగా ఐక్యతా శంఖారావాన్ని పూరించారు.

మతతత్వం దాని ప్రభావంపై సరైన అవగాహన

భారతదేశంలో మతతత్వం, మతపరమైన వైవిధ్యం చారిత్రక, రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిణామాల్లో అవకాశవాదంతో పుట్టింది. విభజించు – పాలించు అన్న బ్రిటిషు విధానాలే దీనికి పునాది. స్వాతంత్ర్యానంతర కాలంలో మతోన్మాద రాజకీయ శక్తులు, స్థానిక ప్రభుత్వ వైఫల్యాల్ని వినియోగించుకొని బలపడడానికి పూనుకొన్నాయి. మతపరమైన లేదా జాతిపరమైన ప్రయోజనాలు, ప్రజల సామూహిక ప్రయోజనాల కంటే ప్రాధాన్యత కల్గిన సిద్ధాంతంగా వీరు ముందుకు తెచ్చారు. ఇది తరచుగా హింస, సామాజిక విభజన వంటి వాటివల్ల ప్రజల్లో మత ప్రాతిపదికన విభజనను పెంచింది. 1947లో మతపరమైన రాజకీయాలు "రెండు జాతులు" సిద్ధాంతాన్ని ప్రేరేపించింది. నాటి దేశ విభజన హింసాయుతంగా మారి ఇల్లు వాకిలి వదిలి వలసలకు దారితీసింది. ఇది మన సామాజిక నిర్మాణంలో, బలమైన గాయాలను మిగిల్చింది. నేడు విభజన రాజకీయాలు మరోసారి ముందుకు వచ్చాయి. ఇది మన ప్రజా సమూహాలను మత ప్రాతిపదికన విభజించి జాతీయ ఐక్యతను విచ్ఛిన్నం చేయాలని చూస్తుంది.

దేశంలో సాంస్కృతిక ఉద్యమాల పాత్ర

మతోన్మాద శక్తులు పెరుగుతున్న నేపథ్యంలో, సాహిత్యం, కళలు, విద్య, జీవన శైలి వంటి వాటి ద్వారా సామాజిక స్పృహను, సామరస్యాన్ని పెంపొందించడానికి సాంస్కృతిక ఉద్యమం ప్రారంభమైంది. విభజన కథనాలను సవాలు చేస్తూ మతతత్వానికి ఒక ప్రతిఘటనా శక్తి రాజకీయ, ఆర్థిక విధానాల ద్వారానే కాకుండా సామూహిక ఐక్యత మీద, మతసామరస్యం మీద నిమగ్నమైన కృషి సాంస్కృతిక రంగంలో ముందుకు వచ్చింది. ప్రధానంగా సామాజిక విలువలు, సహకారం, వైవిధ్యంలో అస్థిత్వం వంటి వాటిని స్వాగతిస్తూ వైజ్ఞానిక కార్యక్రమాలు విస్తారంగా ప్రారంభమయ్యాయి. ఇవి వైవిధ్యాన్ని గుర్తించి, సామరస్యాన్ని ప్రోత్సహించి ప్రజల సానుభూతిని పొందాయి. మతతత్వం యొక్క మూలాలైన అజ్ఞానం, అశాస్త్రీయ భావనలను సాంస్కృతిక ఉద్యమాలు విమర్శనాత్మకంగా ఎదుర్కొన్నాయి. సైన్సు, చరిత్ర, సాహిత్యం, కళలు అందుకు పునాదిగా నిలిచాయి.

కళలు – సాహిత్యం – మానవతా దృష్టి

సాంస్కృతిక ఉద్యమాలు మతపరమైన, జాతిపరమైన హద్దులను దాటి ప్రజలను సామూహిక జీవనంలో భాగస్వాములను చేశాయి. కళలు, సాహిత్యం ద్వారా మానవతా విలువల్ని బలంగా ప్రజల ముందు ఉంచగలిగాయి. ఉదాహరణకు రవీంద్రనాథ్ టాగూర్ 'గీతాంజలి' రచన భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి ఎంతగానో తోడ్పడింది. జనగణమన జాతీయ గీతమే పెద్ద ఉదాహరణ. భక్తి, ఉపనిషత్తులు, సాంప్రదాయాలతో సనాతన ధర్మం, పాతుకుపోయిన భావజాలం నేపథ్యంలో 'గీతాంజలి' పద్యాలు ప్రజల ఉమ్మడి ప్రయోజనాల్ని ముందుకు తెచ్చాయి. ఆధ్యాత్మిక ధోరణి, వ్యక్తిగత ధోరణి అంశాల్ని అధిగమించి ప్రజల్ని ఐక్యం చేయడానికి గీతాంజలి రచన గొప్పగా తోడ్పడింది. 'గీతాంజలి' "పద్యం – 35" భయాన్ని అధిగమించే, (ఉత్తేజపరిచే) భావజాలాన్ని పూరించింది, వలస వ్యతిరేక ఐక్యతను ప్రేరేపించింది. మతపరమైన విభజనలను మించి విశాల దృష్టితో పరిణామాల్ని పరిశీలించడానికి పాఠకులను ప్రోత్సహించింది. అదే విధంగా 1930 – 1940ల్లో 'ప్రేమ్‌చంద్', 'ఫైజ్ అహ్మద్ ఫైజ్' వంటి ప్రముఖుల నేతృత్వంలోని 'ప్రోగ్రెసివ్ రైటర్స్ మూవ్‌మెంట్' సాహిత్యం – రచనలు లౌకికతత్వం, సమానత లాంటి అంశాలను ముందుకు తెచ్చాయి.

వివిధ సమూహాల మధ్య సఖ్యత – అవగాహన

కళలు, సాహిత్యంతో విభిన్నమైన సంప్రదాయాలతో సర్దుబాటు కావడానికి సాంస్కృతిక రంగం వేదికగా తోడ్పడింది. సమాజంలో బలంగా వేళ్లూనుకున్న మూఢవిస్వాశాలు, వివిధ సమూహాల మధ్య సఖ్యతకు ఆటంకంగా ఉన్న ధోరణులపై కళలు, సాహిత్యం ధ్వజమెత్తాయి. అటు హిందూ ఇటు ముస్లిం ఆధ్యాత్మిక సాంప్రదాయాలను మేళవించి సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి, సూఫీ ఉద్యమాలు ముందుకొచ్చాయి. 'కబీర్', 'రూమీ' వంటి కవులు తమ రచనల ద్వారా మతతత్వంపై నిరసన తెలిపి ప్రజల మధ్య ప్రేమ, ఐక్యతను ప్రోత్సహించారు. ఆధునిక కాలంలో 'జాతీయ మతసామరస్య ఫౌండేషన్' కార్యక్రమాలు పాఠశాలల్లో లౌకిక భావనలతో సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించాయి. పిల్లలకు జాతి, మతపరమైన వైవిధ్యం వివరించి ఉమ్మడి జీవన ప్రాధాన్యతను బోధించాయి. వివిధ మత సమూహాల మధ్య సఖ్యత కోసం సంగీత కచ్చేరీలు, రంగస్థల నాటికలు రూపంలో సాంస్కృతిక ఉత్సవాలు జరిగాయి. విభిన్న సాంప్రదాయాలతో కూడుకున్న (నాటకాలు, పాటలు, చారిత్రక కథలు) తమ భావాలు పంచుకునే వేదికలుగా వెలిశాయి.

విభజన కథనాలు – సాంస్కృతిక రంగం

ప్రస్తుతం మతతత్వం వక్రీకరించిన చారిత్రక కథనాల ద్వారా, ప్రింట్ / ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా తప్పుడు సమాచారం ప్రజల్లోకి వస్తోంది. మతపరమైన విభజన గీతలు గీయడానికి సోషల్ మీడియా దుర్వినియోగం అవుతుంది. ఈ నేపథ్యంలో బాధ్యతాయుతమైన మీడియా ప్రవేశించి ఈ విభజన పోకడలను ఎదుర్కొంటున్నాయి. శాస్త్రీయ విద్య ప్రచారానికి వేదికలయ్యాయి. 19వ శతాబ్దపు భారత పునరుజ్జీవనం, హేతువాదం, సమానత్వం, మత సామరస్యాన్ని ముందుకు తెచ్చిన అంశాలే నేడు పునాదిగా నిలిచాయి. మొఘలాయుల పాలనను, బలవంతపు మత మార్పిడుల పాలనగా చిత్రించినా, వివేకానందుడిని హిందూవాదిగా పేర్కొన్నా, చారిత్రక కథనాలు అందుకు అంగీకరించడం లేదు. ఎన్నో కథనాలు ఎదురొడ్డి నిలుస్తున్నాయి. మొఘలుల సామ్రాజ్యంలో సాగిన మతాంతర వివాహాల ప్రోత్సాహం మత సామరస్యాన్ని చాటింది. అంతేకాదు వారి పాలనలో హిందువులను ఉన్నత పదవులలో నియమించి సామరస్యాన్ని చాటారు. మొఘలాయుల పాలన కంటే ముందు హిందువుల మీద ఉన్న పన్నులను తొలగించి సఖ్యతను చాటారు. సామాజిక సఖ్యత కోసం మొఘలుల పాలనలో సల్పిన కృషి మతసామరస్యానికి భూమికగా నిలిచింది. ఒకవేళ నేడు మత దృష్టితో స్కూళ్లల్లో పాఠ్యాంశాలు మార్చినా మొఘలాయుల కాలం నాటి చరిత్రను తుడిపేయడం సాధ్యం కాదు. విద్య, సాహిత్యం, శాస్త్రీయ పరిశోధనలు ఈ ప్రయత్నాలకు అడ్డుగా నిలుస్తున్నాయి. మొఘలాయులు బలవంతంగా మత మార్పిడిని ప్రోత్సహించినారని నేడు కేంద్ర పాలకులు ప్రచారం సాగిస్తుంటే, సాహిత్య చరిత్ర దాన్ని అవకాశవాద ప్రచారంగా రుజువు చేస్తోంది. బెంగాల్‌లో భారీగా పెరిగిన ముస్లిం జనాభాను చూపి మత మార్పిడులు జరిగాయని మతోన్మాదులు ఆరోపించారు. బ్రాహ్మణాధిపత్య సామాజిక అణచివేతను ఎదుర్కోవడానికి, అలాగే బెంగాల్ ప్రావెన్స్‌లో హిందూ సంస్థానాధిపతుల అధిక పన్నులు, దౌర్జన్యాలు భరించలేక చాల మంది దేశీయంగా ఇస్లాంను స్వీకరించారని స్వామి వివేకానందుడు 'సెలెక్టడ్ రైటింగ్స్'లో పేర్కొన్నాడు. మత మర్పిడులు బలవంతంగా చేశారన్నది వాస్తవం కాదని ఆయన అన్నారు. రవీంద్రనాథ్ టాగూర్ గీతాంజలి అయినా, వివేకానందుని సెలక్టెడ్ రైటింగ్స్ అయినా ఎన్నో సంవత్సరాల కిందట పేర్కొన్న అంశాలే. అయితే నేడు సాంస్కృతికోద్యమం ఈ చరిత్ర ఆధారంగానే నేటి మతోన్మాదుల్ని ఎదుర్కొంటోంది. ఇదే సాంస్కృతికోద్యమం ప్రత్యేకత, ప్రాముఖ్యత.

అణగారిన వర్గాలను శక్తివంతం చేయడం

ఆర్థికంగానూ, సామాజికంగానూ అణగతొక్కబడటం, ముఖ్యంగా మైనార్టీల విషయంలో మతపరమైన ఉద్రిక్తతలను పెంచుతుంది. మసీదుల ధ్వంసం, గోరక్షక దళాల అకృత్యాలు, 370వ అధికరణం రద్దు, ఏకరూప పౌర స్మృతి పోకడ, పౌరసత్వ చట్ట సవరణ, లాంటి ఎన్నో ఉదాహరణలు మతోన్మాదుల పోకడలను బట్టబయలు చేస్తున్నాయి. మతతత్వాన్ని ఎదుర్కోడానికి సాంస్కృతికోద్యమంలో కళలు, సాహిత్యం సాధనాలుగా ఉన్నాయి. వీటిని సాంస్కృతిక వారసత్వం ముందుకు తెస్తుంది. సామాజిక న్యాయాన్ని దళిత సాహిత్యం, మాలపల్లి నవల లాంటి రచనలు బలంగా నిలబెడుతున్నాయి. దళిత సాహిత్యం, సాంస్కృతిక ఉద్యమాలు, కుల ఆధారిత మతతత్వాన్ని సవాలు చేయడానికి ముందుకొచ్చాయి. అణగారిన వర్గాల గౌరవాన్ని నొక్కి నిలబెట్టే సాహిత్యమే కాదు, సామాజిక న్యాయంలో నిలబెట్టే కథనాలు, మహిళలు, ముస్లిం మైనారిటీల సామాజిక న్యాయాన్ని ముందుకు తెస్తున్నాయి. జైన సమాజ సంక్షేమ కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు సామాజిక శ్రేయస్సుకు దోహద పడ్డాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అణగారిన వర్గాలను శక్తివంతం

..14లో

జన, కుల గణనలో కీలకాంశాలు

(11వ పేజీ నుంచి)

కులగణనతో బలపడుతుంది. విశ్వసనీయ కుల సమాచారం అందుబాటులో ఉన్న పక్షంలో న్యాయస్థానాలు విధానపరమైన ప్రాతిపదికన కాకుండా మెరిట్ ఆధారంగా తీర్పు చెప్పాల్సి వస్తుంది.

అయితే అనేక సవాళ్లు కూడా ఎదురవుతాయి. వివిధ ప్రాంతాలు, భాషలు, పేర్లకు సంబంధించిన సంప్రదాయాలలో వేలాది కులాలు, ఉప కులాల సమా చారాన్ని సేకరించడం ఒక గొప్ప పని. ప్రామాణికమైన వర్గీకరణ వ్యవస్థ లేకుం డా సమాచారాన్ని సేకరిస్తే అది అస్థిరంగా, నిరుపయోగం గా ఉంటుంది. అధి కంగా లెక్కించడం, తక్కువగా లెక్కించడం, తప్పుడు వర్గీకరణకు సంబం ధించిన సవాళ్లు కూడా ఉంటాయి. జనగణన రిజర్వేషన్లతో పాటు ఇతర ముఖ్యమైన రాజకీయ అంశాలను కూడా ప్రభావితం చేస్తుంది. ప్రధానంగా ఆందోళన కలిగించే అంశం నియోజకవర్గాల పునర్విభజన. 1976 నుండి ఈ ప్రక్రియ జరగడం లేదు. అయితే 2026 జనగణన ఆధారంగా దీనిని చేపట్టబోతున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు కూడా జనగణన, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే జరుగుతుంది.

అదీకాక ఇక్కడ ఒక భయాందోళన కూడా వ్యక్తమవుతోంది. జాతీయ జనాభా రిజిస్టర్ (ఎన్.పి.ఆర్)ను తాజా పరచడం కోసం దీనిని ఉపయోగించవచ్చునని, ఆ తర్వాత దానిని వివాదాస్పద జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్.ఆర్.సి) కోసం కూడా ఉపయోగిస్తారని అనుమానిస్తున్నారు. పైగా అధికార పార్టీ విభజన ఎజెండాను ముందుకు తీసుకుపోవడానికి గణన ప్రక్రియను దుర్వినియోగం చేయవచ్చునని కూడా భయపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే జనగణనతో పాటు ఎన్.పి.ఆర్‌ను తాజా పరచరాదన్న డిమాండ్ బలపడుతోంది.

జనగణన సమాచారాన్ని విస్తృతంగా ఉపయోగించవచ్చు. దానిని సక్రమంగా ఉపయోగించుకుంటే విధాన రూపకల్పనకు, ప్రభుత్వ వనరుల పంపిణీకి మార్గదర్శనం చేయడానికి దోహదపడుతుంది. విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల పర్యవేక్షణకు మంత్రిత్వ శాఖలకు ఈ సమాచారం తప్పనిసరి. వలసలు, ఉపాధి, సామాజిక చలనశీల ధోరణులను అర్థం చేసుకోవడానికి విధాన నిర్ణేతలకు సాయపడుతుంది.

కుల సమాచారం ఉపయుక్తమైనదే అయినప్పటికీ అది అన్నింటికీ మందు కాదు. కుల సమాచారం అందుబాటులో ఉన్నచోట కూడా ఎస్సీ, ఎస్టీలలో అసమానతలు వేళ్లూనుకుపోయి ఉన్నాయి. కేవలం కులగణన ద్వారా న్యాయం చేకూరదు. కుల వ్యవస్థ నిర్మూలన కోసం పోరాడడంలో మన నిబద్ధతను అనవసరమైన భ్రమలు బలహీనపరుస్తాయి. ముఖ్యంగా మోడీ ప్రభుత్వ హయాంలో నయా ఉదారవాద విధానాలు సంక్షేమ కార్యక్రమాలను బలహీనపరిచాయి. ప్రైవేటీకరణను ప్రోత్సహించాయి. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించాయి. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఉద్దేశించిన పథకాలను నీరుకార్చాయి. ఈ వ్యవస్థీకృత సమస్యలను సవాలు చేయని పక్షంలో కులగణన మాత్రమే పేదలు, అణగారిన వర్గాల జీవితాలను మార్చదు. అయినా న్యాయం కోసం జరిపే పోరాటంలో కుల సమాచారం ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడుతుంది. అసమానతల నిజ స్వభావాన్ని బహిర్గతం చేయడానికి, ప్రస్తుత విధానాల వైఫల్యాన్ని బయటపెట్టడానికి, కుల ఆధారిత రాజకీయాలను ఎండగట్టడానికి ఇది సాయపడుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే కులాల వారీగా జనాభా లెక్కలు సేకరిస్తే కులాలకు అతీతంగా నిర్మాణాత్మక మార్పుల కోసం పోరాడే విస్తృత ఉద్యమం ఊపిరి పోసుకుంటుంది. నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణ, గృహ నిర్మాణం, భూసంస్కరణలు, ఉపాధి హామీలు, ప్రభుత్వ సేవల కల్పనలో సార్వత్రిక ప్రవేశం లభిస్తుంది.

-బి.వి. రాఘవులు,
సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు

వార్షికోత్సవ వేడుకలో ఎంఎల్ఎ చిర్రి బాలరాజుతో పాటు పాఠశాల యాజమాన్యం

ఉత్తమ విద్యాబోధనే శ్రీవిద్యానిధి లక్ష్యం

అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన - దూర ప్రాంత పిల్లల సౌకర్యార్థం బస్ సౌకర్యం

పాఠశాల వార్షికోత్సవ వేడుకలకుహాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు

కరస్పాండెంట్ ఎంవి.రత్నం

ప్రిన్సిపల్ మంగరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి సొసైటీ సమీపంలో ఏర్పాటు చేసిన శ్రీవిద్యానిధి పాఠశాల విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధనే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ రత్నం, ప్రిన్సిపల్ మంగరాజు అన్నారు. అతి తక్కువ ఫీజులతో విద్యార్థులకు మంచి విద్యను అందించే విధంగా శ్రీవిద్యానిధి పాఠశాలను తీర్చిదిద్దుతున్నామన్నారు. మూడు సంవత్సరాలుగా పాఠశాలలో పిల్లల సంఖ్యను పెంచుకుంటూ విద్యార్థులకు మంచి బోధన అందిస్తూ, తల్లిదండ్రుల నుంచి ప్రశంసలు అందుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రయివేటు విద్యాసంస్థలతో పోల్చుకుంటే ఇక్కడ ఫీజులు కూడా తక్కువగా తీసుకుంటూ పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ఈ పాఠశాలలో నర్సరీ నుంచి 7వ తరగతి వరకూ విద్యాభ్యాసం నేర్పుతున్నామన్నారు. ముందు ముందు 10వ తరగతి వరకు కూడా పెంచనున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో బోధన అందించడంతో పాటు తెలుగు, హిందీ భాషలపై పట్టు వచ్చేలా నాణ్యతతో కూడిన విద్యాభోధన అందిస్తున్నట్లు చెప్పారు. పాఠశాలలో మొత్తం 13 మంది వరకు అనుభవం కలిగిన ఉపాధ్యాయ సిబ్బందితో నాణ్యత గల విద్యను అందిస్తూ తల్లిదండ్రులు, గ్రామస్తుల నుంచి ప్రశంసలు అందుకుంటున్నామని అన్నారు. అదేవిధంగా దూరప్రాంత విద్యార్థులకు బస్సు సౌకర్యం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు, మానసిక నైపుణ్యం పెంపొందించేందుకు ప్రత్యేక కోర్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. పిల్లలను దగ్గరుండి చూసుకోవడానికి తరగతికి ఒకరు చొప్పున ఆయాలను నియమించినట్లు తెలిపారు. అలాగే క్రీడానైపుణ్యానికి యోగా, అబాకస్, డ్యాన్స్ క్లాస్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఇటీవల పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించగా స్థానిక ఎంఎల్ఎ చిర్రి బాలరాజుతో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది, పలు పార్టీలకు చెందిన నాయకులు, అధికారులు హాజరై పాఠశాల విధి విధానాలు చూసి అభినందనలు తెలిపినట్లు చెప్పారు.

మతతత్వాన్ని ఎదుర్కోవడంలో సాంస్కృతిక ఉద్యమాల ప్రాముఖ్యత

(13వ పేజీ నుంచి)

చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి.

చారిత్రక సమకాలీన ఉదాహరణలు

జాతీయోద్యమంలో భాగంగా మతతత్వాన్ని ఎదుర్కోవడంలో సాంస్కృతిక ఉద్యమాలు గతంలో కీలక పాత్ర పోషించాయి. 'టాగూర్' పాటలు, సంస్కరణోద్యమాల మత సామరస్యం దళిత, గిరిజన సాహిత్యం విభిన్న సమాజాలను ఐక్యం చేసింది. స్వాతంత్ర్యానంతరం అమర్ అక్బర్ ఆంథోనీ వంటి వాటి ద్వారా మత సామరస్యం ప్రోత్సహించబడింది. వీధి నాటికలు సినిమా పాటలు, కవులు, కళాకారుల రచనలు జాతీయ సమైక్యతకు, మత సామరస్యానికి ఎనలేని కృషి చేశాయి. ప్రపంచంలో సైతం నేడు సాంస్కృతిక కార్యక్రమాలు సామాజిక న్యాయం మీద దృష్టి సారించాయి. "బ్లాక్ లైవ్స్ మ్యాటర్" (వికేంద్రీకరణతో సామాజిక, రాజకీయ ఆందోళన 2013లో రేసిజానికి వ్యతిరేకంగా) క్రాస్ కల్చరల్ సంఘీభావాన్ని ప్రోత్సహించాయి. సాంస్కృతిక క్రియాశీలత విబేధాలను సైతం ఎలా తగ్గించగలదో రుజువు చేశాయి. బ్రిటన్‌లోని 'డిస్మాలాండ్' సర్కస్ టెంట్లు లాగా కళారూపకం సాంస్కృతిక రంగంలో ప్రధాన స్రవంతి విబేధాలను విస్మరించేలా చేసింది. సాంస్కృతిక క్రియాశీలత మత సామరస్యాన్ని, సామాజిక న్యాయాన్ని చాటుతున్నాయి.

సవాళ్ళు-భవిష్యత్ మార్గం

మతోన్మాదాన్ని ఎదుర్కొనడంలో సాంస్కృతిక రంగానికి సామర్థ్యం ఉన్నప్పటికీ నేడు సాంస్కృతిక రంగం అనేక సవాళ్ళను ఎదుర్కొంటోంది. మతపరమైన శక్తులు తరచుగా సాంస్కృతిక వారసత్వంలోకి చొరబడి వక్రీకరణలకు పూనుకుంటున్నాయి. కొన్ని చారిత్రక అంశాలను ఈ శక్తులు కో-ఆప్ట్ చేసుకోవడం ద్వారా మతోన్మాదానికి పూనుకుంటున్నాయి. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో విభజన రాజకీయాల కోసం మతపరమైన చిత్రాలను, కళలను, కథనాలను ప్రోత్సహించినట్లే ఇప్పుడు కొన్ని శక్తులు మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తున్నాయి. వక్రీకరణలు ఎంతవరకు పోయాయంటే, రవీంద్రనాథ్ టాగూర్ గీతాంజలిలో మత సామరస్యాన్ని నిలపడానికి, ఐక్యతను సాధించడానికి పేర్కొన్న అన్ని అంశాలనూ పక్కకు నెట్టి ఆధ్యాత్మిక అంశాన్నే బలంగా ముందుకు తెస్తున్నాయి. వేమనను, జాషువాను ఇలాగే కో ఆప్ట్ చేసుకొని ప్రచారం చేస్తున్నాయి. శివాజీని, పటేల్‌ను, ఆఖరికి సంస్కరణోద్యమాలను కో-ఆప్ట్ చేసుకొంటున్నాయి. అయితే, శాస్త్ర, సాంకేతిక విజయాలు, చారిత్రక సాంస్కృతిక వారసత్వం, ఈ వక్రీకరణలను మనిషిని నీడ వెంబడించినట్లే వెంబడిస్తున్నాయి. జాతీయోద్యమ రోజుల్లో మతోన్మాదాన్ని ఎదుర్కొన్నట్లే నేడు మతోన్మాదాన్ని సాంస్కృతికోద్యమం ద్వారా ఎదుర్కోవలసి ఉంది. సాంస్కృతికోద్యమ ప్రాముఖ్యత ఇదే.

- పి.మధు, సిపిఎం పూర్వ రాష్ట్ర కార్యదర్శి

భారత రాజ్యాంగం మతపరమైన హక్కును, స్వాతంత్ర్యాన్ని ఇచ్చింది. ఎవరు ఏ మతమైనా అవలంబించవచ్చు.

- నరేంద్ర దభోల్కర్, సామాజిక కార్యకర్త

సమాజం కొద్ది మంది మీద ఆధారపడి నడవదు. లేదా అదృష్టం వల్లనో, విధి ఫలితం వల్లనో నడవదు. పౌరుల చైతన్యపూర్వక కార్యాచరణ వల్ల నడుస్తుంది.

- ఆంటోనియో గ్రాంసీ, ఇటాలియన్ మార్క్సిస్టు తత్వవేత్త, రాజకీయవేత్త.

మూగజీవాల ఆపద్బాంధవుడు డాక్టర్ కోటేశ్వరరావు

పశువులకు ప్రాణ ప్రదాతగా ఉత్తమ సేవలు అందిస్తున్న వైద్యులు

అత్యవసర శస్త్రచికిత్స చేయడంలో సిద్ధహస్తుడు

జిల్లా ఉత్తమ పశువైద్యాధికారిగా ప్రశంసలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

నోరులేని మూగ జీవాలకు ప్రాణం పోస్తూ వాటికి ఆరోగ్య ప్రదాతగా, పాడిరైతులకు అండగా నిలుస్తూ అంకిత భావంతో పనిచేస్తూ ఏసమయంలోనైనా రైతులు ఫోన్ చేసిన వెంటనే వారికి అందుబాటులో ఉంటూ మండల పశువైద్యాధికారి కాల్వ కోటేశ్వరరావు పశువులకు విశేషమైన సేవలు అందిస్తున్నారు. పశువులకు ఎలాంటి ఆపరేషన్లు చేయడంలోనైనా ఆయన సిద్ధహస్తుడు. రైతుల మన్ననలతో పాటు జిల్లా ఉత్తమ పశువైద్యాధికారిగా ప్రశంసలు అందుకున్నారు. ఏ ఉద్యోగమైనా అంకితభావంతో పనిచేస్తే అవార్డులు, రివార్డులు అవే వస్తాయని నిరూపించారు. మండలంలో 2021లో పశువైద్యాధికారిగా చేరిన ఆయన నాలుగేళ్లుగా వందలాది ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు వంటి పశువులకు శస్త్రచికిత్సలు చేస్తూ మూగజీవుల ప్రాణాలు నిలబెడుతున్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న పశువులకు సైతం తన మేథోశక్తితో వైద్యం అందిస్తూ వాటిని బతికించి పశువుల రైతులకు ఆపద్బాంధవుడుగా నిలుస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన జిల్లా అధికారులు జిల్లా ఉత్తమ పశువైద్యాధికారిగా ఎంపిక చేయడంతో ఆగస్టు 15న ఏలూరు కలెక్టరేట్ వద్ద రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి, కలెక్టర్ వెట్రిసెల్వి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. తాను అందించిన సేవలు గుర్తించి అధికారులు అందించిన అవార్డు మరింత బాధ్యత పెంచిందని ఆయన అంటున్నారు.

ప్రశంసాపత్రం అందుకుంటున్న డాక్టర్ కోటేశ్వరరావు

ఆవుకు శస్త్రచికిత్స చేస్తున్న కోటేశ్వరరావు

వందల పశువులకు శస్త్ర చికిత్సలు

మనుషులకు వైద్య సేవలందించడానికి, ఆపరేషన్ చేయడానికి ఎన్నో సదుపాయాలు ఉంటాయి. కాని పశువులకు వైద్యం అంటే ఎటువంటి సౌకర్యాలు ఉండవు. పైగా గ్రామాల్లో, పొలాల్లో తిరిగి ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అయినా తన ఉద్యోగ బాధ్యతలు చక్కగా నిర్వర్తిస్తూ పశువులకు ఎటువంటి ఆపరేషనైనా చేయడంలో ఆయన సిద్ధహస్తుడని చెప్పవచ్చు. వందల సంఖ్యలో పశువులకు క్రిటికల్ ఆపరేషన్లు సైతం నిర్వహించి విజయవంతం అవుతున్నారని చెప్పడానికి ఎన్నో సంఘటనలు ఉన్నాయంటున్నారు రైతులు. ఉదాహరణకు మండల కేంద్రం టి.నరసాపురానికి చెందిన రైతు ఇటీవల పశువైద్యులు కె.కోటేశ్వరరావుకు ఫోన్ చేసి ఆవుకు గొంతులో ఏదో అడ్డం పడిందని, ప్రాణాపాయ స్థితిలో ఉందని చెప్పడంతో వెంటనే హుటాహుటిన తన సిబ్బందితో రైతు దగ్గరకు వెళ్లిన వైద్యులు ఆవును పరిశీలించారు. వెంటనే గొంతు ఆపరేషన్ చేసి గొంతులో అడ్డం పడిన తాటి గింజను తొలగించడంతో ఆవు ప్రాణాపాయ పరిస్థితి నుంచి బయటపడిందని రైతు వెంకటేశ్వరరావు చెబుతున్నారు. అంతే కాకుండా 300 పశువులకు గుది ఆపరేషన్లు, 50 పశువులకు అత్యవసర ఆపరేషన్లు, 84 పశువులకు కొమ్ము ఆపరేషన్లు నిర్వహించారు. అంతే కాకుండా ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు పశువుల రైతులకు ఎప్పటికప్పుడు అందిస్తుందన్నారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ సూచనల మేరకు ఉచిత వ్యాక్సిన్ క్యాంపులు నిర్వహించి పశువులకు అన్నిరకాల వైద్య సేవలు అందిస్తున్న ఆయన రైతుల మన్ననలు పొందుతున్నారు.

జిల్లా అధికారుల ప్రశంసలు బాధ్యతను పెంచాయి

కాల్వ కోటేశ్వరరావు, మండల పశు వైద్యాధికారి

మండలంలో 2021 జులైలో పశు వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టాను. అప్పటి నుంచి బాధ్యతగా పనిచేస్తూ పశువులకు వైద్య సదుపాయాలు అందిస్తున్నాను. అత్యవసర సమయంలో పశువులకు కచ్చితంగా సమయానికి వైద్యం అందాలి. లేకుంటే చనిపోతాయి. అందుకే పశు మరణాలు తగ్గించేందుకు అత్యవసర పరిస్థితుల్లో సైతం ఆపరేషన్లు చేయాల్సిందే. అలా ఎన్నో ఆపరేషన్లు చేసి పశువుల ప్రాణాలు నిలబెట్టగలిగాం. రైతులు ఎంతో సంతోషిస్తున్నారు. నా సేవలు గుర్తించి జిల్లా అధికారులు ఉత్తమ జిల్లా పశువైద్యునిగా ఎంపిక చేసి ప్రశంసాపత్రం అందించారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి, కలెక్టర్ వెట్రిసెల్వి చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకోవడం సంతోషంగా ఉంది. వారి ప్రశంసలు నా బాధ్యతను పెంచాయి. మరింత కష్టపడి పనిచేస్తూ పశువులకు వైద్యం అందిస్తాను.

తెలుగు జర్నలిజానికి బాటలు వేసిన 'ఆంధ్ర విశారద'

ప్రముఖ సాహితీవేత్తగానూ, చక్కని సినీ రచయితగానూ ప్రఖ్యాతి చెందిన 'ఆంధ్ర విశారద' తాపీ ధర్మా రావుగారు కొత్త తరానికి కావలసిన కొత్త తరహా తెలుగు పత్రికలను అందించిన మేటి పాత్రికేయుడు. ఆయన అనేక పత్రికలకు సంపాదకత్వ బాధ్యతలను నిర్వహించిన సాహితీ పాత్రికేయుడు. నేటి ఒరిస్సాలోని బరంపురంలో 1887లో జన్మించిన తాపీవారు కందుకూరి వీరేశలింగం ప్రభావంతో సంఘ సంస్కరణ కాంక్ష వ్యక్తం చేశారు. తొలుత గ్రాంథిక భాష పట్ల మొగ్గుచూపారు. మద్రాసులోని పచ్చయప్ప కళాశాలలో 1909లో బిఏ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడైన ఆయన 1912లో 'కొండెగాడు' అనే పత్రికను నిర్వహించారు. ఆ తరువాత జస్టిస్ పార్టీ అధికార పత్రిక ' సమదర్శిని' ఎడిటర్‌గా నియమితులయ్యారు. రాజకీయాలను సాహిత్యాన్ని సముచిత రీతిలో కలగలిపే వారు.

ఆ తరువాత పిఠాపురం రాజు స్థాపించిన పీపుల్స్ పార్టీ తరపున ప్రారంభించబడిన "జనవాణి" పత్రికకు సంపాదకుడిగా వ్యవహరించారు. ఆ పత్రికను పూర్తిగా వ్యవహారిక తెలుగులో నిర్వహించిన తొలి సంపాదకుడాయన. 'జనవాణి' ద్వారా ఆయన ఎన్నో ప్రయోగాలు చేశారు. విదేశీ పత్రికలను సేకరించి, వాటి స్ఫూర్తితో తెలుగు పత్రికకు అనువైన పద్ధతిని రూపొందించే వారు. ముఖ్యంగా గ్రాంథిక భాషను పూర్తిగా విడనాడి జనం నిత్యం పలికే భాషను పత్రికలో ప్రవేశపెట్టారు. ఆ పత్రికలోనే నార్ల వెంకటేశ్వరరావు న్యూస్ ఎడిటర్‌గా పూర్తిస్థాయి పాత్రికేయుడిగా అభివృద్ధి చెందారు. 'జనవాణి' మూతపడిన తరువాత తన అభిప్రాయాలను వెలిబుచ్చేందుకు 'కాగడా' పేరుతో ధర్మారావు ఒక వారపత్రికను నిర్వహించారు. అది రెండేళ్లు మాత్రమే నడిచింది. కొన్నాళ్లకు 'జనవాణి' పేరిట వారపత్రికను ప్రారంభించారు. అది కమ్యూనిస్టు తదితర అభ్యుదయ శక్తులపై తీవ్ర నిర్బంధ విధానం సాగుతున్న కాలం. అలాంటి పరిస్థితుల్లో జనవాణి పత్రికకు, అంతకుముందు ప్రజాశక్తి దినపత్రికలో పని చేసిన తన కుమారుడు మోహనరావు, బమ్మారెడ్డిగార్లను ఉప సంపాదకులుగా నియమించి, ప్రగతిశీల పత్రికగా వెలుగొందడానికి అవకాశం కల్పించారు. కాటూరు ఎలమర్రుల్లో జరిగిన ఘోర దురంతాలను బట్టబయలు చేయడానికి, కమ్యూనిస్టు తదితర

అభ్యుదయకారుల కార్యకలాపాల ప్రచురణకు అవకాశం కల్పించారు. 'కొండెగాడు', 'కొత్వాల్ సందేహి' అనే మారు పేర్లతో వందలాది వ్యాసాలను రాసేవారు. ఆయన రచించిన పలు విమర్శనాత్మక గ్రంథాలు- 'దేవాలయాల మీద బూతుబమ్మలెందుకు? 'పెళ్ళి-దాని పుట్టుపూర్వోత్తరాలు', 'కొత్త పాళీ' 'ఇనుప కచ్చడాలు' వంటి గ్రంథాలను తెలుగు ప్రజలకు అందించారు. 'మాలపల్లి', 'రైతుబిడ్డ' వంటి సాంఘిక ప్రయోజనంగల చలనచిత్రాలకు సంభాషణలూ రాశారు. ప్రథమాంధ్ర అభ్యుదయ రచయితల మహాసభకు అధ్యక్షత వహించారు. 'తాతాజీ' అని అందరి ఆదరాభిమానాలను మెండుగా చొరగొన్న తాపీ ధర్మారావుగారు 1973 మే 8వ తేదీన కన్నుమూశారు. ఆయన నేటి తెలుగు జర్నలిజానికి రాచబాట వేసిన మార్గదర్శి.

ఎంతో ఆహ్లాదకరం.. ముంజులూరు జలపాతం



ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ముంజులూరు వాటర్ ఫాల్స్. ముంజులూరు దట్టమైన అటవీ ప్రాంతంలో ఏర్పడిన సహజసిద్ధ జలపాతం. ఏజెన్సీ ప్రాంతం కావడంతో ప్రయాణ మధ్యలో ఆహ్లాదకరమైన గిరిజన సాంప్రదాయ దృశ్యాలు కనువిందు చేస్తాయి. ఇతర జిల్లాలు, రాష్ట్రాలు, సుదూర ప్రాంతాల నుంచి యాత్రికులు వస్తుంటారు. ముంజులూరు ప్రయాణం ఆహ్లాదకరం, ఉత్సాహం, ఉల్లాసం, ఆనందంగా సాగుతుంది.

మండలంలో మరెన్నో పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి.

ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం ముంజూలూరు గ్రామ శివారులో దట్టమైన అటవీ ప్రాంతంలో కొండల్లో కురిసే విస్తార వర్షాలకు కొండ వాగుల ద్వారా చేరుకున్న నీరు కొండలూ, చాప రాళ్లపై నుంచి కిందకు పడుతూ ఎంతో అందంగా ఆహ్లాదకరంగా సహజ సిద్ధంగా ఏర్పడిన జలపాతమే ముంజులూరు జలపాతం. ఈ ముంజలూరు వాటర్ ఫాల్స్‌ను చూడడానికి వివిధ జిల్లాలు, రాష్ట్రాల నుంచి, సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు, యాత్రికులు వస్తున్నారు. ఈ ముంజులూరు జలపాతం కన్నాపురం నుంచి 15 కిలోమీటర్ల దూరం ఉంటుంది.

ముంజులూరు చేరుకున్నాక అక్కడి నుంచి దట్టమైన అటవీ ప్రాంతంలో రెండు కిలోమీటర్లు నడవాల్సి ఉంటుంది.

మోటార్‌సైకిల్ అయితే జలపాతానికి చేరుకోవచ్చు. ముంజులూరు జలపాతం చేరుకునే మార్గం మధ్యలో దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో చుట్టూ గిరిజన సాంప్రదాయాలతో కోయ కొండరెడ్డి గిరిజన ప్రజలు నివాసం ఉంటూ ఉంటారు. వారి సాంప్రదాయ వస్త్రధారణ, జీవన విధానం చూడడానికి ఎంతో చూడముచ్చటగా ఉంటుంది. ముంజులూరు వాటర్ ఫాల్స్ అనేసరికి యువకులు, యాత్రికులు ఎంతగానో ఇష్టపడిపోతారు. దట్టమైన అటవీ అందాల మధ్య ప్రయాణిస్తూ జలపాతం చేరుకున్నాక ఎంతో ఉత్సాహంతో ఉల్లాసంతో జలపాతం నీటిలో తడుస్తూ ఆనందాన్ని పొందుతారు. ముంజులూరు జలపాతానికి వచ్చి ఉల్లాసంగా పాల్గొన్నాక తడిసిన వస్త్రాలను మార్చుకోవడానికి మహిళలకు ఇబ్బంది లేకుండా అక్కడ ఉన్న గిరిజన యువత ప్రత్యేకంగా ఎదురు బొంగులతో నిర్మాణం చేశారు. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో ప్రయాణం కొంచెం ప్రమాదంగా ఉంటుంది. జలపాతం వద్ద ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణనష్టం జరిగిన సంఘటనలు ఉన్నాయి. ప్రయాణం జాగ్రత్తగా ఉండాలి.

ముంజులూరు జలపాతానికి వెళ్లడానికి ఉండే మార్గం చాలా ప్రమాదకరంగా ఉండేది. అక్కడ ఉన్న గిరిజన గ్రామాలకు చెందిన యువత మార్గం మధ్యలో ఉన్న ప్రమాదాలను గుర్తించి మార్గాన్ని కొంతవరకు బాగు చేశారు. అందుకుగాను ఆ గ్రామాల యువత ముంజులూరు వాటర్ ఫాల్స్‌కి వెళ్లడానికి రూ.20 టిక్కెట్‌ను పెట్టారు. అంతేకాకుండా కొంతకాలం యువత జీవనోపాధి కోసం, యాత్రికుల అవసరాల కోసం బొంగు చికెన్ దుకాణాన్ని ఏర్పాటు చేశారు.

బుట్టాయగూడెం మండలంలో మరెన్నో పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వాటిలో కొన్ని గుబ్బల మంగమ్మ ఆలయం, గుబ్బల మంగమ్మ జల్లేరు జలాశయం, సర్ ఆర్థర్ కాటన్ నిర్మాణం చేసిన నందాపురం కాజ్‌వే, ఉప్పరిల్ల జలపాతం, దట్టమైన అడవుల మధ్య సెలఏర్లు, మరెన్నో జలపాతాలు ఉన్నాయి. ఈ పర్యాటక ప్రదేశాలన్నింటినీ ప్రభుత్వం గుర్తించి అభివృద్ధి చేస్తే స్థానికంగా ఉన్న గిరిజన కొండారెడ్డి గ్రామ యువతకు ఉపాధితో పాటు అభివృద్ధి జరుగుతుంది.